Bodleian Libraries
UNIVERSITY OF OXFORD

This book is part of the collection held by the Bodleian Libraries and scanned by Google, Inc. for the Google Books Library Project.

For more information see:

http://www.bodleian.ox.ac.uk/dbooks

This work is licensed under a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 2.0 UK: England & Wales (CC BY-NC-SA 2.0) licence.

HANNYNGTON

WARS OF THE RAJAS

TELUGU.

Drav.
e 53

132

19 B 33

Indian Institute, Oxford.

THE MALAN LIBRARY

PRESENTED

BY THE REV. S. C. MALAN, D.D.,

*VICAR OF BROADWINDSOR,*

**January, 1885.**

19 c 6, 8

Dravi. e. 53/1

2/6

John C. Harrington

J. J. H.

Harrington

Harrington

THE

# WARS OF THE RAJAS,

BEING THE

# HISTORY *of* ANANTAPURAM.

WRITTEN IN TELUGU; IN OR ABOUT THE YEARS

1750—1810.

TRANSLATED INTO ENGLISH,

BY


CHARLES PHILIP BROWN,

OF THE MADRAS CIVIL SERVICE,
TELUGU TRANSLATOR TO GOVERNMENT,
SENIOR MEMBER OF THE COLLEGE BOARD, ETC.



MADRAS:
PRINTED AT THE CHRISTIAN KNOWLEDGE SOCIETY'S PRESS,
CHURCH STREET, VEPERY.
1853.

BODLEIAN
-9 AUG 1928
LIBRARY

TELUGU

# HISTORIES AND TALES.

## THE ANNALS OF HANDEH ANANTAPURAM

### CHAPTER FIRST.

1. పంపా తీరమందు, విద్యానగరమును బుక్కరాయలవారు యేలుచున్నుండగా, అతని ప్రధానియైన చిక్కప్ప వొడయరు శాలివాహన శకం ౧౨౭౭ అగునేటి క్రోధి సంవత్సరమందు ఆ విద్యానగరమునకు దక్షిణ ప్రాంత్యమందు, నందేల తాలూకాలో దేవరకొండ దగ్గిర కంబుగిరి స్వామి కొండలో పుట్టి వస్తూ వుండిన పాండు నదిని చూచి, దాన్ని దేవరకొండకు అడ్డము కట్టి, వొక తటాక నిర్మాణము చేసి, ఆ తటాకపు రెండు మరవల రెండు గ్రామములు కట్టించి, తూర్పు మరవను వున్న గ్రామమునకు బుక్కరాయ సముద్రమని తమ దొరవారి పేరున్ను, పడమటి మరవను వున్న గ్రామమునకు అనంతసాగరమని తమ దొరసాని పేరున్ను పెట్టి, యీ బుక్కరాయ సముద్రమునకు దక్షిణం ౧౭ కోసుల మీద యలమంచినాడు తాలూకాలో వరగిరి వెంకటేశ్వరుని కొండలో పుట్టి ప్రవహిస్తూ వున్న చిత్రావతి నదిని చూచి, అచ్చటనున్ను మునుపటి వలెనే వొక తటాకమును నిర్మాణము చేయించి, దానికి వుభయ పార్శ్వముల రెండు గ్రామములు కట్టించి, తూర్పు మరవను వున్న గ్రామమునకు బుక్కపట్నమనిన్ని పడమటి మరవను వున్న గ్రామమునకు అనంతసాగరమనిన్ని పేర్లు బెట్టి, ఆ స్థలమందే అదృశ్యమై పోయెను.

2. మరి కొన్నాళ్లకు, బుక్కరాయసముద్రపు చెరువు అధికముగా నిండి, రెండు మరవలు పట్టక, పూర్ణముగా పారుతూ వుండెను. అది ఆయగాండ్లున్ను పురజనులున్ను వచ్చి చూస్తూ వుండగా, వారిలో వొక స్త్రీకి ఆవేశము వచ్చి, నేను గంగాభవానిని; నాకు ఆహారము నరబలి యిస్తే, యిక్కడ నిలుస్తున్నాను; లేనట్టాయెనా, నిలవనని చెప్పెను. అంతట, అక్కడ వున్న గ్రామస్థులు పెద్దమనుష్యులు బలి నిమిత్తమై యోచన చేస్తూ వున్నంతల్లో, బుక్కరాయసముద్రములో వున్న బసిరెడ్డికి కడగొట్టు యేడో కోడలు యీడేరని ముసలమ్మ అనే చిన్నదాన్ని గంగాదేవి పూని, నీవు బలి రావలెనని చెప్పెను. ఆమె అదేప్రకారము బలికి సిద్ధమై, పసుపు కుంకుమ పెట్టుకొని, పుతికిన చీర కట్టుకొని, నిమ్మపండ్లు చేత పట్టుకొని, యిల్లు బయలుదేరి, కట్ట మీదికి వచ్చి, మామయైన బసిరెడ్డి కాళ్లకు మ్రొక్కి, పురజనులకు నమస్కారము చేసి, నాకు గంగా భవాని సెలవు అయినది; నేను బలియై పోతానని చెప్పి, రాయభారం తూముకు ముప్పది అడుగుల మీద గుమ్మడ * పడి, ఆ గుమ్మడ లోనికిన్ని కట్ట లోనికిన్ని నెర్రివిడిచి వుండగా, ఆ నెరి గుండా లోనికి పోయి నిలిచినందున, ఆ కట్టపైన మన్ను రాయి వేసిరి. గనుక, అంతట ఆ కట్ట నిలిచెను.

3. ఆ మరునాడు, యీ బలియై పోయిన ముసలమ్మ ఆ గ్రామములో స్త్రీజనం మీద ఆవేశము వచ్చి, శిలారూపముగా తన ప్రతిమను చేసి చెట్టు కింద పెట్టి కొలవండి అని చెప్పినందున, ఆ ప్రకారమే పెట్టి కొలుస్తూ వున్నారు. గాని, దేవాలయము లేదు. మరిన్ని, ఆ గుమ్మడ దగ్గిర వచ్చేపొయ్యే జనులు ముసలమ్మా అని పిలిస్తే, ఆమె ఓ అని పలుకుతూ వుండెను. ఇట్లా వుండగా, ఒకనాడు రాత్రి గడ్డికి పొయ్యేవారు అదేప్రకారము పిలిస్తే, పలికెను. అదివిని, చచ్చినా నీ కావరము విడువక పోతివి అని వారు చెప్పినందున, ఆ దినమునుంచి పలికేది లేదు. ఆ ముసలమ్మకు అది మొదలుకొని పూజ నడుస్తూవున్నది. యీ బుక్కరాయసముద్ర అనంతపురములవంటి గొప్ప గ్రామములున్ను యీ చెరువులవంటి గొప్ప చెరువులున్ను యితరస్థలములలో యెక్కడా లేవు.

* గుమ్మడ, అనగా, గండి, a chasm.

4. తర్వాత, ఆ విద్యానగరమును బుక్కరాయుల వంశస్థుడైన కృష్ణరాయులు రాజ్యము చేస్తూవుండి, శాలివాహన శకం ౧౪౫౨ అగునేటి క్రోధన సంవత్సర జ్యేష్ఠ శు ౬ భానువారమున చనిపోయెను. ఇతని భార్యలు చిన్నాదేవి తిరుమలదేవి అనే వారు యిద్దరు. వీరికి ఆడుబిడ్డలు మాత్రము కలిగి వున్నందున, తిరుమలదేవి కొమార్తెను రామరాయులవారున్ను, చిన్నాదేవి కుమార్తెను అతని తమ్ముడైన తిరుమల రాయులున్ను, వివాహాము చేసుకొనిరి. పిమ్మట, ఆ దొరసానులు యిద్దరున్ను ఆ రామరాయుల వారికి అళియపట్టము కట్టవలెనని, సంకల్పించి వుండిరి.

5. ఇంతలో, లోగడ సంస్థానములో వున్న బొక్కసం గొల్ల సలకం తిమ్మయ్య అనేవాడు, రాజ్యము అరాజకమై బొక్కసం తన స్వాధీనములో వున్నందున, చతురంగ బలాన్ని వదిల పరచుకొని, అల్లుండ్లైన రామరాయ తిరుమలరాయులను పట్టి, చెరవుంచ వలెనని యోచించగా, యీ వర్తమానమును వారు విని, ఆ దేశమును విడిచి పారిపోయి, పెనుగొండ సంస్థానములో సంచరించుచు, కొంత సైన్యమును కూర్చుకొని, ఆదవాని చేరి, అక్కడ నాలుగు నెలలు నివాసము చేసి, కందనూలు గద్వాల ఆ ప్రాంత్యముల యందు మరి కొంత సైన్యమును కూర్చుకొని, సకల సేనా సమేతులై, విద్యానగర మునకు దండెత్తి వచ్చిరి. ఈ వర్తమానమును చారుల వల్ల ఆ సలకం తిమ్మయ్య విని, తనకు సహాయ నిమిత్తము కుదుబుషహా - ౧ * - పరీదుషహా - ౧ - నిజాంషహా - ౧ - అల్లి అదల్ షహా - ౧ - వీరు మొదలైన వారికి, మీరు చతురంగ బలసమేతులై వస్తే, యీ రాజ్యము యావత్తు మీ స్వాధీనము చేస్తానని, జాబులు వ్రాయించి పంపించెను.

6. వారు చూచుకొని, ఆ ప్రకారమే సకల సేనా సమేతులై వచ్చి, విద్యా నగరమునకు పెక కోసు దూరమున దిగిరి. ఆ రామరాయ తిరుమల రాయులు యీ సమాచారము తెలుసుకొని, సొన్నలాపురమందు వున్న హండే హనుమప్పనాయుడు బహుశూరుడు అనేటట్టుగా విని, అతణ్ని సైన్య యుక్తముగా పిలిపించి కొలువు పెట్టుకొని, విద్యానగరానకు రెండు పరుగుల మీద తుంగభద్రా నదీ తీరమందు పోయి దిగిరి. ఆ పాదుషహాల సైన్యమునకు యీ స్థలం కొత్త గనుక, వారు సలకం తిమ్మయ్యగారి సైన్యమును ముందు వుంచుకొని, యుద్ధమునకు ప్రయత్న పడిరి.

* Where several names come one after another, the numeral 1 is placed after each name.

7. ఈ సంగతి, ఆ రామరాయ తిరుమలరాయుల వారు విని, పట్టుకు గలు రణభేరి వేయించి, యెదుట వున్న సలకం తిమ్మయ్య సేన మీద పడి యుద్ధము చేయగా, ఆ సలకం తిమ్మయ్య సేన వీడు గొల్ల; ధనవంతుడై సంస్థానమును ఆక్రమించవలెనని, ప్రయత్నము చేసినాడు; వీనికి సహాయము చేస్తే, మనకు దైవ సహాయము కానేరదని తలంచి, యుద్ధభూమిని తొలగి పోయినందున, సలకం తిమ్మయ్య ఆ జగడములో చిక్కి, ప్రాణము విడిచెను.

8. ఈ వర్తమానము దొరసానులు విని, ప్రధానులను పిలిపించి, రామరాయ తిరుమలరాయులను పిలుచుక వచ్చి పట్టణము వారి స్వాధీనము చేయమని సెలవు యిచ్చినందున, ప్రధానులు ఆ ప్రకారమే ఎదుర్కొని పోయి, వారిని తోడుకొని వచ్చి పట్నము వారి స్వాధీనము చేసిరి.

9. తర్వాత, ఆ రామరాయ తిరుమలరాయులు ఆ పాదుషహాల మీదికి యుద్ధమునకు పోవలెనని యోచించి, స్థలములో వున్న సైన్యం తమ దగ్గర వున్న సైన్యం యీ రెంటిని మూడు భాగములు చేసి, సొన్నలాపురం హండే హనుమప్పనాయుణ్ని పిలిపించి, నీవు బహు శూరుడవు; నీకు కొంత సైన్యమును యిస్తున్నాము; నీ దగ్గర వున్న సైన్యమునున్ను సన్నాహము చేసుకొని, నిజాంషహా మీదికి పోయి, యుద్ధము జరిగించి, జయించి వస్తే, నీ మనస్సు ప్రకారము యియ్యనయ్యాని అని చెప్పి, కొంత సైన్యమును యిచ్చి పంపించి, రామరాయులవారు కొంత సైన్యముతో కుతుబుషహా మీదికిన్ని, తిరుమలరాయులవారు కొంత సైన్యముతో పరీదుషహా మీదికిన్ని పోయి, అఘోర యుద్ధము చేయగా, పాదుషహాలు యుద్ధరంగమందు నిలువలేక, పలాయనులై పోయిరి.

10. ఈ హండే హనుమప్పనాయుడు నిజాంవారిని పట్టుకవచ్చి, రామరాయ తిరుమల రాయులవారికి కానుక యిచ్చెను. అందుమీదట, వారికి బహు దయవచ్చి, మెచ్చి నీ మనస్సులో యేమి వున్నదో అడుగుమని హండే హనుమప్పనాయడితో సెలవు యివ్వగా, అతడు తమరు దయచేసి యేమి యిచ్చినా, సకల బహుమానములు యిచ్చినట్టే అని మనవి చేసెను. అప్పుడు, తూర్పు దిక్కున వున్న నందేల ౧ - బుక్కరాయ సముద్రం ౧ - ధర్మవరం

౧ - కణెకల్లు ౧ - పడమర వుండే బళ్లారి కారుగోడు ౧ - యీ గ్రామములున్ను బిరుదులున్ను యివ్వగా, ఈ హాండే హనుమప్పనాయుడు రాయులవారి వద్ద సెలవు తీసుకొని, శాలివాహన శకం ౧౪౯౧ అగునేటి శుక్ల నామ సంవత్సర మార్గశిర మాసమందు నందేలకు వచ్చి చేరి, ఆ తాలూకా విచారించుకొని, అచ్చటనుంచి బుక్కరాయ సముద్రమునకు వచ్చి, అక్కడి తటాకమును చూచి దొడ్డదని తెలుసుకొని, యీ గ్రామములోని కోట ముందర నగరు కట్టించి, చుట్టూ వెలపటి కోట నిర్మాణము చేసుకొని, రాజ్యమును విచారిస్తూ వుండి, శాలివాహన శకం ౧౫౦౪ అగునేటి చిత్రభాను సంవత్సరములో కాలము చేసెను.

11. పిమ్మట, యితని కుమారుడు యిమ్మడి హంపానాయుడు రాజ్యాభిషిక్తుడై, శాలివాహన శకం ౧౫౦౫ అగునేటి స్వభాను సంవత్సరం మొదలు, శాలివాహన శకం ౧౫౧౭ అగునేటి మన్మథనామ సంవత్సర పర్యంతం, రాజ్యమును పాలించి, యీ బుక్కరాయ సముద్రము లోనే గతించెను.

12. ఇతని కుమారుడు మలకప్పనాయుడు రాజ్యము చేయుచున్న సమయమందు, విద్యానగరమును పాలించే తిరుమల రాయుని కుమారుడు శ్రీరంగ రాయులవారు, చంద్రగిరి తట్టు రాజ్యము విచారించేటందుకు పోయి వుండగా, వుత్తరాననుంచి పాదుషహాల వారి సైన్యము తిరుగా విద్యానగరమును తీసుకోవలెనని వచ్చి, కల్యాణ కల్బురిగి ప్రాంత్యమందు దిగెను. ఈ వర్తమానము శ్రీరంగరాయులు విని, తాను శీఘ్రముగా విద్యానగరము చేరి, అక్కడినుంచి సైన్య సహితముగా కల్యాణ కల్బురిగి ప్రాంత్యానకు వచ్చి, యీ బుక్కరాయ సముద్రములో వున్న మలకప్పనాయుణ్ని సైన్య సమేతముగా పిలుపించుకొని, పోయి, యుద్ధము చేసి వారిని పరాజితులను చేసెను.

13. తర్వాత, ఆ మలకప్పనాయుడు రాయులవారి వద్ద సెలవు తీసుకొని వచ్చి, బుక్కరాయ సముద్రములో నూతనముగా పేట కట్టించి, వికారి సంవత్సర పర్యంతము రాజ్యము చేస్తూవుండగా, విద్యానగరానకు తిరుగా ఆ పాదుషహాలు సైన్యముతో వచ్చి యుద్ధము చేసిరి. ఆ యుద్ధములో శ్రీరంగరాయులు నిర్వాహకము చేయలేక, వారి చేతికి చిక్కినందున, పా

దుషహాలు పెనుగొండ మొదలుకొని సర్వ రాజ్యము తమస్వాధీన పరుచుకొని, రాజ్యము చేస్తూవుండిరి. అంతట, యీ మలకప్పనాయుడు శ్రీరంగరాయులవారి సమాచారమును విని, తురకలు ప్రబలులు అయినారు; యికమీదు రాచకార్యము చేస్తే, బాగు లేదని తలంచి, ఆ పాదుషహాలను అనుసరించి, వారి నవుకరీలో చక్కగా నడుచుకొంటూవచ్చెను. గనక, యీ మలకప్పనాయుడి మీద వారికి మిక్కిలి దయవచ్చి, పూర్వము రాయులవారు యిచ్చిన రాజ్యమున్ను యెలమంచి నాడుకు చెల్లే బుక్కపట్నం ౧ అనంత సాగరము ౧ యీ రెండు గ్రామములున్ను వీటికి చెల్లే పుర గ్రామములున్ను పాదుషహా వజీరా అనే బిరుదున్ను దయచేసిరి.

14. ఆవల, యీ మలకప్పనాయుడు బుక్కరాయ సముద్రము చేరి, యీ స్థలమందు వుంటే తనకు పుత్రసంతానము లేదనే చింత చేత, వొకదినము పడమట వున్న అనంతసాగరము తట్టు స్వారి వచ్చి, యీ గ్రామములో వున్న చిన్నపరెడ్డి వంశస్థుడైన ఎల్లారెడ్డి వారిని చూడగా, వారు ధణీలు వచ్చినారు; మాయింటికి వచ్చి తాంబూలము తీసుక పొమ్మని మనవి చేసిరి. ఆ ప్రకారమే వారి యింటికి పోయి, ఆ యిల్లు సంతానవృద్ధి కరముగా వుండడమును చూచి, యిచట నగరు కట్టుకొని వుంటే, తనకున్ను సంతానవృద్ధి అయ్యీని అని, మనస్సులో తలంచి, ఆ వేళ వారిచేత తాంబూలము తీసుకొని, బుక్కరాయ సముద్రము వచ్చి చేరి, యీ వర్తమానము తన భార్యలకు చెప్పి, మరునాడు ఎల్లారెడ్డిని పిలుపించి, మీరు వుండే స్థలము మాకు కావలసి వున్నది; యియ్యవలెనని అడుగగా, మీ స్థలము మీకు యిచ్చేదానికి చిరతయేమి, దయచేయండి అని చెప్పిరి.

15. అంతట, అతనికి వస్త్రతాంబూల బహుమానములను యిచ్చి అంపించి, మరి పది దినములు పోయిన తర్వాత, యీ ఎల్లారెడ్డిగారి యింటి పట్టున నగరు కట్టించి, యిక్కడనే నిలిచిరి. అది మొదలు యీ గ్రామమునకు హండే అనంతపురమనే నామధేయము కలిగెను. ఈ ఎల్లారెడ్డి మొదలయిన వారు కోట వెలపట కాలు గడియ దూరములో వున్న మరవ తీసి, ముందు కాలుగడియ దూరమునకు సాగించి చెరువు కట్ట కట్టించి, మరవ యీవల విడిచి, మునుపటి మరవన యిల్లుపేట కట్టించుకొని వుండిరి.

16. ఈలాగున కొన్నాళ్లు జరిగిన మీదట, యీ మలకప్పనాయుని పట్టపు భార్య సిద్ధ రామమ్మగారికి, దేవప్పనాయుడు, చిన్న రామప్పనాయుడు, నిచ్చమద లింగప్పనాయుడు, హంపానాయుడు, అని నలుగురు కుమాళ్లు కలిగిరి. వీరిలో జ్యేష్ఠపుత్రుడు అయిన దేవప్పనాయునికి, తూర్పుదిక్కున నందేలసీమ, రెండవ కుమారుడైన చిన్న రామప్పనాయునికి బళ్లారి కురుగోడుసీమ, మూడవ కుమారుడైన నిచ్చమద లింగప్పనాయునికి కందుప్ప కణకల్లుసీమ, నాలవ కుమారుడైన హంపానాయునికి అనంతపురం, బుక్క సాగరం, బుక్క పట్నం, ధర్మవరంసీమ, యీ ప్రకారంగా యీ హండే మలకప్పనాయుడు పంచి యిచ్చి, వారివారి స్థలాలు వారు వారు యేలుచుండగా, మరి కొన్నాళ్లకు శాలివాహన శకం ౧౫౪౨ అగునేటి సిద్ధార్థినామ సంవత్సరమందు, కాలము చేసెను.

17. తర్వాత, నాల్గవ కుమారుడైన హంపానాయుడు రాజ్యము చేస్తూ, యీ అనంతపురం మొదలయిన స్థళాలలో వుండి, శాలివాహన శకం ౧౫౫౪ అగునేటి ప్రజోత్పత్తి నామసంవత్సరమందు కాలంచేసెను. ఇతని కుమారుడు ప్రసన్న శిద్దప్పనాయుడు ఆంగీరస నామ సంవత్సరం పట్టాభిషేకము చేసుకొని, రాజ్యము చేసి, శాలివాహన శకం ౧౫౮౨ అగునేటి వికారి నామసంవత్సరమందు కాలంచేసెను. ఇతని కుమారుడు పవాడప్ప నాయుడు తండ్రి మర్యాద ప్రకారమే రాజ్యము చేసి, శాలివాహన శకం ౧౫౯౪ అగునేటి విరోధికృతు సంవత్సరమందు కాలముచేసెను.

18. ఆ సమయమందు రాయదుర్గం పెద్ద తిమ్మప్పనాయుడు ధర్మవరం ఠాణా వేసుకొని, అచ్చటనే వుండెను. ఈ పవాడప్పనాయుని కుమారుడు శిద్దప్పనాయుడు నాలుగు సంవత్సరముల చిన్నవాడు. గనుక, యితని తల్లి సిద్ధరామమ్మ యీ సిద్దప్పనాయుణ్ని ముందర వుంచుకొని, రాజ్యము చేస్తూ వుండగా, శాలివాహన శకం ౧౫౯౫ అగునేటి పరీధావి నామ సంవత్సరము నుంచి నాలుగు సంవత్సరముల ఖండిణి పయికం రావలెనని, కడప నబాబు మయాణా వారు సకల సేనాసమేతులై వచ్చి, పయికం యిచ్చినా సరే, లేక రాజ్యము యిచ్చినా సరేనని, అనంతపురం

గ్రామానకు సమీపం కోనుమీద దిగి, తమ వకీలును అంపించిరి. అతను వచ్చి యీ వర్తమానము చెప్పగా, ఆ సిద్ధరామమ్మగారు విని, తన కుమారుడైన యీ సిద్దప్పనాయుని వెంటబెట్టుక పోయి, మయాణా నబాబువారి దర్శనము చేసి, ఖండిణి తప్పించుకొని, అప్పణ తీసుకొని, హండే అనంతపురము చేరెను. తర్వాత, యీ సిద్దప్పనాయుడు రాజ్యము చేసి, శాలివాహన శకం ౧౬౧౯ అగునేటి ధాతునామ సంవత్సరమందు అనంతపురములోనే కాలముచేసెను.

19. ఇతని కుమాళ్లు ప్రసన్నప్పనాయుడు - ౧ - పవాడప్పనాయుడు ౧. వీరిద్దరిలో పెద్ద కుమారుడైన ప్రసన్నప్పనాయుడు శాలివాహన శకం ౧౬౨౦ అగునేటి ఈశ్వరనామ సంవత్సరం పట్టాభిషిక్తుడై, రాజ్యము చేస్తూవుండగా, శాలివాహన శకం ౧౬౩౩ అగునేటి మన్మథనామ సంవత్సరమందు, కడప నబాబు మయాణా మోచేమియ్యా అనే సుబేదారుడు, రాయదుర్గానకు పోతూ, ఆ దుర్గం తాలూకాలో బూదిగుమ్మ అనే గ్రామానకు ముట్టడి వేసి, యీ ప్రసన్నప్పనాయుని వారిని సేనాసమేతముగా రమ్మని వుత్తరము పంపించెను. అది చూస్తూనే దండుకుపోవలెనని తలంచి, యీ అనంతపురం విచారణకు శిరియప్ప అనే బలిజవాణ్ని నిష్కర్ష చేసి, ఆ శిరియప్పతో రాజ్యము మీద వొక కన్నున్ను చెరువు మీద వొక కన్నున్ను వుంచుము; యీ చెరువు నిండి వున్నందున, తలిపెర కాలువలు త్రవ్వి, వుదకం చెరువులో నల్ల నేలకు పెట్టి, వరిమడి గోచుల మీద సాగించినాము. గనక, ఫలానకు వచ్చినది. జాగ్రతగా వుండవలసినదని ఆనతిచ్చి, సైన్య సమేతముగా తర్లి పోయెను. ఈ శిరియప్ప ప్రసన్నప్పనాయుని ఆజ్ఞా ప్రకారమే, వ్యవహారము చేస్తూ వుండగా, శాలివాహన శకం ౧౬౪౧ అగునేటి వికారినామ సంవత్సర చైత్ర బ౧౨ లు అకాలవర్షణం వర్షించి, చెరువు కొంత నిండెను.

20. తర్వాత, యీ సంవత్సర వైశాఖ బ౹౦ నాడు తిరుగా వర్షించి, అద్భుత ప్రవాహము వచ్చి, రెండు మరవలు నిండి, ప్రవహించి, తూర్పు దిక్కున వొక గండిన్ని పడమటి దిక్కున వొక గండిన్ని పడెను. శిరియప్ప యీ వర్తమానము తమ ప్రసన్నప్పనాయుని వారికి వుత్తరం వ్రాసి పంపించగా,

అది చూచుకొని, ప్రసన్నప్పనాయునివారు నబాబువారికి తెలియచేసి, కొం-
త సైన్యముతో కూడా హాలినాయకుడు అనే సేనాధిపతిని అచ్చటవుం-
చి తాను శీఘ్రముగా తర్లివచ్చి, కూడేరు చేరెను. ఈ వర్తమానము శిరియ-
ప్పవిని, దొరగారు యేమి శిక్షింతురో అని భీతిచేత, తెగిన రెండు గండ్ల
దగ్గర పందిలి వేయించి, యీ రెండు గ్రామములలో వున్న రెడ్లకరణాల ప్ర-
జలను పిలిపించి, రాత్రి పగళ్లు గండ్లకు గడ్డి మన్ను రాయి వేసి, చెరువు కట్ట
కట్టిస్తూ వుండెను. రెండవదినము ప్రసన్నప్పనాయుడు కూడేరునుంచి రాచా-
నపల్లికు వచ్చి, యికను నాల్గు గడియలకు వస్తున్నానని వర్తమానము ముం-
దుగా పంపించి, అదేప్రకారము చెరువు కట్టమీద వస్తూ, శిరియప్ప క్షేమ-
ముగా వున్నాడా అని విచారిస్తూ, ఆ గండ్ల సమీపానకు రాగా, ఈ
శిరియప్ప అధైర్యపడి, నిలిచిన నిలువుననే నేలపడి తన్నుకొని చచ్చిపోయె-
ను. ఈ సమాచారము ప్రసన్నప్పనాయుడు విని, కొంత ధనము యిచ్చి
వాణ్ని సంస్కారము చేయించి, తాను అనంతపురములోకి రాక, ఆ సమీపము-
మందు డేరా వేసుకొని, రాత్రి పగళ్లు అక్కడనే వుండి, ఆ రెండు గండ్లు
ముగియకట్టించి, శాంతి చేయించి, యికను గ్రామములోకి పోదామని తలం-
చి వుండెను.

END OF CHAP. I.

## CHAPTER SECOND.

1. ఇంతలో యీయన భార్య సిద్ధమ్మగారికి రామప్పనాయుడు జ-
న్మించి, నాలుగు సంవత్సరముల చిన్నవాడై వుండగా, తాడిమర్రినుంచి, వసం-
తమ్మ లచ్చమ్మ అనే పరకాంతలు యిద్దరు అనంతపురానికి వచ్చి, తమ కా-
య కష్టం చేసుకొని వుంటూ వుండగా, ఆ గ్రామములో వున్న జనము నగ-
రిలోకి శిశువులకు పాలు మజ్జిగ నిమిత్తం పోతూ వుండగా, వారితో కూ-
డా యీ వసంతమ్మ మజ్జిగ నిమిత్తం పోయినందున, ప్రసన్నప్పనాయునివా-

రు యీయామె రూపు రేఖా సౌందర్యములను చూచి మోహించి, నీవు యెవ్వరిదానవు అని అడిగితే, భోగస్త్రీని అని తనవృత్తాంతము యావత్తున్ను విశదముగా చెప్పుకొన్నందున, నీవు యిచ్చట నాదగ్గరనే వుండమని, ప్రత్యేకముగా నగరి అంచున యిల్లు యిప్పించి, అన్న వస్త్రాలకు నడిపిస్తూ, నిమిషమైనా ఆ వసంతమ్మను, యెడబాయలేక, బుక్క రాయసము ప్రధానకు స్వారి పొయ్యే వేళలలోనున్ను వెంబడి పిలుచుకపోతూ వస్తూ చెరువుకట్ట మీదనే వుండెను. ఈ ప్రకారం వుండగా, యీ వసంతమ్మ అక్క అయిన, లచ్చమ్మ తన చెల్లెలిని దొరవారు దివాణములో వుంచుకొన్నది చూచి, తనకు యేమి వుపద్రవం వచ్చునో అని తలంచి, ప్రయాణమై తాడిమఱ్ఱికి పోయి, అచట వున్న దొర పెద్దతిరుమలనాయుని దగ్గర చేరి.

2. తన చెల్లెలైన వసంతమ్మకు చెప్పి అంపించినది యేమంటే; నీవు యిట్లా పరాధీనంగా వుండేది మంచిది కాదు, నావద్దికి వచ్చినట్టు అయితే; స్వతంత్రముగా వుండవచ్చును. నీవు వున్న చోట ద్రవ్యమును సంగ్రహించుకొని, యేలాగైనా చెర తప్పించుకొని వెళ్లిరమ్మని లోగాలోగా కుట్ర నడిపిస్తూ వుండగా, యీ వసంతమ్మ తన అక్కకు చెప్పి అంపించిన యోచన యేమంటే; నీవు కొంత సైన్యముతో అనంతపురం దేవరకొండ వెంకటేశ్వరుని దర్శన నిమిత్తమై వచ్చినట్టైతే, నీ యిష్ట ప్రకారమే నేనున్ను మా దొరవారి వద్ద సెలవు తీసుకొని అచ్చటికి వస్తున్నాను అని, మారుత్తరం పంపించిన మీదట, ఆ లచ్చమ్మ ఆలాగుననే సైన్య సమేతముగా వచ్చి, యీ దేవరకొండకు పరువు దూరమున వున్న తాడిమఱ్ఱి తాలూకు పసులూరు అనే గ్రామము దగ్గర కొంత జనాన్ని అనుపు వుంచి, మితజనముతో దేవరకొండ ప్రవేశించెను. యీ పోబడి వసంతమ్మ విని, ప్రసన్నప్పనాయునివారితో మా అక్క లచ్చమ్మ దేవరకొండ వెంకటేశ్వరుని దర్శనానకు వచ్చి వున్నది. ఆమె దర్శనం బహు దినాలనుంచి నాకు లేదు. గనక, నేనున్ను అక్కడికి పోయి, ఆమెను చూచి, దేవతా దర్శనమున్ను చేసుకొని, సాయంకాలానకు యిక్కడికి వస్తున్నాను అని చాలా మనవి చేసుకోగా, యీ ప్రసన్నప్పనాయునివారు కొంత జనాన్ని వెంబడి యిచ్చి, జాగ్రతగా పోయి సాయంకాలానకు రమ్మని, సెలవు యిచ్చి అంపించగా.

3. ఈ వసంతమ్మ ప్రయాణమై కొంత దూరము పోయిన మీదట, ప్రసన్నప్పనాయుని మనస్సుకు సంశయము తోచి, తిరుగా యిక్కడినుంచి పదిమందిని పంపించి, వెనక్కు పిలిపించి, మేము గ్రామము చేరిన తర్వాత కొంత జన సహాయము యిచ్చి అంపిస్తున్నాను అని, ఆ వేళకు సమ్మతి చెప్పి నిలిపినందున, దొరవారితో యెవరు యేమి చెప్పిరో, కోటకు పోతే తమ అక్క వద్దికి చేరే యోగము లేదని, మనస్సున చాంచల్యము పుట్టి, ఆ రాత్రి ప్రసన్నప్పనాయునివారు నిద్రిస్తూ వుండగా, అచ్చట వున్న ద్రవ్యమును యావత్తు నడుముకు తొడలకు బిగియకట్టి, అది కానరాకుండా పైన చీర కట్టుకొని, పరుపుమీద వున్న కఠారి తీసి ఆ ప్రసన్నప్పనాయుని గొంతు కోసి, తాను వెళ్లి పోవలెనని పోతూ వుండగా, కన్నులు కానరాక, ఆ చుట్టుపక్కలనే తిరుగుతూ వుండెను.

4. ఆ సమయమందు దొర డేరా చుట్టూ వున్న పహరావాండ్లున్ను దళవాయి పాలినాయకుడు మొదలయిన వారున్ను కాగడ ముట్టించి, డేరాలోకి పోయి, దొరవారు కంఠగత ప్రాణులై వున్నదిన్ని యీ వసంతమ్మ డేరాలోనుంచి బయిట వచ్చి తప్పించుకపొయ్యేదిన్ని చూచి, ఆమెను లోగా పిలుచుక వచ్చి, యీ పని చేసినవారు యెవరని విచారించగా, కంఠగత ప్రాణముతో వున్న యీ ప్రసన్నప్పనాయుడు హస్తసంజ్ఞ చేత యీ వసంతమ్మ తట్టు చూపగా, తొత్తువడుచులను పిలిపించి, యీమెను శోధన చేయించగా, వారు ఆ పదార్థపు తిత్తులను చూచి, అవి తీసి దళవాయి మొదలయిన వారివద్ద తెచ్చి వుంచిరి.

5. పిమ్మట, యీ వసంతమ్మను పట్టి రెక్కలు విరిచికట్టించి, చెరలో వుంచి, యీ వర్తమానము యావత్తు బుక్కపట్టములో వున్న ప్రసన్నప్పనాయుని తమ్ముడైన పవాడప్పనాయునివారికి జాబు వ్రాసి పంపించగా, ఆ వుత్తరము వారు చూస్తూనే, అక్కడనుంచి తర్లి చెరువుకట్ట మీదికి వచ్చి, యీ వసంతమ్మను అనంతపురముయొక్క కోటలో చుట్టుగోడ పెట్టించి, దానిలో వుంచగా, ఆమె అందులోనే కాలము చేసెను. యీ ప్రసన్నప్పనాయుడు ఆదినమే శాలివాహనశకం ౧౬౮౧ అగునేటి వికారినామ సంవత్సరమందు కాలము చేసెను.

6. తదనంతరము, యీ వవాడప్పనాయుడు శాలివాహనశకం ౧౬౮౨ అగునేటి శార్వరి సంవత్సరం మొదలు రాజ్యం విచారిస్తూ వుండగా, ఫౌజుదార్లు సర్దారుఖాన్ - ౧ - అల్లీఖాన్ - ౧ - మహమ్మదుఖాన్ - ౧ - వీరు ముగ్గురు కడప మయాణావారి తట్టునుంచి స్వల్ప ఫౌజుతో పెద్దశిరివిరికి యీ మార్గాన పోతూ, అనంతపురానకు అరకోసుమీద జూటూరు వంక గడ్డన డేరా వేసుకొని దిగిరి. యీ సమాచారము యీ వవాడప్పనాయుడు విని, కడప మయాణావారి వకీలు రామాజీ అనేవాడు తనవద్ద వుండగా, అతని వెంబడి కానుక పంపించగా, ఆ ఫౌజుదార్లు ఆ రామాజీని యిక్కడి వర్తమానములు యావత్తు అడుగగా, అతడు చెప్పినది, యీ వవాడప్పనాయుడు కైవుదారుడు, యిక్కడ చైతన్యమేమిన్ని లేదు. మీరు ధణీ దర్శనము అయ్యేమని సెలవు యిస్తే, నేను పోయి వవాడప్పనాయుని వారికి యీ వర్తమానము చెప్పి, మిమ్ముల లోనికి పిలిపించుతున్నాను. మీరు వచ్చి దర్శనమైన తర్వాత, మీ సంస్థానం రూకలు మూడు నాలుగు సంవత్సరముల నుంచి ఖండిణి బాకీ యున్నందున, మా ధణీ సెలవు అయినది.

7. ఏమంటే, మీరు రూకలు యిచ్చినా సరే, లేక, మా వెంబడి వచ్చినా సరేనని మందలించి, దొరను కూర్చుండ పెట్టితే, ఆవల జాగా మీ స్వాధీనము అవునని కుట్ర యుక్తులు చెప్పి, వారివద్ద సెలవు తీసుకొని కోటలోకి వచ్చి, యిక్కడ వవాడప్పనాయుని వారితో, సేనానాయకులు మీ దర్శనానకు వచ్చేమని బహు విధాలా చెప్పి, వారితట్టు నుంచి వకీళ్లను నా వెంబడి పంపించిరి. వారు పెద్దమనుష్యులు; వారిని పిలిపించి వస్త్ర తాంబూల బహుమానములు చేసి దర్శనమిచ్చి అంపిస్తే, మన కార్యాలకు ముందు బహు వుపయోగమని చెప్పగా, అందుకు అనుకూలించి మితంతో వస్తే, అదే ప్రకారం దర్శనమిస్తున్నామని చెప్పినందున, వారిని తోడుక రమ్మని ఆ వకీళ్లతో చెప్పి అంపించగా, వారు ఆ ఫౌజుదార్లను పిలుచుకవచ్చి, మేడమీద నిలిపి, వవాడప్పనాయునివారితో యీ సమాచారము చెప్పగా.

8. వారు గచ్చు పటసాలలోకి దర్శనమునకు వచ్చి, మేడ నుంచి ఆ ఫౌజుదార్లను అక్కడికి పిలిపించగా, వుభయులకు ఆ పటసాలలో దర్శనము అయి, క్షేమ లాభములను విచారించుకొని, మీరు భోజన మజ్జనా

దులు నగరిలో నుంచి పంపిస్తున్నాము అని చెప్పి, వారిని మేడలోకి పంపించిరి. ఆదినము వారు మేడలోనే వుండిరి. గనక, యీ వకీలు రామాజీని పోయి వారికి వుపచారము చేయుమని చెప్పి, పంపించగా, అతను పోయి వారికి వుపచారము చెప్పి, నిన్న మీతో చెప్పిన ప్రకారం యీ ప్రొద్దు దర్శనమునకు వచ్చినప్పుడు, ఖండితము చేసి నిలుపుమని వచ్చిన ఫౌజుదార్ల వకీళ్లతో చెప్పెను.

9. ఆమరునాడు, యీ పవాడప్పనాయునివారి సెలవు అయినది; మీకు అప్పణ యివ్వవలెను రమ్మని ఫౌజుదార్ల వకీళ్లతో చెప్పి, వారిని పిలిపించి, గచ్చు పటసాలలో కూర్చుండపెట్టి, అంతఃపురములోకి పోయి, పవాడప్పనాయునివారితో సేనాధిపతులు వచ్చి యున్నారు, రావలసినదని చెప్పగా, వారున్ను వచ్చి దర్శనము అయి, కూర్చున్న తర్వాత, పైన వ్రాసిన ప్రకారము మా ఖండిణి రూకలు యిచ్చినా సరే, లేక, మా వెంబడి కడపకు నీవు వచ్చినా సరేనని, ఖండితముగా చెప్పగా, అందుకు దొరవారు చెప్పినది; యిప్పుడు ఖండిణి రూకలు యిచ్చేదానికి లేదు; నవాబు సాహేబులవారి సన్నదు వుంటే యియ్యండి; శిరసావహించి మీ వెంబడి వస్తున్నామని చెప్పగా.

10. వారికి కోపము వచ్చి, మేము వచ్చిన్ని సన్నదు కావలెనా? అయినా చింతలేదు; నీవు మా వెంబడి రానేవద్దు; మా నాల్గు సంవత్సరములకు కలిగిన ఖండిణి అచ్చుబడి రూకలు యిక్కడనే యిచ్చి, లేచి పొమ్మని చెప్పి తొందర చేసి దొరను కూర్చోబెట్టిరి. యీ రీతున నిర్బంధము చేసి, అన్నానకు నీళ్లకు పోకుండా నిలిపిన యావద్వర్తమానము కొత్తచెరువు మఠంలో వుండే నిడుమామిడిస్వాములవారు విని, అక్కడనుంచి బుక్కపట్నం కొత్తచెరువులో వుండిన, యావత్తు మందిని తీసుకొని అనంతపురానకు వచ్చి, దొరవారి నగరికి పశ్చిమ భాగమందున్న తమ మఠములో దిగి, యీ దొరవారి బావమరిది చెన్నబసప్పను పిలిపించుకొని, యీ సంస్థానము ముంచేదానికి రామాజి చేసిన కృత్యమని, యావద్వర్తమానము తెలియచేసి, దొరవారిని తీసుకపోవడమునకు తగిన యోచన వుభయులున్ను బాగా యోచించి, చెన్నబసప్పను దిడ్డివాకిలికి వెలపట వుండే పూలతోటలోకి శివపూజకు పూల నిమిత్తమని కూడా పిలుచుకపోయి.

11. గ్రామములో వున్న సేరువ* జనాలు శింగరాయని తిమ్మయ్య, గుండ్లచిన్నయ్య, కంచేటిపాపయ్య, బుక్కరాయసముద్రములో వున్న బొగ్గునందయ్య, కర్నంశెట్టిపేరయ్య, వీరు మొదలయిన వారిని పిలిపించి, సంస్థానము మణిగే యోగ్యంగా వున్నది; దొరవారిని అన్నానకు నీళ్లకు పోకుండా యిక్కట్టు చేసినారు; మనము యిందరు వుండి, యీ ప్రకారం దొరవారు శ్రమపడుతూ వుంటే, చూస్తూ వుండేది మర్యాద కాదు అని చెప్పగా.

12. వారు మేము మనుష్య మాత్రులము; మాతో తీరవలసినది యేమి వున్నది? కోటవాకిళ్లు రెండు వారి స్వాధీనమయి వున్నది; మేము పాత వాండ్లమని లోనికి రానియ్యరు; సరదార్లు కోటలోకి వచ్చే వేళ పది మందితో కూడా వచ్చిరి; పిమ్మట, వారితో కూడా వచ్చిన ఫౌజు యావత్తు కోట చేరెను; మేము యేమైనా దౌర్జన్యము చేసి సాహసము చేయపోతే, వారు పరాణీలు; వారి చేతికి మన ధణి చిక్కి వున్నందున, అతణ్ని యేమి వుపద్రవం చేతురో అని సంశయిస్తూ వున్నాము; మీరు యే యోచన అయినా చేసి, ధణీని నగరిలోకి తీసుకొంటే, ముందు మా చేతను అయినంత పనిలో మీ మాట ప్రకారం నడిపించేము అని చెప్పి మాటయిచ్చినందున.

13. ఈ స్వాములవారు చెన్నబసవ్వ యిద్దరున్ను వారితో చెప్పిన యోచన యేమంటే; దిడ్డి వాకిలిమట్టుకు వారి స్వాధీనము లేదు. మా స్వంత కమతం మడి కోసి పశువులకు గడ్డి నగరికి, కట్టెలు మా కమతగాండ్లు తెస్తూ వున్నారు; మీరు సాగిపోయి ఆ యుధాలతో మా మడి కళ్లం దగ్గరకు వచ్చి, మీ ఆయుధాలు గడ్డి మోపులలో కట్టుకొని మా కమతగాండ్లతో కలసి, నిత్యా పది యిరువై జనాలు ఆ యుధాలతో మా యెనుముల దొడ్డి పాత నగిరిలోకి వచ్చి కూడితే; మీకు అన్నోదకాలు నగరిలోనుంచే విచారించనయ్యాని అని చెప్పి; పేటలో వుండే కమ్మరవానికి చెప్పి అంపించి; ఆకురాయి తెప్పించుకొని, చదరుపటసాలలోనుంచి గచ్చు పటసాలలోకి వుండే దిడ్డి నాగవాసం తెగగోసి, మార్గం సమాత్రం చేసిరి.

---

* Sērva, a Tamil word meaning కట్టుబడివాండ్లు.

14. ఇంతలో యిన్నూటికి జనం ఆయుధాలతో వచ్చి, నగరిలో కూడెను. ముసుపటి సేరువకాండ్లను పిలిపించి, మీ మందితో మీరు సిద్ధంగా వెలపటి పేటలో వుండి, మేము సైగ చేసి నప్పుడు, రాతివూరు వాకిలి దగ్గర ఆయుధములతో కూడా వచ్చి, సిద్ధముగా వుండండి అని చెప్పినందున, ఆదేప్రకారం పేటలో వుండిన జనము యావత్తు సిద్ధముగా వుండిరి. ఆ రాత్రి నాలుగు గడియల మీద, ఫౌజుదార్లు వారి జాతి ఆహార ప్రకారము భోజనము చేసే నిమిత్తమై, యిక్కడ ముగ్గురు శిపాయీలను కావలి వుంచి, తాము లేచి పోయిరి. ఆ సమయములో, నగరిలో వున్న చెన్నబసవ్వగారున్ను నిడుమామిడి కరిబసవస్వాములవారున్ను చదరుపటసాలలో కూర్చుని లోగా పిలుపించగా, జనము యావత్తు వచ్చి శివపూజ యిల్లు బయలున నిలిచెను. ధణికి అన్నం తీసుకపొయ్యే నిమిత్తం ఆడువాండ్లను నలుగురిని బుద్ధిమంతులను పిలిపించి, వారికి వుపాయము చెప్పి పంపగా, వారు అన్నోదకములు తీసుకొని పోయిరి. అక్కడ వున్న శిపాయీలు లేచి వారగా కూర్చున్న తర్వాత, దొరవారితో మెల్లగా మార్గం సనూత్రం చేసి వున్నది; మంది కూడి వున్నది అని చెప్పి, తలుపు చిలుకు తీసి, ధణిని పిలుచుకొని లోన చేరి, వాకిలి భద్రపరచిరి.

15. ఇంతలో, కావలి వున్న శిపాయీలు మోసమాయెనని అల్లరి చేసినది విని, దివాణములోనుంచి కొందరు పావటీల* మీదుగా శిద్ధరామేశ్వరుని మిద్దె యెక్కి, టుపాకులతో పడ కాల్చగా, ఆ ముగ్గురు శిపాయీలు చచ్చిరి. యీ సంగతి ఆమధ్య మహల్లో వున్న ముగ్గురు సరదార్లు విని, తమ జనంతో కూడా ఆయుధపాణులై హజారము వాకిలిగుండా దివాణంలోకి చొచ్చి, దొరను పట్టుకొందాము అని వస్తూ వుండగా, యింతలో యీ చెన్నబసప్ప లోన వున్న యిన్నూరు జనంతో బంకం వాకిలిగుండా హజారం వాకిటికి వచ్చి, అక్కడ వున్న యావత్తు జనాన్ని పొర్లించి, వెలపటి సేడ ముందరికి వచ్చి నిల్చినందున, వారికి వీరికి జగడం అయి బహు జనం హతమయినందున, ఫౌజుదార్ల ఫౌజు విరిగి, రాతివూరు వాకిలి వద్ద నిలిచి, ధనుర్బాణములతో జగడం చేస్తూ వుండ

* పావటీలు (K) అనగా మెట్లు (T) Steps, stairs.

గా, యింతలో పేటలో వున్న సేరువకాండ్లు తమ మందిని వెంట తీసుకొని, పెద్ద పీర్లకట్ట దగ్గెర కూడివుండిరి. యీ ముగ్గురు ఫౌజుదార్లు కొంత జనంతో రాతివూరు వాకిలి నడవలో నిల్చి, మనుష్యులు అడ్డంరాకుండా విల్లంబులతో వస్తూ వుండగా, యీ చెన్నబసప్పగారు తన వద్ద వున్న మందిలో మిక్కిలి సత్తువగల జనాన్ని రాతివాకిలి మీదను యెక్కించి, మిద్దెరాయి పీకించి, కొత్తారులో నుంచి మందు తిత్తులు తెప్పించి, కాల్పించి లోపల వేయించగా, ఆ ఫౌజుదార్లు నిర్వాహకం చేయలేక, వాకిలి తీసుకొని వెలపటికి వెళ్లి వచ్చే సమయములో, మిద్దె మీద వున్న వొక బంట్రోతు తుపాకితో కాల్చగా, వారిలో వొక సరదారుడు అక్కడ పడి చచ్చెను. కొదువ యిద్దరు సరదార్లు జనాలు సహా వెలపటికి వెళ్లివచ్చిరి. యీ చెన్నబసప్పగారు మందితో కూడా వెన్నంటిరాగా, యీ వెలపట వున్న మందికి సరదార్లకు యెదురు నడిచి వచ్చినందున, యీ సరదారు వుభయ మధ్యస్థముగా నిలిచి యుద్ధము చేస్తూ, పేటలో వున్న విరూపాక్షేశ్వరుని దేవాలయం వద్దికి వచ్చే వరకు.

16. అందులో వొక సరదారునికి ఆయువుపట్టున దెబ్బ తగిలి చచ్చెను. అక్కడ నుంచి కదిలించగా సంతపేటలో వున్న బసవేశ్వరుని దేవాలయం దగ్గెరికి వచ్చే వరకు, తక్కిన సరదారుడున్ను కొంత జనమున్ను చచ్చిరి. హతశేషులైన జనులు పారిపోయిరి. అప్పుడు పవాడప్పనాయునివారు దివాణములో నుంచి వెలపటికి వెళ్లివచ్చి, యీపడిన ముగ్గురు సరదార్లను పూడిపించి, వారి సామాను గుర్రాలు మొదలయినవి తమ స్వాధీనము చేసుకొనెను.

17. పిమ్మట, కడప వకీలు అయిన రామాజి యింట్లో పెండ్లి అవుతూ వుండగా, అతణ్ని పిలిపించి యీ చేసిన పనులు యెరుక చేసి, అతణ్ని పట్టి చెరలో వుంచి, అతని యిల్లు అంతా దోచుకున్న పిమ్మట, యీ పవాడప్పనాయునివారు బుక్కరాయసముద్రం వీరభద్రస్వామివారి దర్శనానకు, పోతూ యీ రామాజీని వెంటతీసుకొని పోయి, కోట మూల యెర్రబురుజులో భద్రంచేసి, ఖిల్లాదారుడైన రాహుత్తురాయబసప్పకు కావలివార్ల నేమించుమని ఆజ్ఞాపించి, తాను అనంతపురానికి వచ్చిన

మరి యెనిమిది దినములకు స్వారిపోయి, యీ రామాజిని పిలిపించి, నీవు స్వామిద్రోహివి అని దుర్భాషలాడగా, అతను మారు ఆడినందున, కోపము వచ్చి నాలుక కోయించెను. యీ మొండి బ్రతుకు తన కేలనని ఆ రామాజి నాలికె బుడానికి పెరుక్కొని చచ్చెను. చావగానే, ఆ శవమును అక్కడ వొక పాడుగుంట వుండగా, అందులో వేయించి పైన మన్ను రాయి వేయించి, తాను అనంతపురం చేరగా, ఆ చచ్చిన రామాజి బ్రహ్మహత్య యీ కువాడప్పనాయునివారికి కన్నులకు కనిపిస్తూ, అనేకోపద్రవాలు తొలగ చేసెను.

18. ఈ కువాడప్పనాయుడు మయాణా ఫౌజుదార్లు రాకమునుపే, తెలుగు దొంబరులు రాయదుర్గంలో చేరిన దురదకుంట్లనుంచి కూడేటి సంగమేశ్వరస్వామి రథోత్సవానకు వచ్చి, అక్కడ గడవేసి ఆడుతూ వుండగా, వారిలో పెన్నమ అనే చిన్నది, స్వల్ప దినములలో యీడేరి, రూప రేఖా విలాసములచేత చక్కగా వున్నందున, దాన్ని చూచి మోహించి, పిలిపించుకొని, నగరిలో వుంచుకొనెను. దాని తల్లి దండ్రులు వచ్చి, యీ చిన్నదానితో నేము కాలక్షేపము చేస్తూ వుంటిమి, మా జీవనానికి యేమి సెలవు యిచ్చేరని అడుగగా; అప్పుడు, కూడేటికి వాయువ్య భాగమందు వొక స్థలం చూచి, అంతరగంగ పొలములో ముద్దులాపురమనే పేరు పెట్టి గ్రామం కట్టించి, ఆ గ్రామం పొలం కొంత, కొరకోడు పొలం కొంత, చోళ సముద్రం పొలం కొంత, యీ రీతున యీ గ్రామానికి పొలం యేర్పరచి, అందులో పుట్టిన సువర్ణాదాయం యావత్తు, యీ దొంబర్లకు సర్వమాన్యముగా యిచ్చెను.

19. అంతట యీ కువాడప్ప నాయుడు, తనకు అప్పట్లో అంటి వున్న బ్రహ్మహత్య యెట్లా విడిచిపోననని బ్రాహ్మలను అడుగగా; గోకర్ణ యాత్ర చేసి వస్తే విడుగునని చెప్పిన ప్రకారం, జమదరఖానా పల్లప్పనున్ను, తన భార్యలైన దేవమ్మ, గిరిజమ్మ వీర్లనున్ను, యీ దేవమ్మ కొమారుడు అయిన శిద్దప్పనాయుణ్ని వెంట తీసుకొని ప్రయాణమై, యీ అనంతపురానకు యిరువై ఆరు కోసుల మీద పెద్దపాళెం దగ్గర పోతూ వుండగా, ఆ మార్గాన యీ రామాజీ బ్రహ్మహత్య, యీ కువాడప్పనాయుడు గోకర్ణానికి పోలే, తన అధికారం యేమిన్ని సాగదు అని తలంచి అతనికి దు

ర్బుద్ధి పుట్టించి, అతని చేతులతో అతనే గొంతు పిసుక్కొని చచ్చేటట్టు చేసెను. యీ మవాడప్పనాయుడు చావగానే, వెంట వున్న జమదరుఖానా మల్లప్ప అతని పాలకీకి ఘటాటోప్ప వేయించి, దారపుత్రులతో మీరు రోదనం చేయవద్దు; మనము యితర రాజ్యములో వున్నాము; ముందు మన వసులు చాలా చెడును అన్ని రహస్యగా తెలియ చెప్పి, దబ్బున సాగి వచ్చి, అనంతసాగరానకు ప్రతినామమైన, కొత్త చెరువుకట్టకు పడమట వున్న నిడుమామిడి స్వాములవారి మఠములో, యీ మవాడప్పనాయుణ్ని శాలివాహన శకం ౧౬౫౯ అగునేటి పింగళనామ సంవత్సరమందు సమాధి చేయించెను. [A. D. 1737.]

END OF CHAPTER. II.

## CHAPTER THIRD

1. తదనంతరం, ప్రసన్నప్పనాయుని కొమారుడైన రామప్పనాయుడు సమీపములో లేనందున, యీ మవాడప్పనాయుని కొమారుడైన సిద్దప్పనాయునికి ఆ కొత్తచెరువు వద్దనే శాలివాహనశకం ౧౬౬౦ అగునేటి కాళయుక్తినామ, సంవత్సరమందు [A. D. 1738] పట్టాభిషేకము అయి, రాజ్యము చేస్తూ వుండగా, అనంతపురములో వున్న ప్రసన్నప్పనాయుని భార్య సిద్దమ్మ, తన కొమారునికి పట్టాభిషేకము కాక, మరిది కొమారుడికి అయినందున, యేమి వుపద్రవం వచ్చునో అని, తన కొమారుడైన రామప్పనాయుణ్ని వెంటతీసుకొని, అనంతపురం విడిచి, తమ సంస్థానానకు స్నేహితుడైన హెబ్సూరి ముద్దుమల్లప్పగారి వద్ద చేరగా, అతను బహు ప్రీతితో ఆదరిస్తూ వున్న రెండు నెలలకు యీ సిద్దమ్మగారు అచట కాలం చేసెను. ఆ రామప్పనాయుడు అక్కడనే వుండెను.

2. ఈ కొత్తచెరువులో వున్న సిద్దప్పనాయుడు అనంతపురం చేరి, బళ్లారి రామప్పనాయుని భార్య సిద్దమ్మకు చెల్లెలైన భద్రమ్మను వివాహమైన కొన్ని దినములకు, యీ సిద్దప్పనాయుడు తాగుబోతున్ను కామోద్రేకి

అయి, గ్రామములో వున్న సంసారులలో యెక్కడ చక్కని స్త్రీలు వున్నా, వారిని బలాత్కారముగా తెప్పించి చెరుస్తూ వుండెను. అది చూచి అనంతపురం బుక్కరాయసముద్రం యీ రెండు గ్రామములలో వున్న వారు, యీ ప్రభువు (దుర్మార్గపు పనులు) జరిగిస్తూ వున్నాడని, ఆ గ్రామములు విడిచి పోయినందున, యీ వర్తమానం యావత్తు రాజ్యంమీద వాడుకొనేది. కొరకొళ్లలో వున్న రెడ్డి కరణాలు ఖిల్లాధారు వుమ్మణ్ణి తానావున్న మంది సహా విని, యీ దొరవద్ద యెన్నాళ్లు వున్నా, తుదముట్టేది లేదు; అపకీర్తి వచ్చును అని యోచించి, సంస్థానానకు పట్టపుదొర అయిన ప్రసన్నప్పనాయుని కొమారుడు రామప్పనాయుడు హొసూరి ముద్దుమల్లప్ప గారి వద్ద వున్నాడు; ఆయన పట్టానకు బాధ్యుడు గనుక, పిలుచుక రావలెనని, అక్కడికి పోయి, ఆ ముద్దుమల్లప్ప గారితోనున్ను రామప్పనాయునివారితోనున్ను యిక్కడ నడిచే యావద్వర్తమానములను చెప్పి, మంచి పనికి చెడ్డ పనికి సహా యీ రామప్పనాయునితో కూడా వుంటున్నాము అని, ఆ ముద్దుమల్లప్పగారికి నమ్మిక యిచ్చి, రామప్పనాయునివారిని వెంటతీసుకొని కొరకొళ్ల వచ్చి చేరిరి.

3. ఇక్కడ అనంతపురములో వున్న జమదరుఖానా మల్లప్ప, యీ సిద్దప్పనాయునివారి దయ సంపాదించుకొని, అనంతపురం గ్రామానకు తూర్పు కాలుగడియ దూరములో చెరువుకట్ట మీద దేవాలయము కట్టించి, మల్లేశ్వరుని ప్రతిష్ఠ చేసి, చెరువులోగా దిగడానకు సోపానాలు కట్టించెను. మరిన్ని, బుక్కరాయసముద్రములో వున్న మజుందారు రామన్నగారు, గ్రామానకు ఆగ్నేయభాగమందు వున్న సంతపేట కొనన తన పేర బావి తవ్వించి, చెట్లు చేమ వనాంతరము వేసెను.

4. ఈ సిద్దప్పనాయునివారి వుపద్రవము చేత పోయిన రెండు గ్రామాల ప్రజతనరివారు, రామప్పనాయునివారు కొరకొళ్ల చేరిన వర్తమానము విని, అతని వద్దికి పోయి, యావద్వర్తమానం తెలియచేసి, అయ్యా తాము దయచేసివచ్చి, అనంతపురం బుక్కరాయసముద్రం యీ రెండు గ్రామాలు ఠాణా వేసుకొంటే, మేము ఆ గ్రామాలలో వుంటున్నాము; లేకపోతే, లేచిపోతున్నాము అని మనవి చేసుకోగా, అదే ప్రకారము, ఆ తట్టు గ్రామాలమందిని పిలిపించుకొని, కొరకొళ్లలో వున్న మందితో కూడా ఆ రా

మప్పనాయుడు వచ్చి, అనంతపురం ఠాణా వేసుకొనెను. యీ కలకలాయ మానానకు గ్రామములో వున్న శిద్దప్పనాయుడు, పూర్వం పెద్దలు సంపాదించిన ఆయుధములనున్ను కొంత ద్రవ్యమునున్ను తీసుకొని, గ్రామం విడిచి తాడిమఱ్రి రాజ్యం చేస్తూ వున్న పెద్దతిరుమలనాయునివారి వద్దికి పోగా, అతను తమకు కుమారపద్దు యిచ్చిన యింటితనంవారైన దొర వచ్చెనని, తన సేనతో పిన్నదరి ప్రాంత్యమునకు యెదురుగా వచ్చి పిలుచుక పోయి, కోటలో విడిది యింట్లో దించి, సకల వస్తువులు పంపించి, క్షేమ లాభములు విచారించగా. అతనికి యిక్కడి యావద్వర్తమానము తెలియజేసి, తనకు సహాయముగా కొందరిని పాళెగాండ్లను పిలిపించి, జనం స్తోమం చేసి, మీ సేన వచ్చి, తిరుగా మాజాగా మాకు వచ్చేటట్టు చేయవలెనని చెప్పెను,

5. అంతట ఆ పెద్దతిరుమలనాయుడు ఆలాగుననే, మా చేత అయినంతలో నిర్వంచనగా సహాయము చేయనయ్యాని అని చెప్ప పోయి, తన ప్రధాని అయిన ఆ తేటిపెద్దన్నను పిలిపించి, యీ శిద్దప్పనాయుని వర్తమానము యావత్తు అతనితో చెప్పి, వీరికి సహాయముగా మన సైన్యమున్ను మనకు సహాయులైన కత్తికొండ దూదికొండ మొదలయిన పాళెములవారిని పిలిపించి, మందిని స్తోమము చేసుకొని నీవు సేనానాయకుడవై పోయి, వారి జాగా వారికి స్వాధీనము చేసి యిచ్చి రమ్మని పంపించగా, ఆ దళవాయి పెద్దన్న అదేరీతున సకల సేనా సమేతుడై, ఆ శిద్దప్పనాయుని వెంట తర్లి వచ్చి, అనంతపురం చెరువులో దిగి, గ్రామం చుట్టూ కావలి తిరుగుతూ వున్నంతలో, కోటలో వున్న రామప్పనాయునివారు, తాడిమఱ్రి నుంచి వచ్చిన సేన గ్రామం ముట్టడి వేసుకొనెను; పాళేల వారందరు యీ శిద్దప్పనాయుని తట్టుగా వచ్చినారు; మంది నిండా వున్నది; వీరిని శిక్షించడానకు యిక్కడ బలంచాలదని, కోటలోవున్న రాణువ గురికాండ్లతో చెప్పి, తాను గ్రామమువిడిచి, ప్రత్యేకముగా హిందూరాయని కొమారుడైన మురారిరాయనివారు, మడకసీర్పి ఆ ప్రాంత్యాలలో సేనా సహితముగా వుండగా, వారిదగ్గిరికి అతి త్వరగా పోయి, అతనితో సంస్థానం నిర్వాహకం చేయవలసిన భారం మిమ్మున కూడినది అని, తన యావద్వర్తమానం చెప్పుకొనెను.

6. అదివిని ఆ మురారిరాయనివారు, అదేరీతున రామప్పనాయుని వారి వెంబడి తన సేనతోకూడా వచ్చి, ఆ తాడిమర్రివారి ఫౌజు మీద పడి కొల్ల పెట్టుచూవుండగా, కోటలో కావలివున్న రాణువ గురికాండ్లు తమ రామప్పనాయునివారు ప్రత్యేకముగా దండు తెచ్చిరి అని కోటవాకిళ్లు తీసుకొని, బయిటికి వెళ్లివచ్చి చుట్టూ కావలి వున్న ఆ లేటి పెద్దన్న మందితో జగడం చేయగా; యిరు పార్శ్వాలా మంది వచ్చెనని, తాడిమర్రినుంచి వచ్చిన ఆ లేటిపెద్దన్న మొదలయిన పాళెగాండ్లు పారిపోతూ వుండగా, మురారిరాయనివారి ఫౌజు, రెండు తెగలై వుప్పర్లపల్లె మార్గముగా దుక్కలగుండం అనే కొండ తట్టు కొంత ఫౌజున్ను, దేవరకొండ తట్టు కొంత ఫౌజున్ను, యీ రెండు తట్లా నిలచి యున్నందున, ఆ లేటిపెద్దన్నతో కూడిన ఫౌజు పొయ్యేటందుకు దారి లేక చిక్కెను.

7. ఈ చిక్కిన మంది రామప్పనాయుని వద్దికి వచ్చి, అయ్యా మేము ఆయుధహస్తులము, యెవరు కొలువు నిల్పినా జాగ్రతగా వుండి వారి పని నెరవేర్చే వారమేకాని యితరం లేదు; మమ్మున పిలిపించిన ధణీలు పరారి అయిపోయిరి; మాతో యేమి తీరవలసినదని మనవి చేసుకొన్నందున, ఆ రామప్పనాయునివారు తమ దగ్గెర వున్న ముఖ్య జనాన్ని పిలిపించి, వీండ్లు మనుష్యమాత్రులు; వీండ్లతో కావలసినది యేమి వున్నది? జనం ౧కి జుట్టుపన్ను తిమ్మానాయుని మాట ప్రకారం తీసుకొని, వీరిని ఆయుధాలతో విడిచిపెట్టండి అని సెలవు యిచ్చినారు. అదే మేరకు జుట్టుపన్ను యిచ్చి, వారు తాడిమర్రికి పోయిరి.

8. ఆ శిద్దప్పనాయుడు దేవరకొండ వద్ద చిక్కినందున, రామప్పనాయుడు తోడకవచ్చి కోటలో భద్రము చేయగా, ఆయన అతి రోషముతో అన్నోదకాలు వర్జించి చనిపోయెను. లోకులు అది తెలియక గొంతు పిసికి చంపిరి అని వాడుకొంటూ వున్నారు.

9. ఈ శిద్దప్పనాయుడు చనిపోయిన తర్వాత, యితని భార్య భద్రమ్మ తన మగణ్ని చంపిరి అని మనస్సులో దుఃఖము చేత, బావ అయిన రామప్పనాయునితో, మా అక్కకు నాకు దర్శనము అయి బహు దినములు అయినందున, సెలవు యిస్తే పోయి వస్తున్నాను అని చెప్పగా విని, కొంత

జనాన్ని యిచ్చి అంపించగా, పోయి భద్రమ్మ బళ్లారి చేరి, తిరుగా యీ అనంతపురం రామప్పనాయుని వద్దికి రాక అక్కడనే వున్నందున, రామప్పనాయునివారు మా భద్రమ్మగారిని వంపించమని, బళ్లారి రామప్పనాయునివారికి జాబు వ్రాసి వంపించగా, అతడు అది చూచుకొని, ఆమెకు ఆ స్థలం యీ స్థలం అనే భేదం వున్నదా? ఆరు నెలలు పోయిన మీదట అంపిస్తున్నాము అని మారుత్తరం వ్రాసి వంపించగా, ఆమెతో కూడా పోయినవారు మాత్రం అనంతపురం వచ్చి చేరిరి.

10. తదనంతరం, శాలివాహన శకం ౧౬౬౧ అగునేటి సిద్ధార్థినామ సంవత్సరమందు, (A. D. 1739.) అనంతపురం చెరువుకు పుష్కృష్టంగా ప్రవాహం వచ్చి, కట్టమీద నీళ్లు పార్లి తెగకోసి, గ్రామానికి తూర్పు విఘ్నేశ్వరుని దేవాలయానికి కాలు గడియ దూరంమీద, కొంచెము కూచ్చు తగ్గగా ముప్పది బారలు కట్ట తెగిపోయి గండిపడినందున, తిరుగా రామప్పనాయునివారు అది బాగుచేయించిన మరి ఆరునెలలకు మీద, యీ హండె అనంతపురమునకు నైఋతి దిక్కున రాయదుర్గం తాలూకాలో, తోపుదుర్తి అనే పాళెపు పాళెగాడైన తాడిమర్రివారి దాయాది సాకం తిమ్మానాయుడు, యీ ప్రాంత్యములో గ్రామముల మీద కావలి కావలెనని, గ్రామములలో వుపద్రవం చేస్తూ వుండగా; యీ రామప్పనాయునివారు, క్షుద్రకార్యములు చేయవద్దు అని, రెండు మూడు వరుసల వ్రాసి వంపించినా వినక, చిల్లర కార్యములు చేస్తూ వుండెను.

11. కాబట్టి యీ రామప్పనాయుని వారికి కోపమువచ్చి, పూర్వం తమతండ్రి అయిన ప్రసన్నప్పనాయునివారి కాలమందు, వసంతమ్మ అక్క అయిన లచ్చమ్మగుండా క్షుద్రకార్యములు నడిపించిరి; యిప్పుడు తాత్సారముగా, యీ తిమ్మానాయుడు క్షుద్రకార్యములు చేస్తున్నాడు; వీనికి చోటు లేకుండా శిక్షించవలెను అని మనస్సున యెంచి, కొన్ని దినములు జరిగిన మీదట, ఆ తిమ్మానాయుడు తోపుదుర్తిలో వున్న సమాచారం తెప్పించుకొని, అతిత్వరగా సైన్యసహితముగా పోయి, కోట లగ్గలకెక్కి గ్రామము తీసుకొని, ఆ తిమ్మానాయుని చిన్నాచిరుతలను విడిపించి అతణ్ని తల కొట్టివేసి ఆ తోపుదుర్తి గ్రామము కోటా పేటా యావత్తు గోడలు వుడనూకించి, ఆముదాలు విత్తించి, తిరుగా అనంతపురం వచ్చిచేరెను.

12. పిమ్మట రెండు సంవత్సరములకు యీ రామప్పనాయునివారు రాయదుర్గం కోనేటిరాయడు కైవశము చేసుకొని యున్న తమ స్వంతమైన కనుముక్కుల గ్రామమును, తిరుగా తమ కైవశం చేసుకోవలెనని, బుక్కపట్నము నుంచి సైన్య సహితముగా నిచ్చెనలు తీసుకవచ్చి, కనుముక్కుల కోటకు వేసి లగ్గలు యెక్కేలోగా, ఆ గ్రామములో వున్న మంది, సేనాపతియైన యెఱ్ఱనాగిరెడ్డి మొదలయిన వారు జాగ్రతపడి, లగ్గలు విరగగొట్టి, యీ అనంతపురం రామప్పనాయుని వారిని, పలాయితుణ్నిగా చేసి, తమ రాయదుర్గం కోనేటిరాయని వారికి వుత్తరము వ్రాసుకొన్నది ఆ కోనేటిరాయడు చూచి కోపించుకొని, తన జన స్తోమముతో వచ్చి, బుక్కపట్నం చెరువు నిండక వున్నందున అచట దిగి, ఆ గ్రామమునకు ముట్టడి వేసి మోర్చాలు యెత్తించి, చేరుముట్టడికి తెచ్చినందున, యీ బుక్కపట్నంలో వున్న సేనాపతిన్ని పారుపత్తెగాడున్ను అయిన వీరప్ప అనేవాడు, తమ రామప్పనాయునివారికి గ్రామం అయితే చేరుముట్టడి అయినది; నిర్వాహకము లేదు; మీరు నాలుగు అయిదు దినములలో మందిని తీసుకవచ్చి ముట్టడి తీసివేయించినట్టు అయితే సరి; లేకపోతే గ్రామము వారి స్వాధీనము అవుతున్నదని కాగిదం వ్రాసి అంపించెను.

13. అది వచ్చిచేరి చూస్తూనే, యీ రామప్పనాయునివారు యిక్కడ వున్న మంది గుఱ్ఱం సిద్ధము చేసుకొని, పెద్దపాళెం సానె నరసిహ్మనాయునికి బుక్కపట్నమునకు ముత్తిగె వచ్చెను: దాన్ని లేపేదానికి సహాయము రావలసినదని కాగిదము వ్రాసి, దేశాయి నారాయణప్పగారి చేతికి యిచ్చి, నీవు ప్రయాణమై పోయి యీ వుత్తరమును యిచ్చి, ఆ నరసింహ్మనాయుణ్ని అతిత్వరగా పిలుచుకొని, మీరు పుట్టపర్తి ప్రాంత్యాలకు వచ్చి, మాకు వర్తమానము పంపించవలసినదని చెప్పి అతణ్ని పంపించి; యీ రాప్పనాయుడు తక్షణమే తమ సైన్యముతో కూడా మార్గము తప్పించి, తాడిమఱ్రి సీమలో వెళ్లి, త్వరగా మల్లెగొండ మార్గాన పోయి, సోమేశ్వరుని వాకిలి గుండా బుక్కపట్నం చేరెను.

14. ఆ మరునాడు, పెద్దపాళెమునకు పోయిన నారాయణప్ప, నరసిహ్మానాయుని మందిని తీసుకొని, అప్పణ ప్రకారమే పుట్టపర్తి ప్రాంత్యములకు వచ్చిచేరి, యీ సమాచారం కోటలోవున్న తమ రామప్పనాయునివా

రికి చెప్పి అంపించగా, అతను ఆ మందితో మీరు కట్టమీదికి వచ్చి చా
డేశ్వరి దేవాలయం ముందుగా వెళ్లి రండి అని, బదులు వర్తమానం చెప్పి
అంపించి, కోటలో నగారా వేయించి, తనకు నమ్మిక అయిన సేనానాయ
కులతో కోటవాకిలి తీయించుకొని, వెలపటికి వెళ్లి మోర్జాలమీద పడి
యుద్ధము చేస్తూ వుండగా; యీ అంతతోపులోనుంచి వచ్చిన పెద్దపాళెం
మంది, కొమ్ము తప్పెట్లతో అంత వూరువాకిలి ప్రవేశించెను.

15. ఈ వుభయ సేనా మధ్యమందు, పేటలో మోర్జాల మీద వున్న
మంది పెద్ద మనుష్యులు చేతికి చిక్కిరి. యీ రామప్పనాయునివారు, ఆ కో
నేటిరాయణ్ని పట్టుకోవలెనని, వుభయ సేనలతో అతను వున్న స్థలానకు పో
తూ వుండగా; అతడు యీ వర్తమానము హతశేషులైన వారి వల్ల విని, త
న సైన్యము తల విరియబోసుకొని చీకాకు అయి పారిపోతూ వున్నది చూ
చి, యింక యిక్కడ వుంటే నిర్వాహకము లేదు అని, డేరాలు విడిచి పెట్టి
యెకాయెకీ తమ తాలూకు కనుముక్కుల చేరి, అక్కడ పదిరోజులు వుండి,
అక్కడినుంచి రాయదుర్గానకు పోయి చేరెను. యీ వర్తమానము యీ రా
మప్పనాయుడు విని, మరి నాలుగు దినములకు తాను అనంతపురం చేరె
ను.

16. తదనంతరం, ఆ రాయదుర్గం కోనేటిరాయడు, తాను పరాజి
తుడయిన దుఃఖం మనస్సున వుంచి, తన తాలూకు మందిని యావత్తు పిలి
పించుకొని, జనస్తోమముతో వచ్చి, అనంతపురానకు ఆరు కోసుల మీద
వుండే ముక్తాపురం గ్రామానకు వచ్చి ముట్టడి వేసెను. అయిదు ఆరు ది
నములు జరిగిన పిమ్మట, యీ ముక్తాపురములో వున్న కొండిరెడ్డి, కరణా
లు మంది వగైరా, తమ అనంతపురం రామప్పనాయుని వారికి గ్రామం
చేరుముట్టడి అయినది; నిర్వాహకము లేదు; మాకు యేమి బుద్ధి అని వు
త్తరం వ్రాసుకొన్నది యీ రామప్పనాయునివారు చూస్తూనే, తక్షణం ప
ట్టుపగలు నగారా వేయించి, దగ్గిర వున్న మందితో వెళ్లి మరూరు ప్రాం
త్యాల దిగి, మర్నాడు మధ్యాహ్న వేళ నగారా వేయించుకొంటూ పోయి,
ముట్టడి వున్న జనం మీద పడెను. కోటలో వున్న జనం యావత్తు తమ ధ
ణి దండు వచ్చిపడెను అని సంతోషభరితులై తామున్ను వెళ్లి వచ్చి, ఆ కో

నేటిరాయనివారి దండు మీద పడగానే యిరుపక్కల మంది కమ్ముక వచ్చెనని సామానులు సహా విడిచి, తిరుగా తమ స్థలం కనగానపల్లెకు పారిపోయిరి. యీ రామప్పనాయునివారు, తిరుగా ఆ కోనేటిరాయడు రాయదుర్గం చేరే పర్యంతము, ఆ గ్రామంలోనే వుండి, పిమ్మట, తమ మందితో కూడా అనంతపురం వచ్చి చేరెను.

17. తర్వాత, కొన్నాళ్లకు వుత్కృష్టముగా వర్షించి, మెగువ రామగిరి, బద్దలాపురం, కోనాపురం, యీ మూడు గ్రామముల చెరువులు తెగి ప్రవాహము వచ్చి, చెరువు రెండు మరవలు పట్టక, యీ అనంతపురం ఆగ్నేయ భాగమున కాలుగడియ దూరములో, ముప్పది బారల కట్ట తెగి పోయెను. యీ రామప్పనాయునివారు ఆ చెరువు కట్టను రెండుమూడు నెలలు పోయిన పిమ్మట భద్రం చేయించెను.

18. ఈరీతున యీ అనంతపురం రామప్పనాయుడు దొరతనం చేస్తూ వుండగా, లోగడ యిక్కడినుంచి బళ్లారికి పోయిన, పవాడప్పనాయుని కుమారుడైన సిద్దప్పనాయునికి భార్యయైన భద్రమ్మగారు, తన అక్క అయిన ఆ బళ్లారి రామప్పనాయుని భార్య సిద్దమ్మతో, తన మగడు చచ్చిన పూర్వోత్తరం యావత్తు చెప్పుకొని, ఆ మెగుండా బావ అయిన ఆ బళ్లారి రామప్పనాయునికి తెలియచేసి, నీవంటి బలవంతుడు బావ అయివుండగా, నా గతి యీరీతిన కావలెనా; నా మగణ్ని చంపినందుకు ప్రతి, నా బావ అయిన అనంతపురం రామప్పనాయుణ్ని చంపితే, నా మనస్సుకు సమాధానమయ్యాని అని, బహు దినాలు తాను తన అక్క సహా రాత్రి పగలు బోధించగా; ఆ మాటలను ఆ బళ్లారి రామప్పనాయుడు తన మనస్సుయందు వుంచి, యీ పని యేలాగున నైనా త్వరగా చేయవలెనని యోచించి, యీ అనంతపురం రామప్పనాయుని వద్ద దళవాయితనం చేస్తూ వున్న, తన బావమరిది అయిన జగ్గుల మల్లప్పకు లోలోపల కాపట్యపు కాగిద పత్రాలు నడిపిస్తూ వుండెను.

19. అందుకు యీ జగ్గుల మల్లప్ప, యోచించి మీరు అక్కడినుంచి యెకాయకీన వచ్చి యీ సంస్థానము సాధించేటందుకు, మీచేత కానేరదు, మిత్రభేదం చేత కావలెను; అది యేలాగంటే, నాకు పుత్ర సంతానము

లేదు గనక, వొక కుమారుణ్ని సాక్కోను యిస్తే వుభయ సంస్థానములు
మీదే అవుతున్నదని, యీ అనంతపురం రామప్పనాయుని వారికి మీరు
కాగిద పత్రాలు వ్రాయించి, అక్కడినుంచి అంతతగిన పెద్దమనుష్యులను
అంపిస్తే, ఆ కాగిద పత్రములు యిక్కడ ముట్టించి, ఆ పిన్న పెద్దలను
దర్శనము చేయించి, అదేప్రకారం వొక చిన్నవాణ్ని యిచ్చేలాగున కుద
రచెప్పి, ఆ సంస్థానం యీ సంస్థానం భేదంలేదని నమ్మిక పుట్టేలాగు
న చేసి, మీ పేర కాగిద పత్రాలు తిరుగా వ్రాయించి అంపిస్తూ వున్నా
ను: అందు మీద మీ వుభయులకు నమ్మికలు తోస్తున్నవి అని, వ్రా
యించి అంపించగా, ఆ వుత్తరములను బళ్లారి రామప్పనాయుడు చూ
చుకొని, లెస్సగా వున్నదని యోచించి, బావమరిది అయిన జగ్గుల మల్ల
ప్ప యోచన ప్రకారం వుత్తరములను వ్రాయించి, జనివారం రామచం
ద్రనాయకుడు, కురుగోడు సూరప్ప, తురక జుంజాభాయి, వీరిచేతికి యిచ్చి
ప్రయాణం చేసి, మర్యాద వస్త్ర పాత్రాదులున్ను యిచ్చి అంపించెను.

20. అదే ప్రకారం, వారు బయిలుదేరి అనంతపురం వచ్చి, యీ
జగ్గుల మల్లప్పతో మాట్లాడగా, అతను వారిని వెలపట నిలిపి, తాను
యీ అనంతపురం రామప్ప నాయుని సాన్నిధ్యానికి పోయి, వారితో
బళ్లారి రామప్పనాయుని వారి దగ్గిరనుంచి, పెద్ద మనుష్యులు కాగిద ప
త్రాలు తీసుక వచ్చి వేలపట దిగి వున్నారు; వారిని పిలిపించి దర్శనము
చేసుకొని, కాగిద పత్రాలు తీసి చూచుకొని, వారిని సాగనంపవలసి వు
న్నదని చెప్పగా, బహు దినాలనుంచి వారికి మాకు కాగిద పత్రాలు
లేవు; అయినా చింతలేదు; పెద్ద మనుష్యులు వచ్చినప్పుడు దర్శనము
చేసుకొందాము అని సెలవు యివ్వగా, అదే ప్రకారం యీ జగ్గుల
మల్లప్ప వెలపటికి వచ్చి, వారితో నోటిమాటలు యేమి చెప్పినారని
అడిగితే, మా యేలినవారు పుత్రాపేక్షచేత మీకు కాగిద పత్రాలు వ్రా
సినారు అని చెప్పమని చెప్పి, వీరిని లోపలికి తోడకపోయి, యీ అనంత
పురం రామప్పనాయుని వారి దర్శనము చేయించి, యేమి సమాచారము
అని అడుగగా; యితను చెప్పి యిచ్చిన ప్రకారమే, మొదట చెప్పి కాగి
ద పత్రాలు చేత యివ్వగా; అవి తీసి లకోటాలు పగలకొట్టి చూడగా,

వారు చెప్పిన ప్రకారమే పుత్రార్థమై వ్రాసియున్నందున, బహు సంతో
షపడి, రెండు సంస్థానాలు తమ స్వాధీనము అవుతున్నదని తలంచి, వచ్చిన
పెద్దమనుష్యులకు విడిది చేయించి, తమ కొటారులో నుంచి బియ్యము బేడ
లు మొదలయిన సకల పదార్థములు అంపించి, రాత్రి పగళ్లు విచారించు
కొంటూ వుండమని, యీ జగ్గుల మల్లప్పకు సెలవు యిచ్చి విడుదులకు అం
పించెను.

21. తర్వాత, యీ అనంతపురం రామప్పనాయుడు తనవద్ద వున్న జగ్గుల
మల్లప్పను, యింకా తనకు పెద్దలయిన స్త్రీలను పిలిపించి, బళ్లారినుంచి వచ్చి
న కాగిద పత్రాలు చదివించి, వొక చిన్నవాణ్ని తమకు సాక్షోను యిస్తే యీ
సంస్థానము మీాదేను అని వ్రాసినారు; నడతలు విచారించినా వారికి పుత్ర
సంతానము లేనిది నిజమే గనక, పుత్రాపేక్షచేత వ్రాసినారు, యిప్పుడు
వొక చిన్నవాణ్ని యిచ్చి సంస్థానము మన స్వాధీనము చేసుకొనేది మంచిది
అని నామనస్సుకు తోస్తున్నది; యిందుకు యేమి యోచన చెప్పతారో చె
ప్పండి అని వారిని అడుగగా; ఆ పెద్దమనుష్యులు, యీ దొరవారి చిత్తమం
దు, వొక చిన్నవాణ్ని యిచ్చి సంస్థానము నిర్వాహకం చేయవలెనని వున్నందు
న, బదులు చెప్పేది యుక్తముకాదని తమ మనస్సులో తలంచి, వున్న అర్థ
ము యావత్తు దేవరవారి చిత్తానకు యెరుక అయ్యే వున్నది; మాకున్ను వు
భయ సంస్థానాలు యేకగ్రీవముగా వుండేదే యుక్తమని తోచుతూ వున్నది
అని చెప్పిరి.

22. అందుమీాద, యీ అనంతపురం రామప్పనాయుడు మరునా
డు ప్రొద్దుననే, బళ్లారినుంచి వచ్చిన ఆ పెద్ద మనుష్యులను పిలిపించి,
వారితో మా అన్నగారు మామీాద అంతఃకరణవుంచి, సంస్థానానికి వొ
వరు లేరు; వొక చిన్నవాణ్ని అంపించమని వ్రాసినారు; దానికి సంశయ
ము యేమి వున్నది అని తన పెద్ద కొమారుడైన పన్నెండేండ్ల సిద్దరామప్ప
నాయునివారిని, ఆ బళ్లారి రామప్పనాయుని వారికి యిస్తిని అని వారి ముం
దుగా వాగ్దత్తం చేసి, అన్నగారికి యీ అభిప్రాయము వ్రాయించి అం
పించగా, వారు బదులు యేమి వ్రాయించి అంపిస్తున్నారో ఆ ప్రకా
రం నడుచుకొందాము అని చెప్పినందున, ఆ వచ్చిన పిన్నపెద్దలు బహు

సంతోషపడి, సిద్దరామప్పనాయుని వారిని మన సంస్థానానకు స్వాధీనము చేసి యిచ్చిరనే అభిప్రాయము యావత్తు వ్రాయించి అంపించగా, యీ జాబు ఆ బళ్లారి రామప్పనాయునివారు చూచుకొని, తన పెండ్లాము సిద్దమ్మను, మరదలైన భద్రమ్మను పిలిపించి యీ యావద్వర్తమానము చెప్పగా, మీరు యేయత్నమయినా చేసి మా మనోనుసారము చేసి యిస్తే, మాకు సంతోషమయ్యీని అని చెప్పి అంతఃపురములోకి పోయిరి.

23. ఆ మరునాడు, బల్లారి రామప్పనాయుడు నా మనస్సు ప్రకారం నా తమ్ముడు నడిపెను; మీరు కొంచపోయిన వస్త్రములు వారి వారికి తగిన మర్యాద ప్రకారం వుడుగరలు యిచ్చి సంతోషపరచి, నా తమ్ముడు సెలవు యిచ్చిన ప్రకారము, శుభముహూర్తమందు చిన్నవాణ్ని వెంటబెట్టుకొని, సోనహాళ్లివంక బసవేశ్వరుని ఆలయం వద్దవచ్చి దిగి మాకు చెప్పి అంపించినట్టుగానే, మేము వచ్చి గ్రామంలోకి తోడుకొని వస్తున్నాము అని, ఆ పిన్నపెద్దలకు బళ్లారి రామప్పనాయుడు వ్రాయించి అంపించగా, వారు యీ యావద్వర్తమానము లిఖితముఖంగా యీ అనంతపురం రామప్పనాయుని వారికి శృతం చేసినందున, అతను సంతోషపడెను.

24. తర్వాత ఆ పిన్నపెద్దలు తాము తెచ్చిన వస్త్రపాత్రాదులు యీ అనంతపురం రామప్పనాయుని ముందు పెట్టి, యెవరెవరికి యేరీతున యివ్వవలెనో ఆ ప్రకారము యిప్పించగా, తన పెద్దకుమారుడైన ఆ సిద్ద రామప్పనాయునివారిని యీ వచ్చిన పెద్దమనుష్యులచేతికి వొప్పించి, యీయన చిన్నవాడు; తెలిసినా తెలియక పోయినా కాపాడుక రావలసిన భారము వారిదేను అని, మా అన్నగారికి చెప్పుమని చెప్పి, కొంత మంది గుర్రం వెంటయిచ్చి, అక్కడయియ్యతగిన వారికి కొంత వస్త్రపాత్రాదులు కట్టించి, యివి మా అన్నగారి సముఖమున వుంచి, అక్కడ యెవరెవరికి యేరీతున యియ్యవలెనో ఆ రీతున యిప్పించే లాగున మనివి చేయమని చెప్పి, ఆ వచ్చినవారికి వస్త్రపాత్రాదులు యిచ్చి అంపించగా, వారు తమ సేనా సమేతముగా పోయి, బళ్లారికి అరకోసున వున్న సోనహాళ్లివంకవద్ద దిగి వర్తమానము చెప్పి అంపించిరి.

25. అంతట ఆ బళ్లారి రామప్పనాయుడు చతురంగబల సమేతుడై వచ్చి, యీ చిన్నవాడైన శిద్ధరామప్పనాయుణ్ణి చూడగానే, యితడు అతని పాదాలకు మ్రొక్కగా, లేవనెత్తి ఆలింగనము చేసుకొని, గజారూఢుణ్ని చేసి గ్రామంలోకి తోడకపోయి సిహ్మాసనంమీద కూర్చుండపెట్టి, తనమందిని యావత్తు పిలిపించి ఆయనకు మ్రొక్కించి, నగరిలోకి వెంటబెట్టుకపోయి, లోగా వుండే అమ్మగారికి మ్రొక్కించి బహు ప్రీతిగా వుండెను. యిక్కడినుంచి కూడాపోయిన రాణువ గురికాండ్లకు జాతి ఆహారములు వస్త్రములున్ను పంపించి వారిని స్థలాంతరమందు దించెను. యీలాగున నాలుగు దినములు ఆ మందిని వుంచుకొని, యీ అనంతపురం రామప్ప నాయుని పేరట కాగిదపత్రములు విశదముగా వ్రాసి, క్షణేక్షణే అక్కడి వర్తమానం యిక్కడ యిక్కడి వర్తమానం అక్కడ తెలిసేలాగున కాగిదపత్రములు వ్రాసేటందుకు సెలవు యిచ్చి అంపించగా, మంది గుర్రం వచ్చి అనంతపురం చేరి, ఆ కాగిద పత్రములు యివ్వగా, యీ అనంతపురం రామప్పనాయుడు చూచుకొని సంతోషపడెను. యీరీతున నాలుగు దినములు జరిగిన పిమ్మట, కాగిదపత్రముల ముఖాంతరం వీరికి వారికి సనూత్రపడెను. అక్కడనుంచి వచ్చిన వారిని విచారిస్తే, చిన్నదొరవారిని బహు ప్రాణంగా పెట్టుకొని వున్నారు అని విని సంతోషపడుతూవుండెను.

## CHAPTER FOURTH.

1. ఈరీతున వొకసంవత్సరం జరిగిన పిమ్మట, యీ అనంతపురం రామప్పనాయుని వారికి చిన్న దొరవారు మిమ్మున చూడవలెను అని బహు అపేక్షచేత వున్నారు; తాము యిక్కడికి యెన్నడు వచ్చిన వారు కారు, వుభయ సంస్థానములు యేకీభావముగా వున్నప్పుడు కిందటి సంశయములు మీ మనస్సున వుంచ పనిలేదు; చిత్తానకు తెచ్చి అగత్యముగా ప్రయాణమై చతురంగబల యుక్తముగా వచ్చి, మమ్మున చిన్న దొరవారిని కన్నుల

చూచి నాలుగు దినములు వుండి పోయినట్టు అయితే, మా మనస్సుకు సంతోషముగా వుంటున్నదని బళ్లారి రామప్పనాయునివారు వ్రాయించి అంపించగా; ఆ వుత్తరమును అనంతపురం రామప్పనాయునివారు చూచుకొని, తన సామయాజకులను దళవాయి అయిన జగ్గుల మల్లప్పను పిలిపించి, వారితో నేను బళ్లారికి పోయి అన్న గారిని దర్శనముచేసుకొని యెనిమిది దినములలో వస్తున్నాను; యిక్కడ ఖిల్లా చౌకీ పహరా వగైరాల మీద అతి జాగ్రతగా వున్నండి అని చెప్పి సకల సేనాసమేతముగా ప్రయాణమై పోయి, సోనహళ్లి వంక దగ్గర దిగి చెప్పి అంపుగా, ఆ బళ్లారి రామప్పనాయుడు విని, చతురంగబల సమేతుడై యెదురుగా వచ్చి దర్శనము చేసుకొని వెంట బెట్టుకొని నగరిలోకి పోదాము రమ్మనగా, అందుకు యీ అనంతపురం రామప్పనాయుడు నగరికి వచ్చినట్టే సరి అని, కోటలోనుంచి నాగల చెరువుకు పొయ్యే దిడ్డి దగ్గర బయలున తన మంది గుర్రం సహా డేరాలు వేసుకొని దిగెను. భోజన మజ్జనాదులు బళ్లారి దివాణములోనే అవుతూ వుండెను.

2. ఈలాగున నాలుగు దినములు జరిగిన పిమ్మట, అనంతపురం రామప్పనాయునివారి మనస్సుకు సంశయం పుట్టినది అని తలంచి ఆ బళ్లారి రామప్పనాయుడు తన మంది గుర్రంసహా కోట వెలపల పంపి, యితని సేనను కోటలోనికి పిలిపించి వుంచి, తన బీగ ముద్రలు యితని స్వాధీనము చేయగా, బహు నమ్మిక పుట్టి నాలుగు దినములు సుఖముగా వుండిరి. ఆ సమయములో జనివారపు రామచంద్రనాయుణ్ని, కురుగోడు నూరప్పను, తురక జంజాభాయిని, యీ ముగ్గురిని బళ్లారి రామప్పనాయుడు యేకాంతంగా పిలిపించి, యీ అనంతపురం రామప్పనాయుణ్ని యిక్కడ మోసంచేతాము అని యోచించగా, వారు యిక్కడ మోసంచేసినట్టు అయితే యీయన పెకనితోనే ముగిసిపోతున్నది; యితని అల్లుండ్లు కుమాళ్లు అక్కడ బహు విస్తారముగా వున్నారు గనుక వారు యథాప్రకారము సంస్థానమును ఆవంకెకు తెచ్చుకొని మనమీద తెల్లవారితే పోట్లాడుతూ వుండేరు; వారు బహుజనం కలవారు; మనము వంటరిగాండ్లము; యిక్కడ దురాలోచన చేయవద్దు; యీ వచ్చిన వారికి మానసన్మానాలు చేసి బహు అంతః

కరణంతో పంపితే, వారు పొయ్యేటప్పుడు, మిమ్మును తమ తావుకు రమ్మని అగత్యముగా పిలుతురు; అందుకు, మేము నాలుగు దినాలు పోయిన మీదట వస్తున్నాము అనిచెప్పి సమస్త బహుమానములు చేసి, స్థలం వాడ్లదిగా అనిపించితే ముందు మనకార్యాలకు శానా సాధకం అవుతున్నది అని చెప్పగా సమ్మతించి వుండెను.

3. ఈ రీతున కొది దినములు పోయిన తర్వాత, అనంతపురం రామప్పనాయునివారు బళ్లారి రామప్పనాయునితో మేము వచ్చి కొది దినములు ఆయెను; సెలవు అయితే గ్రామానికి పొవ్వేము; మీరున్ను దయచేసి సకల సేనా సమేతులై వచ్చి అక్కడ వున్న చిన్నా చిరతలా బంధువుల కన్నుల చూచి, నాలుగు దినములు వుండి వత్తురుగాని రమ్మని బహు విధాల పిలువగా, అక్కడికి వచ్చే దానికి చింతయేమి; మీరు గ్రామానికి కదండి; యిక్కడ ఖిల్లా భద్రముగా వుంచి నాలుగు దినాలు పోయిన పిమ్మట వస్తున్నాము అని చెప్పి, సామయాజకుల సహితముగా వారికి వస్త్ర పాత్రాది బహుమానములు యిచ్చి సంతోషపెట్టి అంపించగా, వారు తమ అనంతపురము వచ్చి చేరిరి.

4. తర్వాత బళ్లారి రామప్పనాయునివారు అక్కడనే వుండిరి గనుక, శీఘ్రముగా రమ్మని మూడు నాలుగు దినములకు కాగిద పత్రములు ఇక్కడినుండి అనంతపురం రామప్పనాయుడు వ్రాసి పంపించగా, ఆవుత్తరములను బళ్లారి రామప్పనాయుడు చూచుకొని, వస్తున్నామని బదులు వుత్తరములను వ్రాయించి ముందుగా పంపించి, తాను చతురంగబల సమేతముగా ప్రయాణము అయి వచ్చి, రాచానపల్లెకు పడమర తడకలేటి వద్ద దిగి అనంతపురానకు చెప్పి అంపించగా; ఆ వర్తమానము విన్న తక్షణమందే, యీ రామప్పనాయుడు పుత్ర సహితముగా చతురంగబల యుక్తుడై రాచానపల్లె బండ దగ్గరికి తర్లి పోగా, బళ్లారి రామప్పనాయుడున్ను తడకలేటి దగ్గరనుంచి యీ బండ దగ్గరికి వచ్చెను. వుభయులు దర్శనం అయి ఆలింగనము చేసుకొని, మాయకంఠమాలిక అనంతపురం రామప్పనాయునివారి మెడను వేసి, వుభయులు తమ తమ సేనలతో అనంతపురములోకి వచ్చి, కోటలోకి పోవలెనని పోతూ వుండగా, బళ్లారి రా

మప్పనాయునివారు, మంది గుఱ్ఱం విస్తారముగా వచ్చి వున్నది; కోటలో స్థలము చాలదు; సెలవు అయితే పెద్ద పీర్ల కట్ట దగ్గెర దిగుతున్నాము అని చెప్పగా, యీ అనంతపురం రామప్పనాయుడు, యిట్లా సెలవు దయచేయవలసినది యేమి వున్నది అని, కోటలో వున్న తన మందిని చౌకీ పహరాలు తీయించి, పేటలోకి పంపించి వారి మందిని యావత్తు కోటలో చౌకీ పహరా మీద వుంచి, దొరను మహల్లో దించి ఆరాత్రి నగళ్లోనే భోజన మజ్జనాదులు నడిపించి, వచ్చిన మందికి వారి జాతి ఆహార ప్రకారం పంపించెను.

5. తర్వాత యీ అనంతపురములో వున్న రాణువ గురికాండ్లు సామయాజకులు సహా, తమ ధణీతో యింత చనువు అయితే నమ్మకముపుండీనా; మన చౌకీ పహరాలు తీసి వారి చౌకీ పహరాలు పెట్టినది మంచిది కాదు; మన చౌకీ పహరాలు వుంచవలెనని చెప్పగా, యీ అనంతపురం రామప్పనాయునివారు వారిమీద కోపము చేసి, పాలలో పావరకాయ పిండి సుద్దులు మాతో చెప్పవద్దు; మా నమ్మికలు మాకే తెలుసును; మీరు పేటలోకి పొండి అని సెలవు యియ్యగా, దేశాయి నారణప్ప ధణీతో, నామనవి చిత్తగించండి; మీ జననకాలానకు బుధుడు మారకుడు; అతని మహాదశ రేపు అతని వారమున్ను రేపే, గనక మీ దర్శనం రేపటిదినం మాకు అయ్యే యోగం లేదు; ఋణం తీరినది అని ఖండితోత్తరములు చెప్పి, సెలవు తీసుకొని వెలపటికి వచ్చి వారు వారు తమ తమ యిండ్లకు పోయిరి.

6. పిమ్మట బళ్లారి రామప్పనాయునివారు రేపు అప్పణ అయితే బుక్కపట్నం స్వారి పోవలెను అని, మునే వీరభద్రునితో దొరవారికి చెప్పి అంపగా, అదేప్రకారం పోదాము అని అనంతపురం రామప్పనాయుడు, ప్రతి బుధవారమున్ను ఆయుష్కర్మం చేసుకొనే మర్యాద గనుక, అదే మేరకు మంగల పెదతిమ్మణ్ని పిలిపించి, రేపు స్వారి పోవలెను; సూర్యోదయానికే ఆయుష్కర్మ చేసుకోవలెను; గనక యిక్కడనే పండుకొమ్మని నగళ్లో వానికి అన్నోదకాలు పరామరిక చేయించ సెలవు యివ్వగా, ఆదేరీతున ఆ పెదతిమ్మడు అక్కడనే పండుకొనెను.

7. ఆ బళ్లారి రామప్పనాయునివారు జగ్గుల మల్లప్ప, మునె వీరభద్రప్ప, జనివారపు రామచంద్ర నాయకుడు, కురుగోడు సూరప్ప, తురక

జుంజాఖాయి, వీరు మొదలయిన వారిని కూర్చుండ బెట్టుకొని యోచన చేసి, తెల్లవార ఝామున క్షౌరకాలమందు జనం యెవరు వుండేది లేదు; కొట్టి పారవేసేదానికి అదే సమయమని అందుకు తగిన జనాలను విచారించి, ఆయుధాలతో సిద్ధంచేసి వుండిరి. యింతలో, తెల్లవార ఝాము ఆయెను గనక మంగల తిమ్మణ్ని పిలిపించి, అనంతపురం దొరవారు ఆయుష్కర్మం చేసుకొంటూ వుండిరి. అప్పుడు బళ్లారి రామప్పనాయునికి యిది సమయమని ఆ దుష్ట జనులు చెప్పగా, తన వద్దవున్న నమ్మిక అయిన వెంటరిగాండ్లు నీలడు, కోడెనీలడు, గురవడు, యీ మొదలయిన వారి చేత కొడుగు కత్తి మొదలయిన ఆయుధములను యిచ్చి అంపించగా; వారు వచ్చి యీ అనంతపురం రామప్పనాయుని తల కొట్టివేయగానే, ఆ మంగల పెదతిమ్మడు వెనక్కు తిరిగి త్తి దిడ్డివాకిలిగుండా పేటలోకి వచ్చి సమాచారము చెప్పెను.

౮. అంతట పేటలో వున్న మంది యావత్తు కత్తులూరి వాకిలి దగ్గర ఆయుధములతో సమూహముగా నిలిచెను. నగరిలో యీ అనంతపురం రామప్పనాయుని భార్యలు కుమాళ్లు మొదలయినవారు రోదనము చేస్తూ వుండిరి. ఆ నీలడు మొదలయిన వారు వచ్చి తమ దొర బళ్లారి రామప్పనాయుని వారితో తల కొట్టివేస్తిమి అని చెప్పగానే, నగరిలో వుండేవారు చిల్లాడకుండా కావలివారిని అంపించి భద్రపరచెను. పేటలో వున్న మంది ఆయుధాలతో వచ్చి యుద్ధ సన్నద్ధులై వున్నారనే వర్తమానం బళ్లారి రామప్పనాయుడు విని, దొర తల కట్టెకు కట్టి హులి ముఖం మీద నిలిపేటట్టు చేసెను ఆ తలను అందరు చూచి మోసమాయెనని వెనక్కు వచ్చి మంద బయలున గుంపు గూడి నిలిచిరి యీ వర్తమానం బళ్లారి రామప్పనాయుని వారితో చెప్పగానే, జగ్గుల మల్లప్పను పిలిపించి, ఆ జనుల కందరికి సమ్మతి చెప్పి వారి వారి యిండ్లకు అంపించి రమ్మని సెలవు యియ్యగా, ఆయన వచ్చి దైవాధీనం చేత కాగల పనులు ఆయెనని సమ్మతి చెప్పి, రౌతు రాణువకు అభయమును చెప్పి అంపించెను. శాలివాహన శక వరుషంబులు ౧౬౭౪ అగునేటి ఆంగీరస నామ సంవత్సరం (A. D. 6 June 1752.) జ్యేష్ఠ బ ౯ బుధవారం ప్రాతఃకాలమైన రెండు గడియలకు యీ అనంతపురం రామప్పనాయుడు హతమాయెను.

9. తదనంతరం ఆ బళ్లారి రామప్పనాయుడు కోట యావత్తు భద్రం చేసి, అక్కడ ఖిల్లాదారుణ్ని కొంత మందిని తాణా వుంచి, రాజ్యం మీద తమ మందిని అంపించగా; అప్పుడు రాప్తాడు, బుక్కపట్నం, కొత్తచెరువు, యీ మూడు గ్రామాలు వినహా కొదవ రాజ్యము యావత్తు బళ్లారి రామప్పనాయునివారి స్వాధీనమై తాణా పడెను. యీ తాలూకా విచారణకు రామచంద్ర నాయకుడు, దళవాయి జగ్గుల మల్లప్ప, వీరు మొదలయిన వారిని పిలిపించి, వారితో మీరుపోయి రెడ్లు, కరణాలు, సామయాజకులు, శెట్లు, వర్తకులు, రౌతు రాణువ మొదలయిన వార్లతో, మాకుయెక్కడ ద్వేషము వుండెనో అక్కడ నివారణ చేసుకొంటిమి; మీ మీ బ్రతుకులు మీరు చేసుకొని, యెవరెవరు యే యే రీతున వుంటిరో ఆయా రీతుననే వుండండి; అని అభయమిచ్చి సహానము చెప్పరండి అని యీరామప్పనాయుడు వారిని పేటలోకి అంపించగా, వారు అదే ప్రకారం వచ్చి సహానము చెప్పగా ఆ మాటలు ఆ రెడ్లు కరణాలు మొదలయిన వారు విని, తమలో తాము కూడి మాట్లాడుకొని, యీ దుర్మార్గుని వద్ద కొలువు చేస్తే మానము నిల్వ నేరదు; నమ్మించి దొరను తలకొట్టెను; మేము వుండలేమని యీ జగ్గుల మల్లప్ప మొదలయిన వారితో చెప్పుకోగా, అతడు మాధణీసెలవు అయినందున; మనస్సు వచ్చిన వారు వుండండి; లేనివారు వెళ్లిపొండి; అని చెప్పగా వుండడానకు నమ్మకం లేక, తక్షణమే యీ అనంతపురం బుక్కరాయసముద్రములో వున్న జనము యావత్తు తాడిమర్రి రాజ్యానకు వెళ్లిపోయెను.

10. తర్వాత బళ్లారి రామప్పనాయుడు, యీ అనంతపురం రామప్పనాయుని కుమారుడైన పెద్దరామప్పనాయుణ్ని, అల్లుడైన కరిపుళి బసవప్పను, వీరి యిద్దరిని కూడా చేర్చి కాళ్లకు సంకిళ్లు వేయించి, చౌకీ పహారా వెంట వుంచి, బళ్లారి కొండ మీద భద్రము చేయమని అంపించి, దివాణములో వున్న అతని భార్యలను, ఆడు పిల్లలను యిక్కడనే వుంచి, కొదవ కుమాళ్లు మొదలయిన మొగ జనులను కొట్టిపారవేసి, యిక్కడ వున్న బొక్కసము ఆయుధ ముస్తైదులు సాలు సామానులు యావత్తు బళ్లారికి సాగించి, రామచంద్రనాయకుడు, కురుగోడు సూరప్ప, జగ్గుల మల్లప్ప, తురక

జుంటాభాయి, వీరు మొదలయిన వారిని యిక్కడ సర్వాధికారంలో నేమకము చేసి, తాను సిద్ధరామేశ్వర దేవుణ్ని సహా తీసుకొని చతురంగబల సమేతుడై బళ్లా చేరెను.

11. ఈ ప్రకారం జరిగిన నాలుగు నెలలకు పిమ్మట బళ్లారి కొండమీద అరతట్టు వేసిన సిద్ధరామప్పనాయుడు, బసవప్పగారు, యీ వుభయస్త్రులకు వారి కాలికిన్ని వీరి కాలికిన్ని వొకటే బేడి వేసి వుండగా, ఆ బసవప్పకు శ్రీదేవుని కృప వల్ల బుద్ధి పుట్టి, వొకనాటి రాత్రి స్థిరముగా వున్న చౌకీ పహారా వారితో యీ దినము తెల్లవారితే మా వుభయుల ప్రాణములు తీసుకొంటూ వున్నారు, గనక మాకు ప్రాణ దానమిచ్చి మా సంస్థానము నిర్వాహకము చేస్తే, మేము దీపము పెట్టి అహోరాత్రి మిమ్మున తలుస్తూ వుందుము అని దీనుడై చెప్పుకోగా, ఆ పహారావున్న వారికి శ్రీదేవుని కృపవల్ల మనస్సు కరిగి దయవచ్చి, వీరి కాలిన వున్న సంకెళ్లు విరగ కొట్టగా, యీ శిద్దరామప్పను బసవప్పగారు వీపున కట్టుకొని, ఆ పహారా వున్న జనులు మార్గం చూపుతూ రాగా, దొంగ మార్గాన నాగల చెరువు బయిలుకు వచ్చిరి. అంతట ఆ పహారావాండ్లు, బసవప్పగారికి యిది హిరేహాళు మార్గమని చూపి, తెల్లవార వచ్చెను, శీఘ్రముగా పొండి అని చెప్పి తాము వూళ్లోకి పోయి, తమ చిన్నవాండ్లను సాగించుకొని వూరువిడిచి మరి వొక మార్గాన పోయిరి.

12. తెల్లవారిన పిమ్మట, యీ బసవప్ప శిద్దరామప్పగారు చెరలో వున్నందున, అన్న సరాళము లేదు గనక నడిచేదానికి శక్తత లేక, హిరేహాళు మజరా హారదాళు అనే గ్రామం ముందర పొలంలోకి వచ్చేవేళకు, బడలిక అయి బహు ఆకలి చేత ఆ బసవప్పగారితో శిద్దరామప్ప నాయునివారు, శత్రువులు వచ్చి పట్టుకొని పోతే అంతే ఆయెను, నాకు ఆకలిగా వున్నది అని చెప్పి చెట్టుకింద కూర్చుండెను అక్కడికి హిరేహాళు రెండు పరుగులు వుండగా, చూస్తివా వెళ్లివచ్చి తిరుగా వారిచేతికి చిక్కితే కాలమాయెనని బసవప్పనాయుడు తనంతటతాను చింతిస్తూ వుండగా, దైవ కృప వల్ల ఆ హిరేహాళునుంచి బలిజ గృహస్థు రెడ్డి ఆ పొలిమేరన కొఱ్ఱచేను చేసి కోసి కుప్ప వేసి వున్నదాన్ని తొక్కించి, గింజల రూఢకము చేయవలెనని, పశువులను మనుష్యులను బద్దికడవలను వుదకమును తీసుకొ

ని పోతూ, సంకెళ్లతో చెట్టుకింద కూర్చున్న వారిని చూచి, మీరు యెవ్వరు? యెక్కడనుంచి వచ్చినారు? అని అడుగగా, బసవప్పగారు తమ పూర్వోత్తరం యావత్తు ఆ రెడ్డికి చెప్పి, యీ కాలమందు అన్నోదకాలు పరామరిక చేసి మమ్మున యెవ్వరు చూడకుండా కాపాడితే, మాకు ప్రాణదానములు చేసిన పుణ్యము నీకు వస్తున్నది అని చెప్పగా, శ్రీదేవుని కృపవల్ల అతనికి దయవచ్చి, భయపడ వద్దని నమ్మకముచెప్పి ఆ సిద్ధరామప్పను తమ యెద్దుమీద కూర్చుండ పెట్టి, యీ బసవప్పను వెంటబెట్టుకొని తన చేని కళ్లంలోకి తోడక వచ్చి, శీఘ్రముగా తమ దగ్గరవున్న చద్ది అన్నం వీరికి పెట్టించి కార్రగడ్డిలో వీరిని దాచి పెట్టెను.

13. తర్వాత, యీ బళ్లారి కొండ మీద చౌకీ పహరాల మీద వున్న బంట్రోతుల గురికాడు వచ్చి, పహారా స్థలమందు చూడగా, చౌకీ పహరా వున్న తమ మనుష్యులున్ను, బేడి వేసియున్న శిద్దరామప్ప, బసవప్ప, వీరిద్దరున్ను లేనందున, వొకగడియ కొండ అంతటా వెతికి, పారిపోయిరి అని నిశ్చయము చేసుకొని దిగవచ్చి, యీ వర్తమానము యీ బళ్లారి రామప్పనాయునివారితో చెప్పగా అతను మిక్కిలి కోపము చేసి, తమ మంది గుర్రాన్ని పిలిపించి నాలుగు దిక్కుల అంపించి, చుట్టూ మూడు పరుగుల లోగా యెక్కడ వున్నా శిక్షు చేసి పట్టుక రమ్మని సెలవు యిచ్చెను.

14. అంతట అదే ప్రకారం నాలుగు దోవల ఆ మంది గుర్రము వెతుకుతూ వచ్చి, యీ చేనిదగ్గర జన సంఘము వున్నది విచారించుదామని నలుగురు గుర్రపు స్వారీలు వచ్చి విచారించగా, వారితో మేము వూళ్లోనుంచి వచ్చేటప్పుడు యిద్దరు మగజనాలు కుడుతాని మార్గాన పోతూ వుండగా శానా దూరమందు చూస్తిమి, తిరుగా యెవరూయీ మార్గాన రాలేదు అని ఆ రెడ్డి మొదలయినవారు చెప్పగా విని, కుడుతాని మార్గము పట్టి పోయి నాలుగు దిక్కులా తిరిగిచూచి, ఆ మంది గుర్రము యావత్తు తిరుగా పోయి రామప్పనాయుని వారితో యెక్కడా కనుపడలేదని చెప్పగా, చెయి చిక్కిన వారు తప్పించుక పోయిరి; వారికి దైవబలము వచ్చెను; ముందు యేమి పనులు కాబోచున్నవో తెలియదు; అని అతను చింతిస్తూ వుండెను.

15. తర్వాత ఆ హిరేహాళు రెడ్డి సాయంకాలమైన పిమ్మట కొర్రగడ్డిలో వున్న బసవప్పను శిద్దరామప్పనాయుణ్ని వెలపటికి తీసి, తమ యింటికి వెంట బెట్టుక పోయి స్నానము చేయించి, తన యింట కలిగిన భోజనము పెట్టించి కమ్మరవాణ్ని పిలిపించి బసవప్ప కాళ్లను వున్న బేడి విరగ కొట్టించి, తమ గ్రామములో యింకా కొంత జనాన్ని కూర్చుకొని, రెండు యెద్దుల మీద వీరిద్దరిని కూర్చుండ పెట్టుకొని, సమూహముతో హిరేహాళుకు తోడకపోయి, ఆ గ్రామములో వ్యవహారము చేసే మురారిరాయ తాలూకు అయిన ఆమీన్ శివప్పగారితో యావద్వర్తమానము చెప్పి, వారి స్వాధీనము చేసి తాను అప్పణ తీసుకొని తన పల్లె చేరెను.

## CHAPTER FIFTH.

1. పిమ్మట ఆ శివప్పగారు వీరిద్దరి రాకడ విచారించి, మీరు యెవరు? మీ తండ్రిగారి పేరు యేమి? అని అడుగగా, ఆ శివప్పగారితో నేను అనంతపురం రామప్పనాయుని కుమారుడను; నా పేరు శిద్దరామప్ప; యితను నా బావమరిది; యితని పేరు బసవప్ప, మా పూర్వోత్తరము యిది అని చెప్పగా, అతనికి బహు జనంచేత వీరి యావద్వర్తమానము శ్రుతమై యున్నందున బహు తాపత్రయపడి, యీవరకు అయిన కష్టకాలాలు వెనక్కు పోయినవి; శ్రీ దేవుని కృపవల్ల ముందు శుభకాలము వచ్చీని; చింత చేయవద్దు; అని వీరికి ధైర్యము చెప్పి, మీ భోజనానకు యెట్లా? బలిజవాని యింటికి సామగ్రి పంపించేము అని చెప్పగా, మేము యిప్పుడే ఆ గ్రామం గౌని యింట్లో భోజనము చేసుకొని వచ్చినాము; మాకు ఆకలి కాలేదు అని చెప్పిరి. గనుక ఆ శివప్పగారు తన యింటి ముందర హజారములో తన దగ్గర పరుపు పరిచేవారిని పిలిపించి, యిద్దరికి పరుపు వేసి పండుకొన్న తర్వాత రండి అని చెప్పి, ఆ హజారములో పండుకొనే జనానికి వీరిమీద బహు పరామరికగా వుండండని ఆజ్ఞ చేసి, వారికి తాంబూలము

యిచ్చి సుఖముగా ఉండుకో పొంచి అని సెలవు యిచ్చి, తాను ఉండుకో పోయెను.

2. ఆ ప్రకారమే యీ శిద్దరామప్ప, బసవప్ప, వీరిద్దరున్ను ఆ హజారములో ఉండుకొని వుండిరి. మర్నాడు ఆ శివప్పగారు వీరిని పిలిపించి కోటలో వొకబలిజవాని యిల్లు నిష్కర్ష చేసి, తమ సంబంధమైన దళాయతును వారి స్వాధీనము చేసి, తమ వెచ్చం అంగడికి వీరి దిక్కునుంచి వచ్చిన దళాయతు యేమి వెచ్చము అడుగుతున్నాడో అది యిచ్చి తమ లెక్కలో చేర్చుకొనేది అని దిట్టము చేసి, క్షవరకుణ్ని పిలిపించి ఆ యుక్షుర్మ చేయించి మంగళస్నానము చేయించి, వీరికి తగిన వస్త్రపాత్రాదులు యిచ్చి నడిపిస్తూ వుండి, తమ ధణీ అయిన మురారి రాయనివారు చిరతనావల్లె యుద్ధము మీద పోయి వుండగా, యీ యావద్వర్తమానము విశదముగా వ్రాయించి, తమవద్దినుంచి వచ్చిన సెలవు ప్రకారము నడుచుకొంటూ వున్నాను అని అతనికి జాబు ఉంపించగా, ఆ మురారి రాయనివారు దాన్ని చూస్తూనే, యీ హండేవారి సంస్థానము బహు దినాలది; దీనికి విపత్తు యీలాగున దైవము తేరాదు; అని బహు తాపత్రయపడి, కుడితిని జంటంగి రాయనివారికిన్ని వ్రాయించి అంపించినాము, అతడున్ను నీవున్ను వారు యేయే విషయమును గూర్చి యేమి సహాయము యిమ్మంటున్నారో అవి, మీ వుభయులచేతను అయినంత మట్టుకు నిర్వాంచనగా చేసి, మీకు సాధ్యము కానిది మాకు వ్రాశి ఉంపిస్తే, మేము యావత్తు ఉరామరిక తీసుకొంటూ వున్నాము అని శివప్పగారికి ప్రత్యుత్తరమును ఉంపించిరి.

3. ఈ రీతున వొక నెల జరిగిన పిమ్మట, వొక దినం యీ బసవప్పగారు ఆ మీంల్ శివప్పగారి దగ్గరికి పోయి, నేము యీలాగున కూర్చుంటే ముందు కార్యభాగం యేలాగున అయ్యీని; శిద్దరామప్పనాయునివారిని యిక్కడ వుంచుకొని నాకు తగిన సహాయము చేసి సెలవు యిస్తే మీపేర కార్యనిర్వాహకము చేసుకొని మీకు కీర్తి తెస్తున్నాను అని చెప్పుకోగా, ఆ శివప్పగారు మనస్కరించి దొరవారిని అక్కడనే వుంచుకొని, యీ బసవప్పగారికి వొక గుర్రమున్ను తగిన ఆయుధమున్ను వస్త్రములున్ను కొంత

రూకలున్ను జనాన్నిన్ని యిచ్చి అంపించగా, ఆయన వెళ్లి చిత్రకల్లు పెద్ద పాళెం సంస్థానాలకు పోయి, కొంత మందిని సహాయము చేసుకొని, బళ్లారివారి తాణా పడనిరాప్తాడు అనే గ్రామానకు వచ్చి చేరెను.

4. ఆ రాప్తాటిలో మేకల చిన్నయ్య అనే గురికానికి, పూర్వము అనంతపురంరామప్ప నాయుని వారు కుమారకట్టం యిచ్చి వుండిరి గనక, ఆ యభిదానంతో వాడు బసవప్పనాయుడికి యెదురుగా వచ్చి పాదాల పడి తోడక పోయి, స్వామి దయచేత మీరు వెలపటికి వచ్చినది బహు సాధకము అని చెప్పి, ముందర బుక్కపట్నం, కొత్తచెరువు, మరూరు, ముక్తాపురం మొదలయిన దేశస్థులకు తన పేర మేకల చిన్నయ్య వుత్తరాలు వ్రాయించి అంపించగా, వారు అవిచూచుకొని మన పూర్వపు దొరలు వచ్చిరి అని బహు సంతోషపడి, కానుక తీసుకొని మందితో సహా బసవప్ప నాయునివారి వద్దికి వచ్చి చేరిరి. పూర్వము అనంతపురములో వున్న బయ్యన్నగారి అనంతయ్య అనే వర్తకుడు తాడిమర్రి రాజ్యంలో చియ్యదుర్గం అనే గ్రామం చేరివుండెను గనక, అతని పేర కాగిద పత్రాలు వ్రాయించి మేకల చిన్నయ్య అంపించగా, ఆ అనంతయ్య ఆ వుత్తరములను చూచుకొని చాలా సంతోషపడి, తక్షణమే తర్లి రాప్తాడు చేరి బసవప్పగారి దర్శనంచేసుకొన్నంతలో, ఆ బసవప్పగారు తమ సుఖదుఃఖం ఆది నుంచి నడిచిన వర్తమానం యావత్తు చెప్పుకోగా, బహు కష్టపడి వచ్చినారు; యికమీద దేనికీ మీరు చింత చేయపని లేదు; నా చేతను అయినంతలో ద్రవ్య ఖర్చులకు సానుకూలం చేస్తూ వున్నాను; మీరు రాచకార్యానకు ముందు యేలాగున ప్రయత్నము చేయవలెనో ఆలాగున చేయండి అని, ఆ బసవప్పగారి అప్పణ తీసుకొని, యీ అనంతయ్య రాప్తాటి పేటలోకి వచ్చి భోజనము చేసి వుండుకొనెను.

5. ఆ మర్నాడు బసవప్పగారు యీ అనంతయ్య చెప్పిన వర్తమానము, మనస్సున తెచ్చుకొని, యీ రాప్తాటిలో వున్న మేకల చిన్నయ్యను పిలిపించి, అతనితో కోమటి బయ్యన్నగారి అనంతయ్య, మందికి భత్యఖర్చుకు యిస్తున్నాడు; యీ వచ్చిన బుక్కపట్నం, కొత్తచెరువు, మరూరు, ముక్తాపురం,

గొంది రెడ్డిపల్లె, మొదలయిన వారి కానుకల తీసుకొని, మందితో వచ్చిన వారికి భత్యఖర్చులకు యిప్పించి, మందిని కూర్చేది అని చెప్పి యీ వచ్చిన గ్రామస్థులను మందిని సహా అతని వశం చేసి, తాను వేములకు పోయి కొమారనాయుని దర్శనం చేసుకొని, అతనితో నేను కొంత సైన్యం తీసుకొని కది దినములలో వస్తున్నాను; నీవు మందితో కూడా రాప్తాటిలో అతిజాగ్రతగా వుండుమని చెప్పి పంపి; అక్కడినుంచి తర్లి పెదవేములకు పోయి, పెదకొమారనాయునివారి దర్శనము చేసుకోగా, వారు బహు సన్మానము చేసి, యితని సుఖదుఃఖములను విని తాపత్రయపడి, నాచేతను అయినంతలో నిర్వంచనగా సహాయము చేస్తున్నాను; చింత చేయవద్దు అని ధైర్యం చెప్పి కది దినములు అక్కడ నిలుపుకొని, వస్త్రపాత్రాదులు యిచ్చి వెచ్చానకు పరామరిశ చేసి, యర్రగొల్ల రామప్ప వెంబడిన కొంత మందిని యిచ్చి, సెలవిచ్చి ప్రయాణము చేయించెను.

6. అంతట ఆ బసవప్పనాయుడు ఆ సేనా సహితముగా బుక్కపట్నం మీద వెళ్లి, బండమీదిపల్లె, కూడేరు, కొరకొళ్ల మొదలయిన గ్రామాలు పుపగ్రామాలు సహా తాణా వేసుకొని, అక్కడినుంచి కొడిమె రాచానపల్లె మీద వెళ్లి, జంతులూరు చేరి తాణా యిమ్మనగా, ఆ గ్రామంలో వున్న ఖిల్లేదారుడు యివ్వనందున, లగ్గలకెక్కి ఖిల్లేదారుణ్ని కొట్టివేసి, ఆ గ్రామాన బదులు ఖిల్లేదారుణ్ని వుంచి, రెడ్డిపల్లె, రేకులకుంట శిద్ధరామపురం, వుప్పర్లపల్లె, మీద వెళ్లి రాప్తాడు చేరగా, అచట వున్న జనం యావత్తు యెదురుగా వచ్చి బహు సంతోషపడి బసవప్పనాయునివారిని గ్రామంలోకి పిలుచుక పోయెను.

7. ఆ సమయాన ఘోర్పడే తాలూకు భర్మాజి దళవె, సుల్తానజి దళవె, యీ యిద్దరున్ను చిన్నాజి అనేవారున్ను, అరువై గుఱ్రాలు యేనుగ నగారా సహా, మార్గవశాత్ చిరతనాపల్లెలో మురారి రాయనివారు వుండగా, వారి దగ్గెరికి కొలువు నిమిత్తం పోతూ యీ రాప్తాడు వంకగడ్డన దిగగా, చేకల చిన్నయ్య రెడ్డి కరణాలు సహా వారివద్దికి పోయి, ఆ భర్మాజీని చూచి, మీరు యెవరు? యెక్కడనుంచి వచ్చినారు? అని అడుగగా, అతను

తమ వర్తమానం చెప్పగా విని వచ్చి, తమ ధణీ అయిన బసవప్పగారితో మనవి చేయగా విని, ఆ మేకల చిన్నయ్యనే తిరుగా పంపించి ఆ సరదార్లను ముగ్గురిని పిలిపించి భేటి చేసుకొని, వారితో మాదగ్గర కొంత రాచకార్యం వున్నది; నాలుగు నెలలకు మీకు వచ్చిన సంబళము అయినాసరే, లేక హల్లలహిస్సా (అనగా కొంచెం కొంచెముగా) అయినా యిస్తున్నాము, మా కార్యం నిర్వాహకం అయినట్టుగానే, మీకు తగిన సంబళాలున్ను తగిన గ్రామమున్ను వుమ్మళిగె యిచ్చి యిక్కడనే నిలుపుకొంటున్నాము; యీ సమయాన నిర్వాహకం చేస్తే సంస్థానం వుండే పర్యంతం మీకు అన్నం వుంటున్నది అని సెలవు యిచ్చి, పెద్దమనుష్యులచేత చెప్పించగా, శ్రీ దేవుని కృపవల్ల వారు మాట యిచ్చి యిక్కడనే కొలువుకు నిలువగా, వారికి నెల నెలకు అల్లలహిస్సా (అనగా కొంచెకొంచెముగా) యిచ్చేటట్టు తనఖా చేసి యిచ్చి, బసవప్పగారు ఆ గుర్రాన్ని, పోగుచేర్చిన మందిని తీసుకవచ్చి, బుక్కరాయసముద్రానకు ముత్తిగె చేరువ చేసిరి.

8. అప్పుడు అనంతపురములో వున్న బళ్లారి రామప్పనాయుని వారి తాలూకు జగ్గుల మల్లప్ప, రామచంద్ర నాయకుడు, కురుగోడు సూరప్ప, తురక జంజాభాయి, యీ నలుగురు యోచన చేసి, తమ దొర బళ్లారి రామప్పనాయుని వారికి బుక్కరాయసముద్రం జేరు ముత్తిగె ఆయెను; అక్కడ పాత మంది రెడ్లు కరణాలు గ్రామాలు పాడుచేసి బసవప్పగారి దగ్గర చేరిరి; ఆ గ్రామం తీసుకొంటూనే అనంతపురానకు రాగలవారై వున్నారు; మేము యీ గ్రామానికి నూతనస్థుల మైనందున పిలిస్తే మాట్లాడే జనం లేరు; గనక యీ సమయమందు సకల సేనల కూర్చుకొని అతిత్వరగా వచ్చి, వారి ముత్తిగె మీదపడి ముత్తిగె లేపినట్టు అయితే, తిరుగా మీ ముఖం చూస్తున్నాము; లేనట్టు అయితే దైవయత్నం యేలాగున వున్నదో మా అదృష్టం ఆలాగున అవుతున్నది; అని వుత్తరం వ్రాసి ఖడ్డీకట్టె మునే వీరభద్రుని చేత పంపించగా, అది బళ్లారి రామప్పనాయుని వారు చూస్తూనే, కురుగోడు బళ్లారి మందిని పిలిపించి, తన తమ్ముడైన హనుమప్పనాయుని వశం చేసి, మీరు పోయి చాపా పడి ముట్టడి లేపి రమ్మని సెలవు యిచ్చి అంపించగా, వారు వచ్చి మూడు ఝాముల మీంద జేరు ముట్టడి వేసిన

యీ బసవప్పగారి ఫౌజు మీద చాపా పడినందున, బహు యుద్ధము అయి, వుభయుల మంది హతులయి నందున, యీ బసవప్పగారి తట్టు మంది ముట్టడి తీసి, చెరువు లోతట్టు వుప్పర్ల పల్లె మార్గాన గుమ్మన కట్ట ఆసరా చేసుకొని ఖ్యాళవ్వతో వులో దిగెను. బళ్లారి వారిఫౌజు వెనక్కువచ్చి అనంతపురం చేరెను.

9. యిక్కడి కల్లోలం యావత్తు కడప నబాబు వారు విని, బహు దినాల సంస్థానానకు దిక్కు లేక హానివచ్చెను అని తమ దగ్గిర వున్న సరదారునకు కొంత ఫౌజును యిచ్చి, నీవు అతిశీఘ్రముగా పోయి ఆ గ్రామంలో వున్న బళ్లారి వారిని వెళ్లగొట్టి అనంతపురం ఠాణావేసి, అందులగల వర్తమానములను వ్రాయించి పంపించమనగా, ఆ సరదారుడు బయులుదేరి నార్పలవద్ద వున్న కోతతేరు అనే వంకగడ్డను వచ్చి దిగెను. యీ వర్తమానం కోటలో వున్న బళ్లారి వారు విని, తమ మీద చాపా పడవలెనని కడప వారికి కాగిద పత్రాలు వ్రాసి పంపించినారు అని తలంచి, మందిసహా కలకలాయమానులై ఫౌజు విరిగి రాప్తాడు ఆ ప్రాంత్యాల చేరి, తమతమ గ్రామాలకు లేచి పోయిరి.

10. యీ వర్తమానం బసవప్పగారున్ను విని, భర్మాజితో కూడా లేచి పోయి రాప్తాటిలో వుండిరి. యీ బసవప్పగారి ఫౌజు లేచి పోయిన వర్తమానము కోటలో వున్న బళ్లారి వారు విని, కడపనుంచి వచ్చిన ఫౌజుకు యెదురుగా పోయి, వారిని తోడకవచ్చి రేపు రాత్రి మన గ్రామంమీద దొమ్మి యుద్ధం చేతురు; నిన్నటి యుద్ధములో బహుమంది హతులైరి; ఆ చచ్చినవారిని తీసేటందుకు సావుకాశం లేదు; యిట్లా వుండగా ఆ ఫౌజు వస్తే నిర్వాహకం లేదు అని అధైర్యపడి, రాత్రిరాత్రే అనంతపురం బుక్కరాయ సముద్రములో వున్న మంది యీ నలుగురు సరదార్లను వెంట తీసుకొని, తోపుదుర్తి దగ్గిర తెల్లవారేలాగున పోయి బళ్లారి చేరిరి. యీ రెండు గ్రామాలలో అగ్గి పాడై వుండెను గనక, బుక్కరాయసముద్రం పంచాంగం తిమ్మయ్య; వీరభద్రస్వామి పూజారి అయిన తంబళి శరభుడు, కూరఅమ్మే గిడ్డ వరువు గాడు, యీ ముగ్గురు తమ సామాను వెళ్లతీసుక పొయ్యే నిమిత్తము గ్రామంలోకి వచ్చి చూచి, వారిలో తంబళి శరభుడు అతి శీఘ్రము

గా రాప్తాటికి పోయి, ఆ బసవప్పగారితో బుక్కరాయసముద్రములో యెవరు లేరు; అగ్గి పాడు అయినది; యావజ్జనం గ్రామం విడిచి పారిపోయిరి; తాము మందిని తీసుకొని శీఘ్రముగా రావలసినదని సమాచారం చెప్పెను.

11. ఇట్లా వుండగా, అనంతపురం చెరువుకట్టకింద నల్లగుట్ట మీద వుండే గవిమఠం శివలింగ దేవర వారి శిష్యులు నలుగురు జంగాలు, శివ పూజ నిమిత్తమై రాయభారం తూము దగ్గరికి గన్నేరు పుష్పాలకు వచ్చివుండగా, యీ అనంతపురములో నుంచి యావత్తుజనం మూటలు కట్టుకొని కట్టమీద పారిపోతూవున్నవారిని చూచి విచారిస్తే, కోటలో వున్న బళ్లారి వారి మంది సరిపొద్దువేళ కోట విడిచి పారిపోయిరి అని చెప్పగా విని వచ్చి, శివలింగదేవర వారితో చెప్పగా, వారు తన వద్ద వున్న జంగమయ్యలను వెంటపెట్టుకొని, అనంతపురం కోటలోకి పోయి చూడగా, తెరిచిన వాకిళ్లు తెరిచినట్టే వుండెను గనుక వాకిళ్లు వేయించి, వొక పాతగుడ్డ వసుపులో అద్ది యీ టెక్కెపు కట్టి హులిముఖం మీద పెట్టి, వారు విడిచిపెట్టి పోయిన పాత నగారా అక్కడపెట్టి, హండె శిద్దరామప్పనాయునివారి రాజ్యం ఆయెను అని నగారా కొట్టి, వొక జంగమయ్యను బసవప్పగారి దగ్గరికి ఫౌజు తీసుక రమ్మని పంపించెను.

12. బుక్కరాయసముద్రములోనుంచి వచ్చిన ఆ తంబళి శరభుడు చెప్పిన సమాచారం బసవప్పగారు విని, కొంతమందిని యిచ్చి, మేకల చిన్నయ్యను బుక్కరాయసముద్రం ఠాణా వేయమని ఆ తంబళి శరభని వెంబడి పంపించి, తాను సైన్యయుక్తంగా అనంతపురానకు పోతూ వుండగా; ఆ జంగమయ్య యెదురుగా వచ్చి చెప్పిన వర్తమానం విని, యీ వేళకు సిద్ధరామేశ్వరునకు మామీదను అనుగ్రహం కలిగెను అని సంతోషపడి, అతివేగముగా వచ్చి అనంతపురం ఠాణా వేసెను. ఆ మేకల చిన్నయ్య పోయి బుక్కరాయసముద్రం ఠాణా వేసెను. యీ రెండు గ్రామాలు ఠాణా వేసుకొని వుండిరి.

13. ఇట్లా వుండగా ఆ నార్పలవంక గడ్డను దిగిన కడప వారి ఫౌజు లేచివచ్చి, అమ్మగారి పేట దగ్గర దిగి, యీ జిల్లాల పూర్వోత్తరం విచారించుకోగా, యీ దినం పూర్వం వున్న రామప్పనాయుని వారి అల్లుడైన బస

వప్ప తగిన సేనలతో వచ్చి, రెండు గ్రామాలు ఠాణా వేసెను అని చెప్పగా ఆ వర్తమానం విని, అక్కడనే ఆ రాత్రి దిగెను. యీ వర్తమానం కోటలో వున్న బసవప్పనాయుని వారు విని, తన వద్ద వున్న దేశాయి దేవణ్ణతో రాత్రి రాత్రే నీవు ఫౌజులోకి పోయి, సరదార్ల భేటి చేసుకొని, శ్రీదేవుని కృపవల్ల తిరిగి గ్రామం మాస్వాధీనం ఆయెను; ముందు మీ ఆజ్ఞ ప్రకారం నడుచుకోగలవారము అని యావత్పూర్వోత్తరము చెప్పిరమ్మని సెలవుయియ్యగా; అదే ప్రకారం యీ దేవణ్ణ పోయి ఆ సరదార్లతో చెప్పగా, వారు విని సొమ్ము వారికి సొమ్ము ఆయెను గదా అని సంతోషపడి తిరుగా కడపకు వెళ్లిపోయిరి.

14. ఈ కలాపన బుక్కపట్నం చెరువు నల్లగుట్టల దగ్గర కట్టతెగిపోయివుండగా, అక్కడ రెండు గ్రామాలకున్ను రాజ్యానకున్ను, బసవప్పనాయుడు కౌలుయిచ్చి, కాపుతనం అభివృద్ధి చేసుకొంటూ గ్రామప్రతి గ్రామాలకు తిరుగుతూ గ్రామస్థులకు ధైర్యము చెప్పి, వస్త్రపాత్రాదులు యిచ్చి సాగుబడి చేయిస్తూ వుండెను.

15. ఇట్లా ఆరు నెలలు అయినందున, యీ యావద్వర్తమానం హిరేహాళు సుబేదార్, కుడితినీసుబేదార్, యీవుభయులు మురారిరాయనివారికి వ్రాయించి అంపించగా, వారు అది చూచి బహు సంతోషపడి, యీ శిద్దరామకృష్ణనాయునివారిని చక్కగా కాపాడి, అనంతపురాన నుంచి బసవప్పగారి వుత్తరము వస్తూనే బహుమానయుక్తంగా తగిన వస్త్రపాత్రాదులున్ను కొంత మందిని యిచ్చి గ్రామానకు అంపించండి అని, బదులు వుత్తరములు వ్రాయించి వారికి అంపించెను.

16. ఇట్లా వుండగా, యీ అనంతపురంలో బసవప్పగారు రాజ్యం స్థిరపరచి, మార్గశిర శుద్ధ౧౫లు శ్రీవిరూపాక్షేశ్వరుని రథోత్సవంనాడు పట్టాభిషేకానకు ముహూర్తం లెస్సగా వున్నది అని, యిక్కడ తాను జరిగించిన యావద్వర్తమానమున్ను హిరేహాళు సుబేదారు శివప్పగారికిన్ని కుడితిని సుబేదారు జంటంగిరాయునికిన్ని వ్రాయించి అంపించగా, వారు వుభయులు ఆ కాగిదపత్రాలు చూచుకొని, తమకు యిందునగురించి మురారిరాయని వారు వ్రాయించి పంపించిన వుత్తరపు ప్రకారం, వారు కోటలో వున్న

శిద్దరామప్పనాయునివారిని పిలిపించి ; తగిన వస్త్రపాత్రాదులున్ను, గుర్రాల్నిన్ని, కొంతమందినిన్ని, యిచ్చి అనంతపురానకు పొమ్మని అంపించిరి.

17. ఆశిద్ద రామప్పనాయుడు అక్కడినుంచి మార్గశిర శుద్ధ ౯ నాడు తర్లి ద్వాదశినాడు కొరకొల్లచెరి, ఆమరునాడు కూడేటికి వచ్చి దిగివుండి, మర్నాడు శుద్ధ ౧౪లు శ్రీసంగమేశ్వరసామికి వుత్సవం చేయించి, పౌర్ణమి మూడు ఝాముల వేళ శుభలగ్నమందు శ్రీస్వామివారి రథం వడం పట్టే సమయమందు, అనంతపురానకు పశ్చిమం పిల్లిగుట్ట దగ్గెరికి, గ్రామంలోనుంచి బసవప్పగారు మంది గుర్రం సహా యెదురుగావచ్చి శిద్దరామప్పగారిని తోడకపోయి, రథోత్సవకాలమందు శ్రీస్వామివారి దర్శనం చేయించి, కోటలోకి వెంటపెట్టుకపోయి సింహాసనము మీద కూర్చుండపెట్టి, రౌతు రాణువ సామయాజకులు సహా కొలువు మొక్కు వేయగా, వారివారికి తగినట్టువస్త్రతాంబూలాలు యిచ్చి పేటలోకి అంపించి, యీ శిద్దరామప్పనాయునివారు నగరిలోకి పోయి, శాలివాహనశకం ౧౬౭౫ అగునేటి శ్రీముఖనామసంవత్సరం [AD 1753] మొదలు రాజ్యానకు తాను పట్టపుదార అయి, తన బావమరిది కరిహులి బసవప్పగారిని దళవాయిగా నిష్కర్ష చేసి, రాజ్యం విచారిస్తూ కొన్నాళ్లు జరిగిన పిమ్మట బుక్కపట్నం చెరువు తెగిన గండి భద్రం చేయించెను.

## CHAPTER SIXTH.

1. తదనంతరం మరికొన్నాళ్లకు గుత్తి మురారిరాయనివారు రెండు వేల గుర్రం, నాలుగువేల బారు కాల్బలం సహా, యిలీసుఖానునికి సాహాయ్యం చేసి యిచ్చి, అతనితో నీవు అనంతపురానికి పోయి, చౌథాయి [అనగా ఖండిణీ బాకీ రూకలు] తీసుకరమ్మని అంపించగా, అతను సైన్యయుక్తంగా వచ్చి బుక్కరాయసముద్రానకు ముత్తిగె వేసి, బాకీ చౌథాయి రూకలు యివ్వమని అడుగగా ; యిప్పుడు మాదగ్గెర యేమి వున్నది ? నూతనంగా సంస్థానం వచ్చినది మురారిరాయనివారి చిత్తానకు యెరుక అయ్యే వున్నది ; అని బహు

విధాలా ఆ వచ్చిన సరదారునితో చెప్పుకోగా, మేము వచ్చి దిగిన పిమ్మట పూరకపంపించేది యుక్తము కాదని చెప్పినందున, పదివేల రూపాయలకు తేరుగడ చేసుకొని, నగరిలో వున్న యెద్దులు, గంతలు, సామాను, శిద్దె బుర్రలు, కొంతనగదు, యావత్తు వారివశం చేస్తే నాలుగువేల రూపాయీలు ఆయెను. తతిమ్మాబాకి ఆరువేల రూపాయీలకు గ్రామంలోవున్న జనంమీద తలకు అయిదు వరహాల ప్రకారం పన్ను నియమించి, కందుకూరి కృష్ణమశెట్టి ముఖాంతరముగా వసూలు చేసి యిచ్చిరి. అంతట దండు లేచి ధర్మవరం ముత్తిగెకు పోయెను.

2. అనంతరం, యీ సిద్ధరామప్పనాయునివారు బయ్యనగారి అనంతయ్యను పిలిపించి, బహు ఆదరణ చేసి వస్త్రపాత్రాదులు యిచ్చి, మానిమిత్తం శానా కష్టపడితివి అని వుపచరించి, అతను యిచ్చిన రూకలకు వుప్పర్ల పల్లె వేసి యిచ్చి, బ్రాహ్మణ పల్లె వుమ్మళిగె వ్రాయించి యిచ్చి, కోటలో వున్న జగ్గుల మల్లప్పగారి యిల్లు అతనికి యిప్పించెను. పిమ్మట సరదారు భర్మాజిదళవాయిని పిలిపించి, చాకిరి చేసిన దినాలను విచారించి అల్లల హిస్సా చెల్లుపోగా, నిల్వబాకీ సంబళం యీ బయ్యనగారి అనంతయ్య మీద తనఖాచేసి యిచ్చి, బుక్కరాయ సముద్రం తాలూకు గోవింద పల్లె యినాముయిచ్చెను.

3. ఈలాగున కొన్నాళ్లు జరిగినపిమ్మట, యీశ్వరనామ సంవత్సరమందు బలవంతరాయనివారు ఫౌజుతోవచ్చి, అనంతపురానకు ముట్టడిదిగి, పేటలో గంధవడి అంగడిమీద మోర్జా ౧, మల్లప్ప కట్టమీద ౧, పేటలో ౧, పెట్టి, పిల్లికూన అయినా అడ్డు ఆడకుండా కేవలం దౌర్జన్యం చేస్తూ వున్నందున, యీ బసవప్పగారు వారికి యిచ్చి సమ్మతిచెప్పేదానికి రూకలు లేనందున, యీ ఫౌజుమీదపడి చస్తాము అని తెంపుచేసుకొని, దొరవారిని సామయాజకులను యావత్తు జనాన్ని పిలిపించి, వారితో వీరికి యిచ్చి సమాధానం చెప్పేదానికి మనకు లేనందున, రేపు మధ్యాహ్నవేళ పోయి మోర్జాల మీదపడి యుద్ధముచేసి పేటవిడిపించి పునహా వస్తినా సరేవే, లేనట్టు ఆయెనా మీగతి మీరు చూచుకోవలసినది అని చెప్పి సైన్యమును పిలిపించి, సంస్థానం ముణిగే యోచనగావున్నది; యిచ్చి సమాధానం చేసుకోవడానకు

మనకు ద్రవ్యం లేదు; మన సంస్థానం క్షాత్ర ధర్మం కలది అని బహుమంది వాడుకొంటూ వున్నందున, రేపు మధ్యాహ్నం పోయి దండు మీద పడి యుద్ధము చేసి, మోర్చాలు లేపి పేట విడిపించవలెను అని నామనస్సున వున్నది; నాతోపాటు యుద్ధానకు యెవరెవరు వస్తున్నారో వారు రేపు ప్రొద్దుననే భోజనాలు చేసుకొని, కసువు బట్టలు తొడుక్కొని రాతి వూరువాకిలి జీబీకి సిద్ధమై వచ్చేది అనిచెప్పి, రాత్రి నాలుగు తాసులకు నగరిలోకి పోయి భోజనంచేసి, చౌకీ పహరామీద తిరుగుతూవుండెను.

4. అంతట తెల్లవారెను గనక తిరుగా నగరికిపోయి స్నానంచేసి, శిద్ధరామేశ్వరుని దేవళములో మునుపు వున్న అఖండాలు గాక తిరుగా రెండు అఖండాలు పెట్టించి, శ్రీదేవునికి నమస్కారము చేసి కసువు బట్టలు తొడుక్కొని, దొరవారితోనున్ను సామయాజకులతోనున్ను చెప్పి వచ్చి, కోటమీదవున్న కావలి వారిని భద్రపరచి, రాతి వూరువాకిలి జీబీన వేపచెట్టుకింద కూర్చొని, సైన్యమును పిలిపించి తనకు నమ్మిక అయిన మందిని నన్నూటికి సహా తోడుకొని, మధ్యాహ్న వేళ కత్తులూరు వాకిలి తీయించుకొని అతిత్వరగా వచ్చి, గంధవడి అంగడిమీద వున్న మోర్చామీద పడి, బహు యుద్ధము చేసి, ఆ మోర్చాకు అగ్గిపెట్టి, అక్కడినుంచి కట్టమీది మల్లప్ప దేవళం మీద వున్న మోర్చామీద పడి, అక్కడ బహుమందిని హతంచేసి ఆ మోర్చానున్ను కాల్చి, అక్కడినుంచి చక్కగా పేటకు రాగా; యింతలో పేటలో అయిన కల్లోలం యావత్తు బలవంతరాయడు దండులో విని కొందరు శిఫాయీలను సరదార్లను పిలిపించి, వారితో మీరు పేటకు పోయి కోటలోనుంచి వచ్చిన జనం మీదపడి యుద్ధము చేసి, వారిని తిరుగా కోటలోకి చొరదోలి చిక్కినవారిని పట్టుకొని రమ్మని సెలవియ్యెను.

5. ఆ సరదార్లు, శిఫాయీలు ఆలాగే సిద్ధపడి కూడేటి వాకిలిగుండా బాజారున శ్రీవిరూపాక్షేశ్వరుని దేవళం వద్దికి వచ్చేవేళకు, యీ కోటలో వున్న మంది యీ రెండు మోర్చాలు వట్టివి చేసి బాజారున యుద్ధము చేస్తూ రాగా, వారికి వీరికి అఘోరయుద్ధం అవుతూ వుండగా, కోటమీదనుంచి పిరంగీలు బాణాలు విశేషించి వేయగా, పేట కొంచెముగనక దండు నిర్వహించలేక చాకిరేవు పర్యంతరం విరిగి పారగా, అత్యంత రణా

ర్ణవమై పీనుగల పెంట ఆయెను. యీ కూడేటి వాకిలి అరాబి ఆసరా చేసుకొని యీ బసవప్పగారి ఫౌజు నిలిచెను. యింతలో అస్తమానము అయినందున బలవంతరాయని ఫౌజు యావత్తు దండులో పోయి చేరెను.

6. ఈ వర్తమానం యావత్తు బలవంతరాయనివారు విని, యీ కోట యెంత; వీరి అధికారము యెంత; బహుజనం చచ్చిపోయెను; ప్రొద్దుననే హల్లా చేయవలెనని ఆలోచన చేస్తూవుండగా; మురారిరాయనివారి తాలూకు బావాఖాన్ హలాలి అనే వాడున్ను యింకా కొందరు సరదార్లున్ను, యీ చిన్నపాళెం మీద యుద్ధము చేసి సాధిస్తే, పాడుగోడలే కాని యితరము యేమిన్ని లేదు; యిది బహుదినాల సంస్థానం మునిగి పోయివుండి తిరిగీ తమ అనుగ్రహంచేత సంస్థానము ఆయెను అని చూపెట్టుకొని, తమ దయకు పాత్రుడై వున్నాడు; వీరు తాతముత్తాతల నాటినుంచి సౌత్రవంతులు అని చెప్పుతున్నారు; యిందుమీద హల్లా చేయుము అని సెలవు అయితే చేస్తున్నాము; వారు ప్రాణాలతో వ్రయం అవుతున్నారు; తమచిత్తప్రకారం నడుచుకొంటున్నాము అని చెప్పగా, బలవంతరాయనివారు విని ఆవేళకు దైవయోగంవల్ల సొండే కుప్పం వకీల్ కేశవరాయణ్ని పిలిపించి, నీవు ప్రొద్దుననే పోయి ఆ బసవప్పనాయునివారి భేటి చేసుకొని అభయమిచ్చి తోడకరమ్మని సెలవు యిచ్చెను.

7. అదేప్రకారం ఆ కేశవరాయడు ప్రొద్దుననే పేటలోకి వచ్చి, జీబి అగడ్త కట్టమీద వున్న పెద్ద మనుష్యుల పిలిపించి, వారితో నేను బలవంతరాయని వారి వకీలును; దండులోనుంచి వస్తిని; బసవప్ప నాయునితో మాట్లాడ వలసి వున్నది; గనక వారు పెద్ద పీర్ల కట్ట దగ్గెరికి వచ్చినట్టు అయితే అచ్చట సమక్షమంలో మాట్లాడగా సకలం తెలుస్తున్నది; అని చెప్పి రమ్మని పంపగా, వారు పోయి యీ వర్తమానం ఆ బసవప్ప నాయునితో చెప్పగా విని, చింతయేమి; మేము హులి ముఖం బురుజు మీందికి వస్తున్నాము; వారున్ను దయచేసి జీబి ముందరికి వచ్చినట్టు అయితే అదే ప్రకారం మాట్లాడనయ్యేని అనిబదులు చెప్పి పంపగా, ఆ కేశవ రాయనివారు ఆ జీబి ముందరిలోని అగడ్త కట్ట అరుగుమీందికి వచ్చి కూర్చొనిరి. బసవప్ప నాయుని వారున్ను కోటలోనుంచి వచ్చి వూడెము యెక్కిరి. అప్పుడు వారికి వీరికి దూర దర్శనము ఆయెను.

8. అప్పుడు ఆ కేశవరాయడు బసవప్పగారితో, మాధణీ సెలవు అయినది; మిమ్మున తమ దర్శనమునకు పిలుచుక రమ్మన్నారు అని చెప్పగా విని, మీరు గొప్ప దండుగలవారు; నేను స్వల్ప పాళెగాణ్ణి; మీ నమ్మకం నాకు యేరీతున తట్టీని మేము పుత్ర మిత్ర కళత్రాదులు చుట్టపక్కాలు సహా వీరకంకణము కట్టుకొని సిద్ధమై వున్నాము; అయినందున యీ వర్తమానము యావత్తు ధణీలతో మనవిచేసి, యేమి సెలవు అవుతున్నదో ఆప్రకారం మాకు అభయ మిస్తే, దర్శనానకు వస్తున్నాము అని చెప్పినందున, ఆ కేశవరాయనివారు దండులోకి పోయి బలవంతరాయని వారితో యీ బసవప్పగారు ఆడిన ఖండిత వుత్తరాలు చెప్పగా విని, అక్కడవున్న పెద్దమనుష్యులను యోచన అడుగగా, వారు అధైర్యస్థులైనారు; అందువల్ల యిట్లా ఖండిత వుత్తరాలు ఆడుతున్నారు; యిక్కడనుంచి గొప్పసరదారుణ్ని పంపిస్తే అతనుపోయి కోటలోవున్న పిమ్మట, వారు వెలపటికి వచ్చి మీ భేటి చేసుకొందురు అని మామనస్సున తోస్తూవున్నది; యిందుమీద తమచిత్తప్రకారము నడుచుకొనేము అని మనవి చేసిరి.

9. అదేప్రకారం బలవంతరాయడు ఆ కేశవరాయని వెంబడి గొప్ప సరదారుణ్ని యిచ్చి యితణ్ని కోటలోవుంచి, ఆ బసవప్పగారిని తోడకరమ్మని సెలవు యిచ్చినందున, అదేప్రకారం ఆ కేశవరాయనివారు ఆ గొప్ప సరదారుణ్ని వెంటపెట్టుకొని కోట జీబి ముందరికి వచ్చి, అక్కడవున్న పెద్ద మనుష్యులతో యీ వర్తమానము చెప్పి పంపగా; వారు పోయి చెప్పి ఆ బసవప్పగారిని జీబి వెలపటికి పిలుచుక వచ్చినందున, వారికి వీరికి దర్శనం అయి, తమ ధణీ సెలవు యిచ్చిన వర్తమానము ఆ కేశవరాయడు చెప్పగా ఆ బసవప్పగారు సమ్మతించి, ఆ సరదారుణ్ని పిలుచుక పోయి కోటలో వుంచి; తాను నగరిలోకి పోయి, దొరవారితో, సామయాజకులతో, స్త్రీ జనముతో చెప్పి ఖిల్లా భద్రపరచి, తాను ప్రసిద్ధులయిన భటులను నన్నూరుమందిని తీసుకొని, కోటమీద నవుబతు వెయ్యమని చెప్పి బయలుదేరి వచ్చి, ఆ కేశవరాయనివారితో యింకా వక మనవి వున్నది అని చెప్పుకోగా, అది యేమి మనవి అని అతను అడుగగా, యీ స్వల్ప జనముతో దండులోకి వచ్చి దర్శనం చేసుకొనేదానికి నిర్వాహకం లేదు; పేటలో బసవేశ్వరుని దేవస్థానం దగ్గరికి బల

వంతరాయనివారు దయచేస్తే నేను వచ్చి దర్శనం చేసుకొనేను అని చెప్పి కొనెను.

10. ఆ ప్రకారమే కేశవరాయనివారు పోయి మనవిచేసి, బలవంత రాయని వారిని ఆ బసవేశ్వరుని దేవస్థానం దగ్గరికి వెంటపెట్టుక వచ్చి, బసవప్పగారికి చెప్పి పంపగా, ఆ బసవప్పనాయుడు తనవారితో కూడా పోయి, వారి దర్శనం చేసుకొని, తమ సుఖదుఃఖము యావత్తు మనవి చేసుకొని, ఖండిణి అరువైవేల రూపాయీలకు నిర్ణయం చేసుకొని. అప్పణ తీసుకొని వచ్చి చేరి; కోటలో వుంచివున్న ఆ గొప్ప సరదారుణ్ని తన వెంబడి దివాణంలోకి తోడకపోయి, మృష్టాన్న భోజనం చేయించి, వస్త్ర పాత్ర తాంబూలములనుయిచ్చి, తన పూర్వోత్తరము యావత్తు తెలియచేసి, సంస్థానం నిర్వాహకం చేయవలసిన భారం తమది అని చెప్పి అప్పణ యిచ్చి దండుకు అంపించగా, ఆ జమాదారుడు పోయి సలాం చేయగా, కోటలోని పూర్వోత్తరం యేలాగున వున్నది అని అడిగినందుకు; యీ సంస్థానికులు షాత్రవంతులు గాని ధనవంతులు కారు; బహు కుటుంబులు; తమదయకు పాత్రులు అని ముఖ్యమైన మాటలు మూడు మనవి చేసి, యిందుమీద తమచిత్తానుసారముగా నడుచుకొంటున్నాము అని చెప్పి అప్పణ తీసుకొని, తన డేరాకు పోయెను.

11. తర్వాత ఆ బసవప్పగారు, తాను బలవంతరాయని వద్దికి పోయినది, భేటి అయినది, రూకలు వొప్పుకొన్నది, యీవర్తమానం యావత్తు తమ దొర శిద్దరామప్పనాయుని వారితోనున్ను సామయాజకులతోనున్ను విశదముగా చెప్పి సెలవు పుచ్చుకొని, ఆ మర్నాడు ఆ బలవంతరాయని దండు జనం కోట చుట్టూ పేట చుట్టూ తిరిగి నట్టు అయితే గుండున వేయమని చాకీ పహారామీద వున్న మందికి సెలవు యివ్వగా; అదే లాగున కోట మీద వున్న వారు గుండున వేయగా; యీ వర్తమానం బలవంత రాయని వారు విని కేశవరాయణ్ని పిలిపించి, నిన్న రాత్రి అయిన సమాధానం విరిగినట్టు కనుపడుతున్నది, గనక నీవు కోటకు పోయి తెలుసుకరమ్మని చెప్పగా; ఆ కేశవ రాయడు కోటముందరికి వచ్చి బసవప్పగారిని పిలిపించి, నిన్న సమాధానం అయివుండగా యీప్రొద్దు తిరుగా గుండు మొగర వలసిన పని యేమి అని అడుగగా, మీకు పైకం యిచ్చే దానికి మాకు గతి

లేదు; తిరిగీ మధ్యస్థం చేస్తే పౌరుషహాని; అయినందున మేము పుత్ర మిత్ర బంధు సహితముగా వీరస్వర్గమును కోరి తిరుగా గుండు యెగిరిస్తిమి అని బసవప్ప చెప్పెను.

12. అది విని, ఆ కేశవరాయడు పోయి యీ వర్తమానమును బలవంతరాయని వారితో మనవి చేస్తూ వుండగా, ముందు దినం కోటలోనుంచి పోయిన సరదారుడున్ను ఆ సమయమందు యీ బసవప్పగారి నిమిత్తం సహాయముగా చెప్పగా విని, నవ్వి ఆ బలవంతరాయనివారు కేశవరాయనితో పది వేల రూపాయీలు తీసివేసి, యాభై వేల రూపాయీలు నిష్కర్ష చేస్తిమి; అది చెల్లు వస్తే లేచిపోతున్నాము అని చెప్పి బసవప్పనాయునితో చెప్పుమనగా, అదే ప్రకారం ఆ కేశవరాయడు పోయి యాభై వేల రూపాయీలకు వుత్తరం చెప్పుమని అడుగగా, రేపటిదినం యిస్తున్నాము; మామీద దయచేయండి అని ధణీలతో మనవి చేయుమని చెప్పి పంపి, తమనగరిలో వున్న సొమ్ము సమ్మంధం యావత్తు అమ్మివేయగా నాలుగువేల రూపాయీలు ఆయెను. మరిన్ని మురారి రాయనివారి సుబేదారు బావాఖాన్, వారి అల్లుడైన మోదీం సాహేబుల వారు, యిక్కడనే కొలువులో వుండిరి గనక, పరపత్యం చేసే నిమిత్తం పెద్దమనుష్యుల గుండా వారిని పిలిపించి, సంస్థానం యెట్లాగయినా నిర్వాహకం చేయవలసిన భారం మీది అని చెప్పగా; అతను నా చేతను అయ్యే పనులకు తక్కువ లేదు అని చెప్పినందున, మాకు పదివేల రూపాయీలు దండుకు యిచ్చేదానికి ఋణం కావలెనని అడగగా, చింతయేమి; సంస్థానం వుంటే నాకు యియ్యనే యిచ్చేరు అని, సిద్దరామప్పనాయనివారి పేరపత్రం వ్రాయించి, బసవప్పగారి పుప్పితం వేయించుకొని, పదివేల రూపాయీలు జాగ్రత చేసి యిచ్చెను.

13. ఆ మరునాడు కేశవరాయడు వచ్చి బసవప్పగారిని రూకలకు యేమి చెప్పుతారని అడుగగా, ప్రకృతంలో ౧౪ వేల రూపాయీలు యిస్తున్నాను; కొదువ ముప్పది ఆరువేల రూపాయీలకు మా కొత్త చెరువు కుదువ యిస్తున్నాము; మీ బాకీ తీరిన వెనక గ్రామం విడిచేలాగున మనవి చేసి సరసుపెట్టుము అని చెప్పినందున, ఆ కేశవరాయడు దండుకు పోయి, యీ వర్తమానం తమ బలవంతరాయనివారితో మనవి చేయగా, అందుకు సమ్మతించినందున, తిరుగా వచ్చి యీ ౧౪ వేల రూపాయీల నగ

దున్ను గ్రామమున్ను తీసుకొని, యీ బసవప్పగారిని రెండు కోసుల పర్యంతరం కూడా తోడకపోయి, పూర్వ మర్యాద ప్రకారం శిర్పావు [అనగా ఒక వరుస వస్త్రములున్ను] అశ్వం సహా యిచ్చి, మాన బహుమాన యుక్తంగా కోటకు పొమ్మని అప్పణ యిచ్చిరి. పిమ్మట యీ బసవప్పగారు సకల బహు మానయుక్తంగా కోటచేరి, తమ దొర శిద్ధరామప్పనాయుని వారి ముందర యీ బహుమతులను వుంచగా వారు మిక్కిలి సంతోషించిరి ఆ మరునాడు దండు లేచి పార్లపల్లె మార్గాన సాగిపోయెను.

14. తదనంతరం యీ పాడు అయిన యావత్తు రాజ్యమునకు, బసవప్పనాయుడు కౌలు యిచ్చి సాగు బడి విస్తారం చేయించి, కార్తీక ఫలం రూకలు రాబట్టుకొని బావాఖాన్ వారి ముఖాంతరంగా బాకీ ౩౮ వేల రూపాయీలున్ను బలవంతరాయనివారికి అంపించగా అతను కొత్తచెరువులో వున్న తమ జనాన్ని పిలిపించుకొనెను, తర్వాత బసవప్పనాయుడు ఆ గ్రామం బాగుపరచి రాజ్యం యావత్తు విచారించుకొంటూ వున్న సమయమందు; మునుపు తాను బళ్లారినుంచి వేములకు పోతూ మార్గములో పాముదుర్తి దగ్గర దిగి, గడ్డి, కట్టెలు, కుండలు, చిల్లర సామాను నిమిత్తం, తాడిపత్రి తాలూకు మెల్లుట్ల అధికారి అయిన యోగానందం ఆ గ్రామంలో వుండగా, అతనికి చెప్పి పంపితే తాత్సారం చేసి, యీ సామానులు యిక్కడ చిక్కదు అని పోయిన మనుష్యులను వూరకనే పంపించి వుండెను గనక, అది మనస్సుననే వుంచి, రాత్రి రాత్రే స్వారి వెళ్లి, అనంతపురానకు పది కోసుల మీద వున్న మెల్లుట్లకు బహు త్వరగా పోయి, తెల్లవార ఝామున పేటలో శ్రీ హనుమంతరాయని దేవళములో దిగి, అక్కడ వున్న యోగానందాన్నిన్ని పశువులనున్ను కాపులను పట్టుకొని, ఆ గ్రామం దోచుకొని మార్గాన వస్తూ వుండెను.

15. ఈ వర్తమానం తాడిపత్రి రామప్పనాయుడు విని, తమ గుర్రాన్ని మందిని తీసుకొని దోవకు అడ్డంవచ్చి తగలగా, వారికి వీరికి యుద్ధము అయి, తాడిపత్రివారి ఫౌజు విరిగినందున తాము అనంతపురం చేరి ఆ పశువులను విక్రయించి, కాపుల వద్ద దండుగలు పుచ్చుకొని, యోగానందాన్ని కోటలో భద్రం చేసి, నాలుగువేల రూపాయీలు అపరాధం పుచ్చుకొని, అతనికి వస్త్రతాంబూలములు యిచ్చి తిరుగా తాడిపత్రికి పం

ఖంచెను. మరిన్ని యీ బసవప్పగారు, మునుపు హిరేహాళు ఆమీలు శివప్పగారివద్ద సెలవు తీసుకొని తమ రాజ్యానికి వచ్చేటప్పుడు, దోవలో మధ్యాహ్నవేళ నింబకల్లు బావి దగ్గిర దిగి, వంట చేసేదానికి శివభక్తులు మందట లేనందున, అన్నం నిమిత్తమై, హొసూరి దేశాయి ముద్దుమల్లప్పగారికిన్ని తమ పెద్దలకున్ను సెళవు గనక, వారికి ఆడు బిడ్డ అయిన నింబకల్లు యిమ్మడక్కకు చెప్పి పంపగా, ఆమె అవమానపు మాటలాడి పంపించి యుండినందున, కాల దేశ వర్తమానములచేత ఆ గ్రామం పెద్ద తలారి అలిగి, యీ అనంతపురానకు కొలువు నిమిత్తం వచ్చినందున, యిక్కడ వున్నవారు వాణ్ని బసవప్పగారి వద్దికి తోడకపోయి, ఆనవాలు వ్రాయించే వేళ, నీ పేరు యేమి? నీ గ్రామం యేది? అని అడుగగా, వాడు నా పేరు ఓబడు, నా వూరు నింబకల్లు, నేను ఆ వూరి పెద్ద తలారిని అని చెప్పుకొన్నందున; ఆ బసవప్ప నాయుడు ఆ యిమ్మడక్క ఆడిన అవమానపు మాటలను తలచుకొని, వీణ్ని చాకిరీ వుంచి సంబళం పాడిగించి, ప్రతి దినం వొకసారి తన దర్శనానకు వచ్చి పొమ్మని సెలవు యిచ్చెను.

16. అదే ప్రకారం ఆ తలారి కొలువులో వుండగా, వొక దినం ఆ వొబణ్ని యేకాంతముగా పిలిపించి, ఆ యిమ్మడక్క వర్తమానం యావత్తు విశదంగా వానికి చెప్పి, ఆ గ్రామం మా స్వాధీనం అయ్యేటట్టుచేస్తే, మేము బహుమానం యిస్తున్నాము అని బహుశా చెప్పినందున, వాడు రెండు మూడు వరసల ఆ గ్రామానికి పోయి, వారి స్థితి చూచి వచ్చి, వీరిని స్వారి ప్రయత్నముగా కూడేటికి వెంట పెట్టుకపోయి అక్కడ వొక దినం నిలిచి; గ్రామాల మందిని పిలిపించి జన స్తోమంచేసుకొని, అక్కడనుంచి రాత్రి అతి త్వరగా నింబకల్లుకు పోయి, గ్రామమంతా దోచి పశువులను కాపులను కొళ్ల తీసుకొని, ఆ యిమ్మడక్కను పట్టుకొని తిరుగా కూడేరు వచ్చి చేరి, ఆ కాపులకు దండుగలు కట్టి కొంత రూకలు రాబట్టుకొని, నిల్వ రూకలు మందికి తనఖా చేసి పశువులను గొర్రెలను విక్రయించి రూకలు రాబట్టుకొని, యిమ్మడక్కను తీసుకొని అనంతపురం వచ్చి చేరెను. యీ వర్తమానం హొసూరి దేశాయి కరిరామప్పగారు విని,

BIBLIOTHECA BODLEIANA

ఆ బసవప్పగారికి, పూర్వం పెద్దలమీది దృష్టి వుంచి యిమ్మడక్కను వుంపించవలెనని, కాగిదపత్రములు వ్రాసి అంతుతగిన పెద్దమనుష్యులను అంపించగా, ఆ బసవప్ప అవి చూచుకొని, ఆ యిమ్మడక్క వద్ద నాలుగు వేల రూపాయీలు రాబట్టుకొని, ఆమెకు తగిన వస్త్ర పాత్రాదులు యిచ్చి, ఆ తలారి వ్రాబనికిన్ని బహుమానం యిచ్చి, ఆమెను సమ్మతిచేసి ఆ వ్రాబణ్ణి కూడా వారి గ్రామానికి వుంపించెను.

17. అటు తర్వాత గుత్తి మురారిరాయనివారు మార్గవశాత్ వుప్పర్ల పల్లె మీద వెళ్లి పెనుగొండకు పోతూ యీ మధ్య వున్న గ్రామాలు దోచుకొని, బొమ్మవర్తివంక దండు దిగగా; యీ వర్తమానం బసవప్పగారు విని, తన వద్ద వున్న శిపాయీలను పిలవనంపించి, పదివేల రూపాయీల పంటలు పాడు చేసెను అని మీరు పోయి, వెనక దిక్కు పొయ్యే చిల్లర సైన్యమును దోచుకరమ్మని అంపించగా; వారు పోయి అదే మేరకు గుర్రం, ఒంటెలు, కవాడం యావత్తు దోచుకొని వచ్చి అనంతపురం చేరగా; యీ వర్తమానం మురారిరాయనివారు విని, తమ వకీలు అయినపరంగి తమ్మణ్ణను అంపించి, యీ నష్టమునకుగాను తమకు రాగల నాలుగో భాగంలో చెల్లు పెట్టుకొని, వీరు తెచ్చిన పశువులను ఒంటెలను గుర్రాలు మొదలయిన వాటిని విడిపించుక పోయెను. తదనంతరం బసవప్ప అనంతపురానకు పడమర కాలుగడియ దూరములో, కూడేటి మార్గమందు ఒక బావి తోవ్వించి, తమ అక్క అయిన నీలమ్మగారి పేరుపెట్టి, బిల్వచెట్లు మొదలయినవి వేయించి వనప్రతిష్ఠ చేసెను.

## CHAPTER SEVENTH.

1. ఈలాగున కొన్ని దినములు జరిగినమీదట బహదర్ నవాబు హైదర్ అల్లీఖాన్ వారితట్టునుంచి, మీర్ సైదుల్లాఖాన్ అనేవాడు గుర్రంకొండ తట్టు మోహింపోతూ, తాడిమర్రి మార్గాన యీ అనంతపురానకు వచ్చి, పడమటి దిక్కున అరకోసుమీద నడిమి వంకను దండు యావత్తు దిగినందున, అ గాడి పాజు వీరప్ప గుళ్లతట్టు దిగివుండగా, బసవప్ప

గారు కోటమీదినుంచి చూచి, దండు గ్రామానకు ముట్టడిగా దిగుతూవున్నదని ఫిరంగీల కాల్చమనగా, అదే ప్రకారం చేసినందున, ఆ ఫౌజులో అంగడి డేరాలు, కొంత జనం, నిశాని మొదలయినవి కొట్టుకొని పోయెను. యీ వర్తమానం మీర్ సైదుల్లాఖానుడు విని, బహు కోపం చేసి గ్రామానికి ముట్టడి దిగి, నాలుగు దినములు వారి పట్టున వారు వీరిపట్టున వీరు వుండగా, ఆ దండులోనుంచి ఆమీర్ సైదుల్లాఖానుడు పేష్కస్తి రూకలు యిస్తే దండు లేచి పోతాము అని వకీలుతో బసవప్పగారికి చెప్పి అంపించినందున, ఆ వకీలు వచ్చి బసవప్పగారితో చెప్పగా, తన తట్టునుంచి వకీలు మురారప్పగారి రంగప్పనున్న బోలేఖాన్ వారిని పంపించి, సవాలు జవాబు చేసి ముప్పది వేల రూపాయీలకు ఖండిణి చుకాయించుకొని, ఆ రూకలకు తమ వకీళ్లను ఓలు యిచ్చెను. పిమ్మట దండు లేచి పోయెను మరి రెండు నెలలు జరిగిన మీదట రూకలు దండుకు అంపించి, తిరుగా తమ వకీళ్లు బోలేఖాన్ రంగప్పగార్లను అనంతపురానకు పిలిపించుకొనెను.

2. పిమ్మట తాడిమర్రివారు పూర్వం తమ పూరైన యెల్లుట్లను దోచుకొని, గోగానందాన్ని కట్టుకొని, పోయిన దుఃఖం మనస్సున వుంచి, అనంతపురంవారి రాజ్యం మీద యుద్ధం చేసి కొళ్ల తీసుకొని పోయినందున, యీ బసవప్పగారు వారి రాజ్యంమీద యుద్ధంచేసి కొళ్లతీసుకొన్నందున, నందెమ్మ సాకిన తాడిమర్రి రామప్పనాయుడు కోపించి, సైన్యయుక్తముగా పసులూరి దగ్గెర వచ్చి దిగి, వుప్పర్లపల్లెమీద దౌర్జన్యం చేసే నిమిత్తమై, పసులూరి మంది సహితంగా పొలిమేర బావి దగ్గరకి వచ్చి నిలిచి, చిల్లర రౌతులు పసుల గొర్ల నిమిత్తం తిరుగుతూ వుండగా; ఆ వుప్పర్లపల్లె వారు యీ వర్తమానము తమ బసవప్పగారికి వ్రాయించి అంపించినందున, అతను తన మంది గుర్రం బారు బాణాలు స్వారీ ఫిరంగులు తీసుకొనివచ్చి, వుప్పర్లపల్లెకు ఆగ్నేయమందు గడియ దూరములోవున్న గిరియప్పతోపు దగ్గిరికి పోగా, వీరికి వారికి అఘోర యుద్ధము అయి,వుభయ సైన్యంలో డొక్కలగండి దగ్గెర బహు మంది హతులైనందున, తాడిమర్రివారి ఫౌజు విరిగి పసులూరి గ్రామం చేరెను. యీ బసవప్పగారు యుద్ధము చాలించి ధర్మధారకొమ్ము పట్టించి, యీ యుద్ధమందు పడిన తాడిమర్రివారియొక్క పీనుగలను వారు తీసుకపొయ్యేదానికి సెలవు యిచ్చి,

తాము వుప్పర్లపల్లెదగ్గర వున్న మామిడితోపులో నాలుగు గడియలు విశ్రమించి, వారు పసులూరినుంచి ఆవల తాడిమర్రికి తర్లి పోయిన సమాచారం విని, సైన్య సహితముగా తాను వచ్చి అనంతపురం చేరెను. వీరికి వారికి యీలాగున బద్ధద్వేషం కలిగివుండెను.

3. ఇట్లావుండగా, ఆ తాడిమర్రి సంస్థానానికి వేపలి వెంకటపతినాయుడు వచ్చిచేరి, ఆ రామప్పనాయునివారికి దుర్బోధన చేసి, కొన్ని దుర్మార్గపు పనులు నేర్పినందున; మైమీద స్మారకం లేక తాగుబోతై, ఆ గ్రామములో చెడుపనులు చేస్తూ వున్నందున, యీ వర్తమానం బసవప్పగారు విని, సంస్థానం అవివేకంకింద వచ్చెను; తాణా వేయవలెనని తమ దగ్గర వున్న సబునివీసు సుబ్బరాయనివారు, దళవాయి రుద్రప్పగారు, వీరిద్దరికి స్వాధీనముగా కొంత ఫౌజు, స్వారిఫిరంగీలు యిచ్చి సిద్ధం చేసివుంచి వుండగా, యింతకు ముందు తాడిమర్రి కోటకు మర్మము తెలిసే నిమిత్తం అంపించివున్న, నందసముద్రం ముసలయ్య, గొరిసె యెర్రగురవడు, వీరిద్దరు అక్కడి మర్మం తెలుసుకొని వచ్చి, నేటి దినం కోటలో చౌకీ పహరా భద్రం లేదు; రాణువ జనం యావత్తు పేటలో వుండి రాత్రి వేట ఆడే నిమిత్తం అడివికి పోయి వున్నది అని చెప్పగా విని, వారి యిద్దరిని ఆ ఫౌజుదార్ల వెంబడి యిచ్చి, యీ దళవాయి రుద్రప్ప, సబునివీసు సుబ్బరాయడు, వీరు యిద్దరు చెప్పిన ప్రకారం విని కోట తాణావేసి, మాకు చెప్పి అంపించమని త్వరగా ఫౌజును ముందు సాగనంపించెను.

4. పిమ్మట తెల్లవారిన వెనక యీ బసవప్పగారున్ను తర్లి పోచూవుండగా ముందు పంపించిన ఆ ఫౌజు వెలపర్ల వెంబడిన పోయి, నిచ్చనలు వేసి కోట దిగబడి, అలంగం మీద చౌకీ పహరా వుండక అజాగ్రత అయి, దోపు ఆశ చేత కోటలో వున్న యిండ్లను చుట్టుకొని దోచుకొంటూ వుండగా; ఆరె శ్యామంతరాయడు, తురక దీనాగాడు, వీరు మొదలయిన వూశిగపువాండ్లతోకూడా వుప్పరిగెలో రామప్పనాయుడు పడుకొని నిద్రపోతూ వుండగా, వారిలో ఒకడు అల్పాచమానానికి లేచి యీ కలకలాయమానం విని, నగరి వాకిటికి వచ్చి హండేవారు కోట తాణా వేసి, యిండ్లు చుట్టుకొని దోచుకొంటూ వున్నారు దిక్కు లేక పోయెను అని, కొందరు స్త్రీలు కోటలో వాడుకొంటూ వుండడము విని పోయి, తమ ధణీ

అయిన రామప్పనాయుణ్ణిన్ని, అక్కడ వున్నవారినిన్ని లేపిచెప్పగా వారు ఆయుధముసైదులతో నగరి వాకిలి తీసుకొని వచ్చి, ఆ నగరు చుట్టుకొనేదానికి వచ్చిన మందిని విరగకొట్టి, యుద్ధముచేస్తూ పూరివాకిలి దనుకా వచ్చిరి. యింతలో యీ కలకలాయమానమును పేటలోవున్న స్థలంమందిన్ని విని, మోసం వచ్చెను అని తమతమ ఆయుధముసైదులతో కోట చుట్టూ వెళ్లపారగా, అనంతపురంవారు కోటయెక్కి దిగిన నిచ్చెనలు ఖాలీగా వున్నందున, ఆ నిచ్చెనలగుండా కోటయెక్కి అలంగం బురుజులు చౌకీపహారా బందోబస్తు చేసి, కోటలో వున్న అనంతపురంమందిని చుట్టుకొనిరి.

5. ఈ కోటవెలపట, పౌజుతో వున్న రుద్రప్ప, సుబ్బరాయనివారు వెలిపేటకు పౌజుతోవస్తూ, కోటమీద గుండ్లు యెగిరినది చూచి, మోసమాయెను, కోటలో మనమంది చిక్కెను అని యోచిస్తూవుండగా, కోటలో చిక్కిన అనంతపురంమందికిన్ని స్థలంమందికిన్ని యుద్ధము అయి యీ అనంతపురంవారి సంబంధం బహు జనులు హతులైనందున, తక్కినవారు ఆయుధములను విడిచిపెట్టి కోట దుమికివచ్చి, యీ పౌజులోవున్న రుద్రప్ప సుబ్బరాయనివారితో చెప్పగా, వారువిని చింతిస్తూ వుండిరి యిట్లా వుండగా యీ స్థలంమంది ధణీతో కూడా కోటవూరువాకిలి తీసుకొని, తమ సైన్యం మీదికి వచ్చేది చూచి, తప్పెను అని రుద్రప్ప, సుబ్బరాయనివారు సైన్యముతో కూడా వెనక్కు తిరిగి వస్తూవుండగా, చియేడుదుర్గం ఆవల ఏకపాదం పల్లెదగ్గర యెదురుగా వస్తూవున్న బసవప్పనాయునితో యీ వర్తమానం చెప్పగా, అతను విని చెయిచిక్కిన కిల్లా వ్యర్థమాయెను అని, యీ సరదారుల మీద మిక్కిలి కోపంచేసి, ఆ వచ్చిన పౌజుతోకూడా వెనక్కు తిరిగి అనంతపురంచేరెను.

6. అది మొదలుకొని వీరికి వారికి నిత్యకలహం అపుతూ వుండగా, ఒకదినం తాడిమర్రి రామప్పనాయుడు రాప్తాడు కొట్టవలెనని, పట్టపగలు సైన్యయుక్తంగా స్వారివెళ్లి, వుప్పర్లపల్లె మామిడి తోపు ఆవల పసులూరి పొలిమేరను వున్న బావి ఆదరవు చేసుకొని నిలిచి వుండగా; యీ వర్తమానం వుప్పర్లపల్లె వారు బసవప్పగారికి చెప్పిపంపగా, అదివిని తమ సైన్యసమేతముగా స్వారితోపును తీసుకొని రాప్తాటికి పోతూవుండగా, వుప్పర్ల

పల్లె మామిడి తోపులోనుంచి వారు అడ్డం వచ్చి తగలగా, యీ ఫౌజుకు ఆ ఫౌజుకు బహుయుద్ధము అయి తాడిమఱ్ఱివారిలో బహు మంది హతులైనందున, వారు నిర్వాహకం చేయలేక స్వారి ఫిరంగీలు ౨, సామాను బెంకెలు ౨, నగారా బెంకె ౧, నిశాని ఖాసా కోతల గుఱ్ఱాలు మొదలైన సొత్తు కొంత విడిచిపెట్టి పూలకుంట చేరిరి. యీ బసవప్పగారు ధర్మదార అనే కొమ్ము పట్టించి, వారి పీనుగల వారు తీసుకపొయ్యేదానికి సెలవు యిచ్చి, యీ చిక్కిన సామాను యావత్తు తీసుకొని, ఉప్పర్లపల్లె మామిడి తోపులోకి వచ్చి అక్కడ బడలిక తీర్చుకొని, ఆ రామప్పనాయుడు తాడిమఱ్ఱికి లేచిపోయిన వర్తమానమును తెప్పించుకొని, తాను సైన్యసమేతముగా అనంతపురం వచ్చి చేరెను.

7. తర్వాత ఆరు నెలలు జరిగిన మీదట యీ బసవప్పగారు, అనంతపురానకు ౧౨ కోసులమీద వున్న తాడిపత్రిపేట బహు బస్తి అయివున్నది, ఆ గ్రామం ఆమీలు రంగు గోవిందరాయనివారు వర్తకంచేసి మురారిరాయనివారికి వడ్డికి యిచ్చినందున, అతనికి తాడిపత్రి వుద్యోగం వచ్చినది అని బహుమందిచేత విని, ఆ గ్రామం దోచుకోవలెనని రెండు యేండ్లు మనస్సున వుంచి సమయం చూచి, మాఘ బ౩౦ లు రథోత్సవమైన మరునాడు మందితోకూడా దబ్బున పోయి, ఆ గ్రామానకు నాలుగు దిక్కుల చౌకీ పహారా పెట్టి, పేట దోచమని కొంత ఫౌజును యిచ్చి సేనాధిపతిని పేటలోకి పంపించి, మరి కొంత మందితో కోట చుట్టుకొని నిచ్చెనలగుండా దిగి, రంగు గోవిందుగారి యింటి నాలుగు దిక్కుల కావలి పెట్టి, ఆ యింటి దగ్గిర స్థలం తహశ్శీల్దార్లు పదిమంది వుండగా, వారిని పట్టి భద్రంచేసి, యిల్లు చొచ్చి ఆ రంగు గోవిందునున్ను, అతని చిన్నా చిరతలనున్ను, బావమరిది చౌడప్పనాయకున్నున్ను, పట్టుకొని కావలిలో వుంచి యిల్లు శోధించి, వెండి, బంగారు, కొంత నగదు, మంచి మంచి కొన్ని జట్టాపాతలు, చెంబు తపేల, సేద్యం యెద్దులు సహా తమ వశం చేసుకొని, ఆ గ్రామంలో మూడు దినములు నిలిచి, వర్తకులు బ్రాహ్మణులు, నేసేవాండ్లు మొదలయిన వారి వారికి తగిన ప్రకారం రూకలు నియమించి రాబట్టుకొని, గ్రామంలో ప్రస్తుతమందు చిక్కిన నగదు వెండి, బంగారు, పసు

ఫులు, గొర్లు సహా తోలించుకొని అనంతపురానికి వచ్చే సమయమందు; తాడిపత్రికి చుట్టూ వున్న గ్రామాలవాండ్లు గుత్తిమురారిరాయనికి కాగిదపు త్రాలు వ్రాయించి పంపించిరి.

8. అవి ఆ మురారిరాయనివారు చూచుకొని చెన్నంపల్లె దగ్గిర కోటకట్టిస్తూవున్న సాతేఖానుణ్ని పిలిపించి, అతనితో యీ యావద్వర్తమానం తెలియచేసి, నీవు కొంత ఫౌజును తీసుకొని మార్గానకు అడ్డం తగిలి, ఆ బసవప్పనాయుని ఫౌజును విరగకొట్టి, ఆ రంగు గోవిందు మొదలయిన జనాలను విడిపించుక రమ్మని సెలవు యిచ్చినందున, అదేప్రకారం ఆ సాతేఖానుడు సైన్యసమేతుడై, యెక్కలూరి మార్గాన వచ్చి విచారించగా; బసవప్పగారు తాడిపత్రిపేట అంతా కొల్లపెట్టుకొని, వెంకటపల్లె కనమగుండా నడిమిదొడ్డి మార్గాన పోయి, యీ దినం మధ్యాహ్నం అనంతపురం చేరెను అనే వర్తమానం విని, వెనక్కు తిరిగి తన ఫౌజుతో కూడా గుత్తి చేరెను. ఆ బసవప్పగారు రంగు గోవిందును అనంతపురానకు తీసుక వచ్చి కావలి పెట్టి, నాయడి పన్నెండు వేల వరహాలు దండగ తీసుకొని, అతనికి వస్త్రపాత్రాదులు బహుమతి యిచ్చి పంపించెను. మరిన్ని, కొన్నిదినములకు పాముడికి దండు తీసుకొని పోయి కోనంపేట దోచుకవచ్చి చేరెను.

9. తర్వాత రెండు నెలలు జరిగిన పిమ్మట అనంతపురానకు పదియారు కోసులమీద ధారామార్గంలో, రొద్దము అనే గ్రామం గొప్పగా వున్నది అని మర్మం తెప్పించుకొని, తక్షణం తన మందితోకూడా అక్కడికి పోతూ వుండగా; మధ్యే అప్పాజిపల్లె గొరంపల్లె దగ్గిర తెల్లవారవచ్చెను. గనక ఆ రెండు గ్రామాలు దోచుకొని, మధ్యే మార్గంలో దిగివున్న బెల్లంబిడారులు సహా దోచుకొని, ఆ కాపులను పట్టుకొని, తమ మందిని వెంటయిచ్చి బుక్కపట్నానికి సాగించి, తాను దండుతోకూడా పుట్టపర్తికి ముట్టడిదిగి, సుబ్బరాయణ్ని గుబ్బలహనుమప్పను సేనాపతులనుగా నియమించి అక్కడవుంచి, తాను తెప్పున అనంతపురం వచ్చి చేరెను. తర్వాత పదిహేనుదినములకు అకాలవర్షం వర్షించి, నది ప్రవహించగా, ఆ సైన్యం ముట్టడివిడిచి బుక్కపట్నం వచ్చి చేరి, యావద్వర్తమానం అనంతపురానకు వ్రాయించి పంపించగా; అది చూచి బసవప్పగారు అక్కడపని

యేమి? లేచిరమ్మని మారుత్తరం అంపించిన అప్పణ ప్రకారం, ఆ దండు యావత్తు తర్లివచ్చి అనంతపురం చేరెను.

10. ఆ పిమ్మట నాలుగు నెలలకు శాలి-శకం ౧౬౯౩ [A. D. 1771] అగునేటి ఖరనామసంవత్సరం భాద్రపద బ౧౪ నాడు, చిత్రావతీనది మీద అద్భుత వర్షం వర్షించి, గుడి బండ మొదలయిన చెరువులు తెగి మితిమీరి పైనీళ్లురాగా, బుక్కపట్నం చెరువు నిండి రెండుమరవలు పట్టక కట్టమీద నీళ్లు పార్లి, ముసలయ్య ఫూటతూముకు మన్నువేయక యేమారి వుండగా, ఆ బొర్రెలో నీళ్లు దూరి నల్లగుట్టవద్ద హెచ్చు తగ్గుగా నూరుబారల భూమి తెగకోసుకొని కట్ట తెగిపోయెను. ఆ గ్రామస్థులు యీ వర్తమానం వ్రాయించి పంపించిన వుత్తరమును చూస్తూనే యీ బసవప్పగారు అనంతపురానకు రెండోకోటకట్టించి, గాదెలు చేయించి కందకం తోవ్విస్తూవున్న పని నిలిపి, అతిత్వరగా దేశాయి దేవణ్ణను తోడుకొని బుక్కపట్నం చేరి, శుభముహూర్తమందు ఆ తెగిన చెరువు కట్టకు పని యిచ్చి కట్టిస్తూవుండగా ముప్పాతికెపాలు ముగిసినది. యింతలో యీ బసవప్ప గారికి దేహం స్వస్థంలేనందున, పాలకీలో అనంతపురానకు వచ్చి చేరిన మరి కొన్ని దినములకు, అదే రోగం బలమై శకం ౧౬౯౩ అగునేటి ఖరనామ సంవత్సర మాఘ శు౫ [9th February A. D. 1772] నాడు కాలంచేసెను.

11. తదనంతరం శిద్దరామప్పనాయునివారు ఆ బుక్కపట్నం చెరువు ముగియ కట్టించి, సుబ్బరాయణ్ణి వద్ద పెట్టుకొని రాజ్యం చేస్తూవుండగా, పేష్వావాండ్లున్ను, శ్రీరంగపట్నంలో వున్న హైదరు నవాబువారున్ను, ఖండిణి రూకలను యిమ్మని రెండు దిక్కుల ధక్కా తగిలినందున, సంస్థానంలోవున్న నగదు వెండి బంగారం గుఱ్ఱాలు సహా విక్రయించి, పేష్వావారి రూకలు చెల్లించిరి. శ్రీరంగపట్నంనుంచి శకం ౧౬౯౭ అగునేటి మన్మథనామ సంవత్సర కార్తిక శు౬లు [30th October A. D. 1775] ఆదవాని సుబాదారు బసాలతు జంగువారు బళ్లారికి ముట్టడి వేసివుండగా, యీ వర్తమానం బహాదరు నవాబు సాహేబులవారు విని త్వరగా వచ్చి, ఆ బసాలతు జంగుమీద ముట్టడి పడినందున, దండు అల్లరి అయి సొత్తులన్ని విడిచి పారిపోయి ఆ దవాని చేరెను. యీ బహాదరు నబాబులవారు ఆ బళ్లా

రితాణా వేసుకొని, మురారిరాయనివారు గుత్తిలో వున్నారనే వర్తమానం విని, అక్కడినుంచి దండు తర్లి గుత్తికివచ్చి ముట్టడి దిగిన మరి రెండు మూడు నెలలకు గుత్తితాణా పడెను.

12. తదనంతరం, బహదరు అనంతపురం ఖండిణి బాకీ రూకలు వసూలు చేసేనిమిత్తం, జమాదార్ కన్నీరాం, హరకారా పుట్టయ్య, వీరిని యాభైగుఱ్ఱములతో యిక్కడ తయినాతి వుంచి, మురారిరాయణ్ని పట్టుకొని అనంతపురం మార్గాన సాగించి, తాను దండు సహితముగా కూడేటి మార్గాన చిత్రకంటితట్టు పోయి, యీ గుత్తి సుబా బాలాజీరాయనివారికి యిచ్చి, అనంతపురం సంస్థానంతట్టునుంచి ప్రతిసంవత్సరం నలభైవేల రూపాయీలు వసూలు చేయమని చెప్పి వుండిరిగనక, ఆదేప్రకారం వెనకముందు చెల్లిస్తూవచ్చినందున, సంస్థానం బీదగిలివచ్చెను. యిట్లావుండగా ఆ బాలాజీరాయడు కాలంచేసినందున, గుత్తిసీమ అధికారం సుబాదారు నరసప్పయ్యగారికి శాలివాహనశకం ౧౭౦౩ అగునేటి ప్లవనామసంవత్సర శ్రావణ శు ౩లు [23d July A. D. 1781] రోజున యిచ్చి అంపించెను.

13. అతను ఆ తాలూకా యావత్తు తాణావేసుకొని, విచారిస్తూ వుండగా, యీ అనంతపురం రూకల నిమిత్తం బంట్రౌతులను అంపించి, తొందరపెట్టి నిర్దాక్షిణ్యంచేత కోటవాకిళ్లు దివాణంవాకిళ్లు కట్టించి శానాకష్టపరచగా, యిచ్చేదానికి ద్రవ్యము లేకపోయినందున, ఆ సుబేదారు నరసప్పయ్యగారు రాజ్యంమీద రూకలు చెదిరిపోకుండా, యీ సిద్ధరామప్పనాయనివారిని కూర్చుండపెట్టుకొని, యావత్తు నీవు విచారించి అందులవర్తమానం వ్రాయించిఅంపించమని, తమ తాలూకు ముత్సద్ది బెట్టదరాయనికి సెలవు యిచ్చి అంపించగా; అతనువచ్చి యిక్కడివర్తమానం యావత్తు విచారించి, రాజ్యం మీద రూకలున్నా బొక్కసంలో అయివజున్నూ లేదు అని వ్రాయించి పంపించినందున, ఆ వుత్తరములను చూస్తూనే ఆ నరసప్పయ్యగారు కొంత బలంతోవచ్చి దేశాయి తోపుదగ్గరదిగి, కోటలోనుంచి సిద్దరామప్పనాయునివారిని పిలిపించి, బేటీతీసుకొని పేటలో సబునవీసు తిమ్మణ్ణగారి యింట్లోదిగెను. దొరవారు అప్పణతీసుకొని దివాణంలోకిపోయిరి.

14. ఆ మర్నాడు సుబేదారు నరసప్పయ్యగారు కోటలోకి పోయి, మాబాకీ రూకలు పరిష్కారముగా యిస్తే నేము పోతున్నాము, రూకలకు యే

మిమార్గమని శిద్దరామప్పనాయునివారిని అడగగా; మాకురూకలు యిచ్చేదానికి లేదు; మీరాజ్యం మీరే విచారించుకోవలసినదని కోట బీగముద్రలు ఫెువ్పచెప్పినందున, ఆ నరసప్పయ్యగారు నీకు కలిగిన అయిజు యిచ్చినట్టు అయితే మేము గుత్తికిపోతున్నాము; ముందర కాలదేశవర్తమానం యేరీతున నడుస్తూవున్నదో, తదనుసారం నడవవలసినదానికి యిప్పుడే స్థలం ఫెువ్పచెప్పేది బాగులేదు అని చెప్పగా వినక, సర్వదా నాచేత నిర్వాహకం లేదుఅని ఫెువ్పచెప్పినందున కోట తాణా బందోబస్తు చేసి సేఖుమీరా అనేవాణ్ని ఖిల్లాదారుగా నేమకంచేసి, బెట్టదరాయలవారికి అములు యిచ్చి, యీ శిద్దరామప్పనాయునివారికి గ్రాసానకు సుంకంమీద దినం ౧కి నాయడిహొను ౧ ప్రకారం యిచ్చేలాగున నియమించి, చెరువుకింద వీరుచేస్తూవున్న కమతం మళ్లీయావత్తు నడిచేటట్టుగా బెట్టదరాయనివారికి చెప్పెను.

15. ఈ శిద్దరామప్పనాయుని వారికొమారుడైన పెదరామప్పనాయుని వారినిన్ని, కొంతమందిని దండులో కొలువుచేసేనిమిత్తం నేమకంచేసి, మూడవకొమారుడైన శిద్దప్పనాయుణ్ని శ్రీరంగపట్నం పంపించి, యీ దొరవారు దివాణం విడిచి వెలపటికి పోకుండా వుండేలాగున కావలి జనాలను వుంచి, తానుగుత్తికి పోయెను. యింతకులోగడనే, బహాదరు నవాబు దండుకుపోయివున్న చిన్న రామప్పనాయుడున్ను, పెదరామప్పనాయుడున్ను, యుద్ధరంగములో కాలంచేసిరి. మరికొన్ని దినములకు నరసప్పయ్యగారి సుబాపోయి, టీపుసుల్తాన్ వారు యీ గుత్తి సుబాకు శిస్తియర్ ఖాన్ సాహేబులనున్ను, యీ హండె అనంతపురానకు మహమ్మదు అమరపు సాహేబులనున్ను, కిల్లాకు హుశేన్ ఖాన్ ఖోజాగారినిన్ని నేమకం చేయగా, వారువచ్చి లోగడ నరసప్పయ్యగారు నెల ౧కి నియమించిన సుంకముమీది ౪౩౦న్ని, ఖాసా కమతమున్ను జప్తిచేసి, అములు జరిగిస్తూ వుండిరి.

16. మరికొన్ని దినములకు ఆ అములుదారులు బరతరపు అయి బదులు శ్రీరంగ పట్టంనుంచి కిల్లాకు న్యామత్తానుడు, అములుకు ఫత్తెసాహేబు, వీరుయిద్దరు వచ్చి అధికారం జరిగిస్తూవుండగా; యీ శిద్ద రామప్పనాయునివారికి ఖర్చు వెచ్చాలకుయిక్కట్టు అయి, దగ్గరవున్న వస్త్రపాత్రా

దులు మొదలయిన చిల్లర సామానులను విక్రయంచేసుక కాలక్షేపంచేస్తూవుండగా; దేహంరోగాక్రాంతమైనందుననున్ను, కొమాళ్లు అయిన పెదరామప్ప చినరామప్పగార్లు దండులో హతులైనారనే వర్తమానం విన్నందుననున్ను, సామీప్యమందువున్న చిన్నకుమారుడయిన శిద్దప్పనాయుడు శ్రీరంగపట్నం పోయినందువల్లనున్ను, పట్టపుభార్య కళ్యాణమ్మగారు కాలంచేసినందుననున్ను, అత్యంతదుఃఖమునుపొంది కృశించి, శాలివాహన శకవరుషంబులు ౧౭౧౦ అగునేటి కీలకనామసంవత్సర కార్తీక శు౧౫ నాడు [13th Nover. A. D. 1788.] కాలంచేసెను.

## CHAPTER EIGHT.

1. తదనంతరం యీన్యామత్ ఖాన్ ఫత్తెసాహేబులవారి అమల్లో, యీ శిద్దరామప్పనాయుని కొమాళ్లు, హనుమప్పనాయుడు ౧, బసవప్పనాయుడు ౧, పెద్దకొమారుడైన పెదరామప్పనాయుని కొమాళ్లు శిద్దరామప్ప ౧, వసంతరాయడు ౧న్ను అమ్మగారు మొదలయినవారు వుండగా, వారిని అందరిని చౌకీపహరా పెట్టివుంచుకవుండి, మరికొన్ని దినములు జరిగినపిమ్మట, కిల్లా న్యామత్ ఖానుడికి విడదల అయి, బదులు కిల్లాదారు మీరు ఖాశీం అనేవాడు వచ్చి చౌకీ పహరా యావత్తు బందోబస్తు చేసుకొని యుండగా, టీపుసుల్తాన్ వారిదగ్గెరనుంచి కిల్లాదారుణ్ని ఆమీలుదారుణ్ని సహా, బకరీదు పండుగకు నజరు తీసుకరమ్మని పరవానావచ్చినందున, యిక్కడ బదులు రెండవకిల్లాదారు సైదుహుశేను సాహేబునువుంచి, శిరస్తేదార్లు సహా తాము శ్రీరంగపట్నానకు పోయి, టీపువారి దర్శనంచేయగా, వారు యీ కిల్లాదారు మీరు ఖాశీంతో, అనంతపురములో ఠాణావున్న బెంగుళూరి తిమ్మానాయుని తాలూకు యిన్నూరుమంది బంట్రౌతులను, హజూరుకు పంపించమని లోగడ వ్రాయించిన పరవానా ప్రకారం, జరపకపోయినదేమి ? అనిఅడుగగా, అనంతపురంలో చౌకీపహరాలకు, బందీఖానాజనులకు, సంస్థానం జనులకు, బందోబస్తు చేసేనిమిత్తం అక్కడనేవుంచితిమి అని ఆ మీరుఖాశీం మనవి చేసెను.

2. అదివిని టీపువారు, యింకా సంస్థానీకుల జనం వున్నారా? అని అడుగగా; శిద్ద రామప్పనాయునివారి కొమాళ్లు యిద్దరు, మనమలు యిద్దరు, కొందరు అమ్మగార్లు, అల్లుడు, కొమాళ్లు, యీ మొదలయినవారు వున్నారని యీ కిల్లాదారు మీరు ఖాశీం చెప్పినందున; యావత్తువిని, ఆ టీపు సుల్తాన్ వారు నీవు అనంతపురానకు పోతూనే, పెద్దవాండ్లైన కొమాళ్లను, అల్లుడు కొమాళ్లను, గాలాన వేసి మిగిలిన జనులను హజూరు శ్రీరంగపట్నానకు అంపించమని హుకుం అయినందున, యీ మీరుఖాశీం సెలవు తీసుకొని అనంతపురానకువచ్చి, ఆ హుకుం ప్రకారం శిద్ద రామప్పనాయునివారి కొమాళ్లు హనుమప్ప; బసవప్ప; అల్లుడైనదాల్ ప్రభయ్య, యీ ముగ్గురిని గ్రామానకు వుత్తరభాగాన ఆరుకోసులమీద బుక్కరాయసముద్రానకు పొయ్యే మార్గానకు పడమర కాశీ విశ్వేశ్వరుని తోపులో, మొదటిచెట్టున గాలానికి వేయించెను. యింకా వారి సంబంధమైన జనాలు శాంతప్ప, దళవాయి హాల్ శరభప్ప, చిన్న సుబ్బరాయప్ప, యీ ముగ్గురిని నీలమ్మ తోపులో వొక మామిడి చెట్టున గాలానికి వేయించెను. వారి మనమలను యిద్దరిని, యింకా వారి సంబంధీకులయిన జనులను, అమ్మగారిని సహా, పహరావెంటయిచ్చి శ్రీరంగపట్నానకు పంపించినందున, యిక్కడి దివాణం పాడు అయినది.

3. అంతట టీపు సుల్తాన్ వారు శ్రీరంగపట్నంలో వున్న శిద్దప్పనాయునివారికి, నెల ౧కి కంఠేరాయివరహాలు అరువైచొప్పున సంబళం నేమకం చేసి యిస్తూ, రెండువేల కామాటీ జనం చేత పని జరిగించుమని ఆజ్ఞ యిచ్చి, అధికారం నేమకం చేసి దానికి తగిన జనులను యిచ్చి, మైసూరిలో చేరిన నజరతాబాదు కట్టించుతూవుండగా; యీ అనంతపురములో నడిచిన యావద్వర్తమానం ఆ శిద్దప్పనాయునివారు విని, తనకున్ను యేమి వుపద్రవం వచ్చునో అని భయంచేత చింతించుతూ వుండగా; యీ నజరతాబాదు కట్టే నిమిత్తమై అనంతపురంనుంచి వచ్చి వుండే వాండ్లల్లో, తనకు ఆప్తుడైన తిమ్మనబోయి తన కొమారునికి పెండ్లి చేయతలంచి, దారోగా వద్దికిపోయి, అతనితో యిక్కడ మాకు చుట్టాలు యెవరులేరు; గుత్తిశీమలో వున్న మావాడు పడుచును యిస్తున్నాము రమ్మని వ్రాసి పంపినారు.

గనక అప్పణ అయితే పోయి పెండ్లికార్యం నడిపించుకొని వస్తున్నామని చెప్పకోగా; ఆ దారోగా హజూరుకు పోయి యీ సంగతి యావత్తు మనవిచేసి, ఆ తిమ్మనబోయీకి ఖర్చులకు యిచ్చి, వాని సాలు సామానులతో కూడా పోవడానకు రహదారి యిచ్చి పంపించగా; తాను యీ రాజ్యానకు వచ్చినప్పుడు, ఆ శిద్దప్పనాయుడు నీవు రాజ్యానికి పొయ్యేటప్పుడు నన్నుకూడా తీసుకొని పోయి మా రాజ్యములో విడిచినట్టు అయితే, నీకు తగిన బహుమానం యిస్తున్నాను అనిచెప్పకోగా, సమ్మతించి మాటయిచ్చివుండెనుగనక, అదేప్రకారం ఆ తిమ్మనబోయి ఆ శిద్దప్పనాయుణ్ణి వెంట తీసుకొని చౌకీ పహరాలకు రహదారి చూపించి, సాలు సామాను బండ్లు సాగించుకొని, ఆమడ దూరము పోయి సూర్యోదయమైన పిమ్మట తమ మనిషిని వొకణ్ణి వెంటయిచ్చి రెండు భారీ ప్రయాణాలు మీ శక్తికంటే మించి పోవలసినదని చెప్పి పంపించగా, ఆ శిద్దప్పనాయునివారు ప్రాణాపేక్షచేత రాత్రి పగలు వొక చోటను అయినా నిలువక, దినం ౧కి అయిదు ఆమడ చొప్పన నాలుగు దినములు నడిచి, తమ రాజ్యానకు వచ్చి చేరెను: ఆ తిమ్మన బోయి మజిలీప్రకారం అక్కడక్కడ నిలుస్తూ వచ్చెను.

4. తర్వాత యీ శిద్దప్పనాయునివారు కాళహస్తి సీమలో పాపానాయునిపేట చేరి, అక్కడ నాలుగు దినములు ఆసోదా చేసుకొని, వక గుర్రాన్ని క్రయానకు తీసుకొని, పదిమందిని కొలువు నిలుపుకొని దొరతనానకు తగిన యోగ్యత చేసుకొని, అక్కడి నుంచి కాళహస్తికి పోయి వూరివెలపట దిగి, అచట వున్న దామర్ల తిమ్మానాయునివారికి, అనంతపురం పాండె శిద్దరామప్పనాయునివారి కొమారుడైన శిద్దప్పనాయునివారు, తమ దర్శననిమిత్తం వచ్చి వున్నారు అని కావలి వారితో సమాచారం చెప్పి పంపించగా; వారుపోయి యీ సంగతి తమ దొరవారితో మనవి చేయగా అది విని ఆ తిమ్మానాయునివారు పెద్దసంస్థానం యింటితనంవారు వచ్చినారు అని ప్రయాణం అయి యెదురుగా వచ్చి, బహుమానం చేసి తోడక పోయి విడిదిలో దించి, తాను సెలవు తీసుకొని నగరికి పోయి, కోటలోనుంచి కానుక పంపించి, మిక్కిలి పరామరిక చేస్తూ పది దినములు అక్కడ నిలుపుకొని, వస్త్ర పాత్ర తాంబూల పురస్సరముగా కుంకలగుంట అనే గ్రామమును వుమ్మళిగ యిచ్చి; ఆవల పాపానాయుని పేటకు అంపించిరి.

5. ఆ తిమ్మా నాయునివారు అక్కడ వున్న గురికానికి యీ దొరవారు మన వారైనందున వీరిమీద బహు కరామరిక వుంచి, వీరు కట్టించుకొనే గృహానికి యేమి సామాను అడుగుతున్నారో అది యిప్పించి, బహు జాగ్రతగా వుండవలసినదని తన పేర తాఖీదు పంపినందున; అదే ప్రకారం ఆ గురికాడు నడుచు కొన్నందున; యీ శిద్దప్పనాయునివారు అక్కడ యిల్లు వేయించుకొని, ఆ వుమ్మళిగ యిచ్చిన గ్రామమును ఆబాదు చేసుకొని, స్వంత కమతమును పెట్టించి అయిదు ఆరు సంవత్సరములు అక్కడనే వుండగా లోగడ శ్రీరంగ పట్నములో వుండే సుల్తాన్, యీ అనంతపురాన్నుంచి పట్టుకపోయి కయిదులో వుంచిన శిద్ద రామప్పనాయునివారి చిన్నా చిరతల గణతి తీసుకొని, తగిన ప్రకారం ఖర్చులకు ఆరు సంవత్సరముల వరకు యిస్తూ వుండిరి తర్వాత శా-శకం ౧౭౧౨ అగునేటి సాధారణ సంవత్సర మాఘ మాస మందు [Febry. 1791, A. D.] ఫేష్వావారి తాలూకు హరపంతపటకె అనేవారి పౌజున్ను, నిజాంవారి తాలూకు పౌజున్ను, అనంతపురం మార్గముగా శ్రీరంగపట్నము పోయి ముత్తిగె వెయ్యవలెనని అల్లరి చేస్తూ వుండగా; చిల్లర పాళెగాండ్లు యావజ్జనం తమ తమ సంస్థానాలు బలకాయించుకొనే దానికి యిది సమయమని పోగా, చిక్కిన సంస్థానికుల తాలూకు జనం మందిని గూర్చుకొని హంగామా చేస్తూ వుండిరి;

6. ఇట్లావుండగా రామదుర్గం లాడగొండ బలిజ రుద్రప్ప అనేవాడు యిదే సమయమని తలంచి, పాలేరు వచ్చిచేరి ఆ గ్రామస్థులతో నేను అనంతపురం శిద్ద రామప్పనాయుని కుమారుణ్ని; ఆయన వుంచుకొన్న దానికి పుట్టినవాడను; మా చిన్నా చిరతలను పట్టుక పొయ్యే వేళ నేను తప్పించుకొని అక్కడక్కడ తిరిగి వచ్చి చేరితిని అని చెప్పుకొన్నందుననున్ను; పరంపరగా ఆ దొరలవద్ద వున్న మొగదల బసవప్ప కుమారుడయిన చెన్నప్ప ఆ రుద్రప్ప వద్ద చేరి, ఆ గ్రామస్థులకున్ను యింకా అడిగినవారికిన్ని యిది నిజమైన సంగతేను అని చెప్పినందుననున్ను; వారు అట్లా వుండినా వుండును అని నెంచి ఆయనకు ఆయుష్కర్మమున్ను స్నానమున్ను చేయించి, వస్త్రపాత్రాదులు తెప్పించి యిచ్చి చుట్టుపట్టున వున్న పల్లెల గ్రామస్తులను మందిని పిలిపించి, వారితో యీయన మన పూర్వం దొర కొమారుడైనం

దున, యీ గ్రామాలు యితని స్వాధీనము చేసినట్టు అయితే, యీ కష్ట కాలం కడతేరుదుము అని కొరకొళ్ల, కూడేరు, వాటికి చెల్లే వుక గ్రామాలు సహా తాణావేసి యిచ్చి, ఆ రుద్రప్పను దొరను గా నియమించి కూడేటిలో వుంచిరి. తదనంతరం, నాయక బావా అనే సరదారుడు వచ్చి రాయదుర్గం తాణా వేసెను: పూర్వం హావళిగ అనే గ్రామం కట్టించిన నరసింగరాయుని కొమారుడైన అశ్వద్ధరాయనివారు అతని వెంబడి వచ్చి యీ గ్రామం మా పెద్దలు కట్టించినది అని మనవిచేయగా, ఆ గ్రామం తాణా యిచ్చి ఆ అశ్వద్ధరాయనివారి స్వాధీనము చేసెను.

7. తదనంతరం యీ కూడేటిలో వున్న రుద్రప్పతో, అక్కడ వున్న దుష్ట చతుష్టయం మనము పూరికెవుంటే యెట్లా అనంతపురం రాజ్యం పూర్వభాగమందు గ్రామాలు శానా వున్నవి అవి యావత్తు తాణా వేయవలెనని చెప్పగా; ఆ రుద్రప్ప అదివిని మనవద్ద అర్థ సాహాయ్యమున్ను జన సాహాయ్యమున్ను లేదు; పూరికె పారియాడితె యేలాగున అయ్యీని అని చెప్పగా; ఆ దుష్ట జనులు యీ రుద్రప్పను వెంటబెట్టుకొని, హావళిగె అనే గ్రామానకు పోయి, అశ్వద్ధరాయని భేటి చేయించి, వారితో పూర్వం హిరేహాళు శివప్పగారు మా సంస్థానం నిల్పినారు; ఆయనను యిప్పుడున్ను దీపం పెట్టి స్మరిస్తూ వున్నాము; ఆలాటి సమయం వచ్చియున్నందున, మా దొర అయిన రుద్రప్పగారికి మీ తట్టునుంచి గుర్రం పౌజు సాహాయ్యం చేసి యిస్తే, మా దగ్గిర వున్న మందినిన్ని కూడా తీసుక పోయి, అనంతపురం రాజ్యం తాణా వేసి బందోబస్తు చేసుకొని, మీకు మాటవాసి తెస్తున్నాము అని చెప్పి, తాము తీసుక పోయిన వస్త్రపాత్రాదులు ఆ అశ్వద్ధరాయని వారికి నజరుపెట్టి, యీ కార్య నిర్వాహకమయితే కూడేరు, కొరుకొళ్ల తమకు వేసి యిస్తున్నాము అని ఆశ చెప్పిరి.

8. అది విని ఆ రాయనివారు నూరు గుర్రాన్ని కొంత మందు గుండు యిచ్చి, యీ రుద్రప్పకు వస్త్రపాత్రాదులు యిచ్చి అంపించగా; అక్కడ నుంచి తమ పౌజునున్ను ఆ గుర్రమున్ను సహా తీసుకవచ్చి, బుక్కపట్నం కొత్త చెరువు, వంటికొండ, మల్లెకొండ, మరూరు, ముక్తాపురం మొదల యిన స్థలాలు యావత్తు తాణా వేసి, అనంతపురం పేటకు దిగి ముట్టడి వేసి

వుండగా; యీ వర్తమానం శ్రీరంగపట్నములో వున్న టీపుసుల్తాన్ వారు విని, పాళెగాండ్లు హంగామిచేత తమ తమ గ్రామాలు బలకాయించుకోవలె ననే యోచన చేసినారని తలంచి, తన బయిదరు గుఱ్ఱాలకు సిరదార్లు అయిన గాజీఖాన్, మద్దూఖాన్, మీర్ మీరా, వీరిని అయిదు నూర్ల గుఱ్ఱం సహా కచ్చేరి బాబురాయని వెంబడి యిచ్చి, ఘారీగళ్లకు రస్తు వేసే నిమిత్తం రూకలు యిచ్చి సెలవు యిచ్చి అంపించగా; వారు గడి గడికి వచ్చి, ఆయా జాగాలకు తగిన రస్తు వేస్తూ, గుత్తికి పోవలెనని యీ అనంతపురం మార్గంగా వచ్చి, కోటలో వున్న వారికి చెప్పి అంపి, రాప్తాడునుంచి అనంతపురానకు పగలు రెండు ఝాములకు వచ్చి, అమ్మగారి చెరువు బయలున నిల్చి వుండిరి.

9. అప్పుడు ఆ కోటలో వుంన ఫౌజు వూరు వాకిలి తీసుకొని, యీ పేటలో వున్న రుద్రప్పగారి ఫౌజు మీద పడి లడాయిచేస్తూ వుండగా; యీ బయిదర్ గుఱ్ఱం ఫౌజు లేచి రాప్తాటి వాకిలికి, వుప్పర్లపల్లె వాకిలికి, అడ్డంగా వచ్చి నిలిచెను పేటలో ముట్టడి వేసి వున్న రుద్రప్పనాయని ఫౌజు, యిది చూచి అధైర్యపడి మోర్చాలు విడిచిపెట్టి పొయ్యేదానికి మార్గం లేక, బహుమంది హతులైనందున తక్కినవారు చెరువులో కొంచెము నీళ్లు వుండగా, ఆ నీళ్లలో పడి పోతూవుండగా చూచి, యీ కోటలోనుంచి వచ్చిన మందిన్ని, అడ్డకట్టుకొన్న బయిదర్ ఫౌజున్ను వారిని పట్టుకవచ్చి, ఖిల్లేదారు న్యామత్ ఖాన్, ఆమీల్ ఫత్తేమహమ్మదు, యీ వుభయులు బాజారు వెంబడి రణం విచారిస్తూ, యీ చెరువుకట్టకు పడమటి దిక్కున పోతురాజు బయలున వుప్పర్లపల్లెకు పొయ్యేమార్గం దగ్గెర నిలిచివుండగా; వారి యెదట వుంచినందున, వారు యీ చిక్కినవారికి యేమి శిక్ష చేయవలెనని యీ గాజీఖాన్, మద్దూఖానులవారిని అడుగగా, వారు కాళ్లు చేతులు ఖండించినట్టు అయితే బహు ప్రసిద్ధిగా వుండునని చెప్పినందున, న్యామత్ఖాన్, ఫత్తేసాహేబులవారు ఆదే ప్రకారం యీచిక్కిన జనులను కాళ్లు చేతులు తెగగొట్టించిరి. ఆ రుద్రప్ప కొంత జనంతో పారిపోయెను.

## CHAPTER NINE.

1. తర్వాత శ్రీరంగపట్నంవారు రాజీ చేసుకోగా, ఫేష్వావారి ఫౌజున్ను నిజాంవారి ఫౌజున్ను తమతమ జాగాల చేరెను తర్వాత యీ అనంతపురములో వున్న న్యామత్ ఖాన్, ఫత్తేసాహేబులవారు ఆ దేశం యావత్తు తాణా వేసి, రయితు రాజీచేసి విస్తారం సాగుబడి అయ్యేటట్టు చేసిరి. టీపుసుల్తాన్ వారు శాలివాహన శకం ౧౭౨౦అగునేటి కాళయుక్తి నామ సంవత్సర మాఘమాసము ఆఖైరు [A. D. 8th March 1799.] వరకు రాజ్యము విచారిస్తూ వుండిరి. యింగ్లీషు వారి ఫౌజు వచ్చి శ్రీరంగపట్నం ముట్టడివేసి వుండగా, హయిదరాబాదు తట్టునుంచి నిజామల్లిఖాన్ వారు యీ యింగ్లీషువారికి సహాయముగా, అమీర్ సాహేబు, రాజా రోషంరావు, మీర్ ఆలం, మొదలయినవారి వెంబడి కొంత ఫౌజు సాహాయ్యం చేసి అంపించగా వారున్ను వచ్చి కోట ముట్టడి వేసి రెండు నెలలు జరిగిన మీదట, యుద్ధరంగమందు టీపుసుల్తాన్ లడాయి చేసి హతుడైనందున, శకం ౧౭౨౧ అగునేటి సిద్ధార్థినామ సం॥ చైత్ర బ౩౦ దివి ౨ ఝాములకు [A. D. 4th May, 1799.] శ్రీరంగపట్నంలో కుంఫిణి వారి తాణా పడెను.

2. ఈ వర్తమానం చతుర్దిక్కుల ప్రసిద్ధి అయినందున, కాళహస్తి తాలూకు పాపానాయుని పేటలో వున్న హండే సిద్దప్ప నాయుడు విని, తమ స్వజనంతో వేమల పులి వెందల ఆ ప్రాంత్యాలకు వచ్చి, యెర్రగొర్ల శితన్న, పెదవెంకటపతి, మొదలయినవారితో మాట్లాడి, కొంత మందిని తీసుకొని అక్కడినుంచి బుక్కపట్నం, కొత్త చెరువు తట్టు వచ్చేవేళకు, ఆ గ్రామస్థులు యీ వర్తమానం విని, తమ దొర వచ్చెనని యెదురుగా పోయి వెంటపెట్టుక వచ్చి, కొత్తచెరువులో వున్న నిడుమామిడి స్వాములవారి మఠములో దించగా, యెనిమిది దినములు అక్కడవుండి, ఆ చుట్టు పట్టు గ్రామాల మందిని కొంత కూర్చుకొని స్తోమంతో వచ్చి రాప్తాడు చేరివుండగా యీ అనంతపురం కోటలో వున్న ఖిల్లాదారుడు, రిసాల్దారుడు, బేలుతంబురాలు, గోలందాజులు, వగైరా బారువాండ్లు సహావుండి శ్రీరంగ

పట్నానకు ముట్టడి దిగిన తాగాయతి తమకు మూడు నెలల సంబళం బాకీ వున్నది యిమ్మని, అవల్ ఖిల్లేదారు దుయ్యం ఖిల్లేదారు, యీ కందాచారం వుభయ శిరస్తేదారులయిన హనుమంతరాయడు, రామారాయడు అనేవారిని పహారాలో వుంచి నిర్దాక్షిణ్యముచేసి, నన్నూరు వరహాలమట్టుకు వసూలు చేయగా, ఆ వరహాలను సరబేలు బిరాంషిరీఫు యావత్తు మందికి పంచి పెట్టెను. పిమ్మట రాప్తాడు వచ్చి చేరిన యీ శిద్దప్పనాయునివారు, అనంతపురం చుట్టుపట్టు స్వారిచేస్తూ వుండగా, కోటమీది నుంచి తోపుఖానాలు కాల్చినందున వెనక్కు పారిపోయెను.

3. ఈ సమయంలో శ్రీరంగపట్నములోనుంచి చెరసాల విడదల అయి, యీ శిద్దప్పనాయుని అన్నకొమారుడు అయిన వసంతరాయడు, అమ్మగారు మొదలయిన జనముతో కూడా వచ్చి రాప్తాడు చేరగా; ఆ వసంతరాయనివారిని యీ శిద్దరామప్పనాయునివారు ఆలింగనము చేసుకొని, బహుశా పశ్చాత్తాపపడి ఆదరిస్తూ వుండగా; అనంతపురములోవున్న రిసాల్ దార్ల వగయిరా వారు పట్నంపోయి టిపూసుల్తాన్ వారు చచ్చిన సమాచారం తెప్పించుకొని, మాకు రెండు నెలల సంబళం బాకీ వున్నది; అదిన్ని ముందు మా నలుగురికి అన్నస్థితిన్ని చేసి యిచ్చినట్టు అయితే, గ్రామం తాణా యిస్తున్నాము అని, పెద్దమనుష్యుల ముఖాంతరంగా యీ రాప్తాటిలో వున్న శిద్దప్పనాయుని వారికి చెప్పి అంపించగా; విని వారి అభిప్రాయమును అంగీకరించి, బండమీది పల్లె సుబేదారు లాడఖాన్ ఖాలీసాహేబునున్ను నాగలింగప్పకొమారుడు అయిన కోటప్పనున్ను అనంతపురములోకి అంపించగా, వారు పోయి పేటలో బసవన్న దేవాలయం వద్ద కూర్చొని, కోటలోవున్న రిసాల్ దార్ల పెద్దమనుష్యులను పిలిపించి, వారితో మీరు కోట తాణా యిచ్చినట్టుగానే మీ రెండు నెలల సంబళం యిస్తున్నాము; మీ మందిని యావత్తు మాదగ్గర కొలువు నిలుపుతున్నాము; మీ నలుగిరికి అన్న స్థితులను చేసి యిస్తున్నాము అని బహు విధాలా కుదరచెప్పిరి.

4. అదివిని ఆ పెద్ద మనుష్యులు సమ్మతించి, వారు వీరు కలసి మాట్లాడుకొని, అదే మేరకు వారి తాంబూలం వీరు వీరి తాంబూలం వారు తీసుకొని, మీరు దొరవారిని కళ్యాణమ్మగారి బావిదగ్గరికి పిలిపించి, ఖిల్లాలోకి మాకు ఖబురు చెప్పి అంపితే, మేము తయారు అయి యీ బసవణ్ణ

కట్టదగ్గరికి వచ్చి, మీరు మేము యెదుర్కొని పోయి వారి భేటి చేసుకొని తోడకవచ్చి, కోట ఠాణా యిస్తున్నాము అని చెప్పి వారు కోటకు పోయిన పిమ్మట; యీ కోటప్పు లాడఖాన్ ఖాలీసాహేబులవారు యీ వర్తమానం దొరవారికి చెప్పి పంపగా, వారు విని బహుసంతోషపడి, మర్నాడు రాప్తాటి నుంచి తన జనంతోకూడా కళ్యాణమ్మగారి బావి దగ్గరికి వచ్చిరి యీ వర్తమానం కోటలోకి చెప్పి అంపగా, అక్కడనుంచి ఆ రిసాల్దార్లు కొంత బారుమంది పెద్దమనుష్యులు సహా బసవన్న కట్టదగ్గరికి వచ్చి, కోటప్పలాడఖాన్ ఖాలీ సాహేబులవారినిన్ని వెంటబెట్టుకొని, యెదుర్కొని పోయి ఆ శిద్దప్పనాయునివారికి బహుమాన సన్మానములు చేసి, వుభయ సేనలతో తోడకవచ్చి అనంతపురం ఖిల్లా బీగముద్రలు వగైరా వారివశం చేసి కోట ఠాణా యిచ్చిరి పిమ్మట యీ శిద్దప్పనాయుడు ఆకోట రెండో అలంగం అగడ్త మీద వున్న బతేరీలమీద సహా తన చౌకీ పహరా వుంచి, కోటలో వున్న రిసాల్దార్ల నలుగురికి వస్త్ర తాంబూలాలు యిచ్చి సెలవు యివ్వగా, వారు తమ తమ జాగాలకు పోయిరి.

5. తదనంతరం, యీ శిద్దప్పనాయుడు అదివరకు వివాహం లేదు గనక, శకం ౧౭౨౧ అగునేటి సిద్ధార్థినామ సంవత్సరం జ్యేష్ఠ బ౫లు [A. D. 22d June 1799] వివాహముహూర్తం నిశ్చయించి, సకల సాహాయ్యం చేసుకొని, తమ సంబంధులయిన జగ్గుల కూసప్ప కొమార్తె నీలమ్మగారిని వివాహమాయెను. పిమ్మట శ్రీరంగపట్నానకు కుమ్మకుగా పోయిన, నిజామల్లీఖాన్ తాలూకు ఆమీను సాహేబులవారున్ను, రాజా రోషం రాయలవారున్ను, సైన్య సమేతముగా గుర్రంకొండ మార్గాన గుత్తికి వచ్చి, ఠాణా వేసి బందోబస్తు చేసే నిమిత్తం అనంతపురం మార్గాన వచ్చి, యీ శిద్దప్పనాయునివారిని భేటికి పిలిపించి; వారితో మీ జాగా ఠాణా వేసి యిచ్చి, మేము యిచ్చిన అన్నం భోజనం చేసుకొని మీరు వుండేలాగున, మా ధణీ హుకుం అయినదని చెప్పి, అనంతపురం ఠాణా వేసుకొని, వారి చిన్నా చిరతలను బుక్కపట్నం దగ్గెర వున్న శిద్దరామపురమందు వుంచి, ఆ గ్రామం ఆయనకు వుమ్మళిగె యిచ్చి, నూటికి వరహాలు పది ప్రకారం యేర్పాటు చేసియిచ్చి, వెంకటాద్రిపంతులవారికి యీ అనంతపురం తాలూ

కా అములు యిచ్చి, ఆదవాని తాలూకా బ్రాహ్మడు వెనకప్ప అనేవానికి ఖిల్లా వొప్పగించి, ఫౌజు లేచిపోయెను.

6. తదనంతరం, మీర్ ఆలం తాలూకానుంచి నాగనాథ రాయనివారికి, యీ అనంతపురం తాలూకాకున్ను, మరి కొన్ని తాలూకాలకున్ను, అములు యిచ్చి అంపించగా; వారు యీ రాజ్యం విచారించుతూ, ఆ మీర్ సాహెబులవారు యీ శిద్దప్పనాయునివారికి నియమించిన ప్రకారమే, ఆ శిద్దరామపురమున్ను ౧౦౦కి ౧౦ వంతున్ను పది నెలల పరియంతం జరిపిస్తూవుండిరి. తదనంతరం కంపినీ తాలూకు కర్నల్ మంరో్ల్ సాహెబులవారు, కంపలి ఆ ప్రాంత్యాన్నుంచి అనంతపురం శీమ బందోబస్తు చేసే నిమిత్తం నరశింగరాయనివారిని పంపించగా, వారు శా - శకం ౧౭౨౨ రౌద్రినామ సంవత్సరం మార్గశిర శు ౬ లు [*i. e.* 22d November, 1800.] గ్రామంచేరి, యావద్రాజ్యం బందోబస్తు చేసి, యీ శిద్దప్ప నాయునివారికి నడిచే గ్రామమున్ను రుసుమున్ను జప్తిచేసిన నెలకు పిమ్మట, కర్నల్ సాహెబులవారి వల్ల, మద్దగిరి సీమ తిరుమలయ్య అముల్దారుగానున్ను శివరామయ్య శిరస్తాగానున్ను నియమింపబడి వచ్చి, యీ తాలూకా లెక్క పత్రాలు విచారిస్తూ వుండగా; కర్నల్ సాహెబులవారున్ను తాలూకాల జమాబంది వగైరా నిమిత్తం ధర్మవరం చేరి, యీ తాలూకా అములుదార్ల శిరస్తేదార్ల గ్రామస్థులను పిలిపించి జమాబంది చుకాయిస్తూ వుండగా; శిద్దరామపురములో వున్న హండే శిద్దప్ప నాయునివారు ధర్మవరానకు వచ్చి, కర్నల్ సాహెబుల వారి భేటీ తీసుకొని, తన పూర్వోత్తరం యావత్తు మనవి చేసుకొనెను.

7. ఆ మనివి కర్నల్ సాహెబులవారు చిత్తగించి, మా సువారి వెంబడి హండే అనంతపురానకు హాజరుగా రమ్మని అప్పణ యిచ్చినందున, అదే మేరకు వారి వెంబడి అనంతపురం చేరి, మంరో్ల్ సాహెబులవారి దర్శనము చేసుకోగా, మీ కైఫియ్యతు వ్రాసి పట్టీ తీసుకరమ్మని సెలవు యిచ్చినందున, అదేప్రకారం పాత కాపుల నలుగురిని కూర్చుండపెట్టి, వకీలు కొత్తచెరువు శీనప్ప, బాళప్ప, వామణ్ణగారి నరసప్ప, దేశాయి తిమ్మణ్ణ, వెంగన్న, వగైరావారు కూర్చుని పరంపర యావత్తు పూర్వోత్త

రం వ్రాయించి యిచ్చినందున, రాజశ్రీ మంద్రోలు సాహేబులవారు ఆదరించి, నెల ౧కి కంపేరాయి ౫౫ ౭౫ లు అన్నానకు సంబళం నిష్కర్ష చేసి, పూర్వం మొగలాయివారి తాలూకు ఆమిల్ సాహేబులవారు యిచ్చిన, జహగీరు బుక్కపట్నం దగ్గర వుండే శిద్దరామపురమున్ను దీనికి చెల్లే వుపగ్రామములున్ను, యివి గాక ప్రతి గ్రామాన వున్న రుసుమున్ను జప్తి చేసి, పూర్వం వ్రాసిన ప్రకారం నెలనెలకు సంబళం యిచ్చి రసీదు తీసుకొనేలాగున, ఖజానాకు సన్నదున్ను ఆమిల్ దారునికి పరవానా అయినందున, అదేప్రకారం సంబళం అనుభవించుకుంటూ, దగ్గరవున్న యావత్తు జనాలను సంరక్షణచేస్తూ వుండగా; యీయన భార్య నీలమ్మగారికి చెంగళమ్మ అనే కుమార్తె కలిగి సంవత్సరం శిశువు అయి వుండగా, శా-శకం ౧౭౨౩ దుర్మతినామ సం॥ ఆషాఢ బ ౫ లు [A. D. 30th July 1801.] యీ శిద్దప్పనాయుడు శిద్దరామపురములోనే కాలంచేసెను.

8. తదనంతరం యీ శిద్దప్పనాయునివారి అన్నకొమారుడైన వసంతరాయనివారు యిరువై సంవత్సరముల వయస్సుగలవాడైయుండి, కర్నల్ మంద్రోల్ సాహేబులవారు కడప మకాంమీద వుండగా; అచ్చటికిపోయి వారి దర్శనం చేసుకొని, యావద్వర్తమానం అర్జి చేసుకున్నందున చిత్తగించి, ఆ శిద్దప్పనాయుడు తన అన్న కొమారుడు వున్నట్టు చెప్పగా యెన్నడు వినలేదని సంశయించగా, అక్కడ ధర్మవరం దేశాయి నారణప్ప హజూరు మునిషిపనిలో వుండెగనక ఆయన ౧, అనంతపురం సుంకం మణియం సంజీవప్ప కొమారుడు పుల్లప్ప ౧, పరికిసుబ్బన్న కొమారుడు శేషయ్య ౧, వీరు తాలూకు మజుకూరు సుంకం యిజారా చేసే నిమిత్తం పోయి హజూరిలో వున్నప్పుడు, దివానులైన చంది వెంకట్రాయనివారు, రామచంద్రరాయనివారు, మునిషీలవగైరా వారు యావత్తు కచ్చేరిలో యీ పుల్లప్ప శేషప్పగారు అనంతపురం స్థలం వారని అడిగినందున, పూర్వం వ్రాసిన పారంపర్యసంతతి వాజ్మూలము యావత్తున్ను దాఖలా చెప్పి, పట్టపుదొర శిద్దరామప్పనాయునివారి కొమారుడైన పెద్ద రామప్పనాయునివారి కొమారుడు యీ వసంతరాయడు పట్టపుదొరనురేను; యిందుకు యేమైనా హెచ్చు తక్కువ వచ్చినట్టు అయితే, సర్కారువారు చేసిన శిక్షకు

హాజరుగా వుండగలవారము అని కంపినివారికి ముచ్చలికా వ్రాసియిచ్చిరి.

9. యిదిగాక మరా యీ తాలూకా ధర్మవరం దేశాయి నారణప్ప సహితంగా యిదేప్రకారం ముచ్చలికా వ్రాసి యిచ్చినందున, శిద్దప్పనాయునివారికి చేసిన సంబళం యీ వసంతరాయని పేరట నిష్కర్ష చేసి, ఖజానాకు సన్నదున్ను ఆమిల్ మాధవ రాయని వారికి దయ చేసిరి గనక, కర్నల్ సాహేబుల వారి అప్పణ తీసుకొని, శిద్ద రామపురానకు వచ్చిన మరికొన్ని దినములకు కర్నల్ సాహేబుల వారు అనంతపురానకు వచ్చినది విని, యీ వసంతరాయనివారు తిరుగా పోయి, తన పెండ్లి నిమిత్తం ఖర్చు వెచ్చాలకు పేషగీ అడగవలెనని తలంచి, స్వతహా హుజూరికి పోయి, అర్జీ చేసుకోగా, ఆ యర్జి ఖాతరుకు తెచ్చి నాలుగు నెలల సంబళం పేషగీ యిమ్మని ఖజానాకు మరవానా వ్రాయించి యిచ్చిరి.

10. తదనంతరం. యీవసంతరాయడు ఆ అయివజు తీసుకపోయి, పెండ్లి సాహాయ్యములు యావత్తున్ను చేసి, నిజాంపురం తాలూకు బాగవాడా అనేపరగణాలో సంకణహాళు అనే గ్రామంలో, వీరి పరంపర బాలదహనుమప్పనాయకుని తట్టునుంచి సంబంధం లెస్సగా విచారించి నబీగౌడు అనే ఆయన కొమార్తె ౯ సంవత్సరముల వయస్సుగల కల్యాణమ్మగారు ౧, నింబకల్లు గ్రామంలో వున్న కరిహుళి కొట్టూరప్ప కొమార్తె -౯- యేండ్లుగల వీరమ్మగారు ౧, యీ యిద్దరిని యేక కాలమందు వివాహమయిన మరిమూడు నెలలలోగా, శాలివాహన శక వరుషంబులు ౧౭౨౪ అగునేటి దుందుభినామ సంవత్సర జ్యేష్ఠ మాసములో, యీ వసంతరాయనివారు చనిపోయిరి.

తదనంతరం, శిద్దరామ పురములో వున్న అమ్మగారి జన వివరం.

11. శిద్దరామప్పనాయుని రెండో భార్య పొన్నమ్మగారి కొమారుడైన చినరామప్ప నాయుని భార్య చెన్నమ్మగారు యిప్పుడు కొరుకోడులో వున్నది. యీ వసంతరాయనికి ఆ బాల్యమందే మాతా పితృలు వియోగము అయినందుననున్ను; తనకు పుత్రులు లేనందుననున్ను; యీ చిన్నవాణ్ని వడి గట్టుకొని సాకి, కష్టనిష్టూరాలకు లోనై, బహుశా లాలన చేత శ్రీరంగపట్టం చెరలో సహా సంరక్షణచేసి, అతి వ్యామోహం చేత సాకుతూవుండగా, యీయనకు కాల ప్రమాణం తీరి, గతించి పోయినందున, బహు దుః

ఖాక్రాంతురాలై, రెండు నెలల పర్యంతరం యింట్లోనే వుండగా, యీ వున్న కొడువ అమ్మగార్లు, చక్రమ్మ ౧, నీలమ్మగారు ౧, బసవప్పనాయుని భార్య పెదచెన్నమ్మగారు ౧, చినచెన్నమ్మగారు ౧, యింకా పెద్దమనుష్యులైనవారు వకీలు శీనప్ప ౧, బాళప్ప ౧, రాఘవప్పగారి అప్పణ్ణ ౧, వామణ్ణగారి నరసప్ప ౧, వీరి గురుపుత్రులైన ముత్తైనపండె బసవలింగస్వాములవారు ౧, ఆలమూరి కరిబసవప్ప ౧, నబీరి పెద్దవీరప్ప ౧, వీరు మొదలయిన యావజ్జనము యీ పుత్రశోకముచేత వ్యథపడుతూ వున్న చెన్నమ్మగారిని చూచి, దైవాధీనంచేత కావలసిన పనులు అయినదానికి యెన్నిదినములు వ్యథపడినా తీరదు; చనిపోయినవారు పోనేపోయిరి; యికను ముందువున్నవారి క్షేమం విచారించవలసి వున్నది.

12. ఇదిగాక, ముప్పయి నలుబయి ఆమడనుంచి చిన్నపాపలను తీసుకవచ్చి వివాహంచేస్తిరే, వారి గతియేమి? యీ రెండు నెలల నుంచి దుఃఖాతురం చేత మీరు మూలపడి వుంటే, యీ సంస్థానం నడిపించి యావత్తు విచారించేవారు యెవరు? మీరు ధైర్యం తెచ్చుకొని, ముందు కాగలపనులు కానా వున్నవి; గనక, యీ వర్తమానం యావత్తు కర్నల్ సాహేబులవారికి మనవిచేసుకొని, వారి సెలవు ప్రకారం నడవవలెనని, బహువిధాలా బోధించి, వూరడించి తెలియచెప్పగా, పెద్దమనుష్యులద్వారా ఆ నీలమ్మ చక్రమ్మగారు సహా, యీ చెన్నమ్మ గారితో మంచిపని అయినా, చెడ్డపని అయినా, నీ సమాధాన ప్రకారం నడవగలవారముఅని చెప్పుకొన్నందున, ఆ చెన్నమ్మగారు ఆ వుత్తరములను కొంచెము అంగీకరించి, యిందాక వ్రాసిన వకీలు శీనప్ప బాళప్ప నబీరివీరప్ప మొదలయినవారిని ప్రయాణంచేసి అంపగా, వారు అనంతపురానకు వచ్చి, మంద్రోల్ సాహేబులవారితో యావత్పూర్వోత్తరం మనివి చేయగా, వారు చిత్తానకు తెచ్చి, యీ అమ్మగార్లలో యీ సంస్థానం నడిపించతగిన బుద్ధిమంతులు యెవరని అడుగగా, పదిమంది సమ్మతించి పెద్దతనానకు యీ చెన్నమ్మగారిని నిక్షర్షచేసినారం అని మనవి అర్జి దాఖలుచేయగా, కర్నల్ సాహేబులవారు చిత్తగించి, యీ వసంతరాయుని దివసాల ఖర్చులకు షేషగి సహా హుకుం చేసి, ఖజానాకు సన్నదు యిచ్చిరి.

13. పిమ్మట, ఆ వకీళ్లు ముందు యీ వంశానకు యెవరు లేరు; పూర్వమందు
యీ రాజ్యానకు విజాపురం శీమ నుంచి వచ్చేటప్పుడు, వీరి వంశస్థులు కొం
తజనం అక్కడనే నిల్చిరి గనుక, వారిలో వొక చిన్నవాణ్ని పిలిపించి, పట్టా
భిషేకం చేయగలందులకు తమ అప్పణ కావలెనని తిరుగా అప్పుడే అర్జీ
దాఖల్ చేసుకొన్నదిన్ని ఆ మంద్రోల్ సాహేబులవారు చిత్తగించి, అదే
ప్రకారం సెలవు యిచ్చిరి గనక, ఆ వకీళ్లు సిద్ధరామపురం పోయి, ఆ
చెన్నమ్మ మొదలయిన అమ్మగార్లతో నున్ను, వసంతరాయని మామగారు
అయిన నబీగౌడు మొదలయిన పెద్దమనుష్యులతో నున్ను, యీ వర్తమానం
చెప్పగా, వారు విని, ఆ వకీళ్లతో, నిజాంపురం తాలూకా బాగవాడి అనే
పరగణాలో ముత్తిగె ౧, వడవడగి ౧, యీ రెండు గ్రామాలలో, మూల
పురుషుడు అయిన లక్కినాయకునికి, బాలద హనుమప్పనాయకుడు ౧, బ
ళగానాయకుడు ౧, అని యిద్దరు కొమాళ్లు. వారిలో, ఆ బాలద హను
మప్పనాయకుని సంతతివారు యీ అనంతపురం బళ్లారి ప్రాంత్యానకు
వచ్చిరి. బళగానాయకుని సంతతివారు అక్కడనే నిల్చిరి. యిందుకు హద్దు
లు హండేవారి గుమ్మట సమాధి మొదలయినవాటి పైన గుర్తులు వున్నవి.
సేము చూచినది నిజమని చెప్పి, వారితో కూడా ఆలమూరు కరిబసవప్ప౧,
బుక్కపట్నం మఠం శివలింగదేవర జనం ౧, నగరి తాలూకా చినరామన్న ౧,
గిడ్డమల్లప్ప ౧, కొట్టిగెబసవప్ప ౧, పెదకోటప్ప ౧, వీరు మొదలయినవా
రిని, చిన్నవాణ్ని పిలుచుకవచ్చే నిమిత్తమై పంపించగా, వీరందరున్ను సద
రు గ్రామాలకు పోయి, నబీగౌడు పెద్ద మనుష్యులు చెప్పిన సాదృశ్యము
లున్ను చూచి, ఆ బళగానాయుడి సంతతిలో శిద్దరామప్ప అనే పేరుగల
వొక చిన్నవాణ్ని నిష్కర్ష చేసి తీసుకవచ్చిరి,

14. తదనంతరం, యీ చిన్నవాణ్ణి పట్టపుదొర అయిన వసంతరా
యుని భార్య కళ్యాణమ్మగారి వడిలో, వేసినందున, ఆమె దత్తపుత్రుని
గా చేసుకొని, సంరక్షణచేస్తూ వుండగా, కొందరు దుర్జనులు నీలమ్మతో
చిన్నవాణ్ని తెచ్చి చెన్నమ్మగారు సాకుతూవున్నారు; ముందు నీ ప్రపం
చం యేమి నడిపించే యోచన కనుపడలేదు; నీవు ఆ చెన్నమ్మ చెప్పి

నట్టు విని వుండడానకు అతంత్రురాలవుగాళు; గనక, ప్రత్యేకంగా భాగం పంచుకొని, వేరై స్వతంత్రముగా వుండేది వుత్తమం అని బోధించగా, అందుకు ఆమె మనస్కరించి, అనంతపురానకు వకీలు వచ్చి సంబళం తీసుకొని పోతూ వుండగా, నీలమ్మగారి తమ్ముడున్ను యింకా వారి పక్షపాత జనమున్ను వచ్చి అటకాయించగా, సంబళం అట్టే కచేరిలోనే పడివుండెను. తదనంతరం, చెన్నమ్మగారి తట్టు వకీళ్లున్ను, నీలమ్మగారి తట్టు వకీళ్లున్ను హజూరికి పోయి, రెండు మూడు నెలలు పంచాయతి అయి హజూరులో నిష్కర్ష అయినది, చెన్నమ్మగారి తట్టు హిస్సాలు ౨, నీలమ్మ ఓక్రమ్మగారి రుసుములు ౨కి హిస్సా ౧, వుభయం ౩ మూడు హిస్సాల మీద సంబళం నిష్కర్ష అయి, తాలూకు మజుకూరు తహశ్శీలుదారు నరశింగరాయని వారిపేరట పరవానా సాదరు అయినందున, తీర్పు ఆయెను. యిందుకు సాక్ష్యం కర్నల్ సాహేబులవారి పరవానా. యీ ప్రకారం ఆయెను.

15. తదనంతరం, యీ చెన్నమ్మగారి నగరిలో దొంగలు చొరబడి, సొత్తులన్ని పోయినందువల్లనున్ను, తమకున్ను నీలమ్మగారికిన్ని కలహంగా వున్నందున, యీ చిన్నవానికి యేమి వుపద్రవం వచ్చునో అని మనస్సుకు అందేశా పుట్టి, హాజరత్ కర్నల్ సాహేబులవారు పులివెందల ఆ ప్రాంత్యాలయందు వుండగా, అక్కడికి వకీళ్లను పంపించి, యీ శిద్దరామపురంలో వుండే దానికి రాజీ లేదు; తాలూకు మజుకూరులో చేరిన మాజే కొరకోడు అనే గ్రామంలో వుండడానకు అప్పణ అయితే, అక్కడ యిల్లు చేసుకొని వుంటున్నాము అని, అర్జీ యిమ్మనగా అదే ప్రకారం వారు అర్జీ యిచ్చినందున, ఖామందులవారు చిత్తగించి, కొరకోడులో వీరు కోరిన జాగా యిప్పించమని, ఆమీలు నరశింగరాయనివారికి అధికారపత్రిక అయినందున, అదేప్రకారం వారు కొరకోడు రెడ్డి కరణాలను పిలిపించి, రెండు యిండ్లు యిప్పించుమని తాకీదు చేయగా, వారు అదే ప్రకారం రెండు యిండ్లకు స్థళం యిప్పించినందున, యిన్నూరు వరహాలు ఖర్చు చేసి, నగరు కట్టించి, చేదు బావి తోవ్వించి, ఆ శిద్ధరామపురం విడిచి, కొరకోడు వచ్చి చేరిరి.

16. తదనంతరం, ఆ చిన్నవాడైన శిద్దరామప్పనాయుడు మంజూరు కావలెనని, మండ్రోలు సాహేబులవారు ఆదవానిమకాం మీద వుండగా, అక్కడికి యీ చెన్నమ్మగారున్ను యీ శిద్దరామప్పనాయుడున్ను వకీళ్లు మొదలయినవారున్ను పోయినంతట, వారు ఆ చోటు విడిచి, గుత్తి తాలూకు వ్రేష్ఠపాడు దగ్గిర దిగి వుండగా, అక్కడికి పోయి దర్శనం అయి, లోగడ అనంతపురంలో అర్జీ చేసి తమ అప్పణ అయిన ప్రకారం చిన్నవాణ్ని తీసుకవచ్చినాము అని, మనవిచేయగా; యీ వర్తమానం యావత్తు విని, ఆ చిన్నవాణ్ని సంరక్షణచేయండి అని చాలా దయచేత వుత్తరవు యిచ్చిరి. గనుక, వారివద్ద అప్పణ తీసుకొని, సంతోషముతో తిరుగా కొరకోడు వచ్చి చేరిరి. తదనంతరం, కర్నల్ సాహేబులవారు విలాయితికి పోయిన పిమ్మట, కొడికొండ జిల్లా చేసిన త్రైవార సాహేబులవారు వచ్చిరి. వీరు పోయిన తర్వాత, గేహంగ్ సాహేబులవారు వచ్చి, కల్కటరు హూదా విచారిస్తూ వుండగా ఆ వకీళ్లు యీ చెన్నమ్మగారు సాక్షాన్న శిద్దరామప్పనాయుని వారిని అనంతపురానకు పిలుచుకవచ్చి హుజరతు వారి భేటి చేయించి, లోగడ కర్నల్ సాహేబులవారి అప్పణ అయిన వివరమున్ను, వారు సెలవు యిచ్చిన అభిప్రాయమున్ను, గుత్తి మకాం మీద వారి భేటి అయినదిన్ని, యీ యావద్వర్తమానం వినికి చేయగా, వారున్ను అదేప్రకారం సెలవు యిచ్చిరి.

17. పిమ్మట, తాము తిరుగావచ్చేటప్పుడు బసవేశ్వరుని దేవాలయానకు వచ్చి దర్శనం చేసుకొని, పేట వెంబడి ఛత్రి, చౌరి, హాళది, వుడాస్ పావడ, అనే బిరుదులతోనున్ను, భట్లకైవారముతో కూడా దిగిన స్థలానకు వచ్చి చేరిరి. యీప్రకారం ఆ అనంతపురములో అయిదారు దివసములు వుండి, ధణీల సెలవు తీసుకొని, కొరకోడు వచ్చి చేరిరి. యీప్రకారం కొన్ని దినములు జరిగిన పిమ్మట, గుత్తి తాలూకా గల్లు అనే గ్రామంలో పూర్వం నుంచి పరంపరగా బంధుత్వం గల జగ్గుల సక్రప్ప కుమార్తె అయిన అయిదు యేండ్ల వయస్సు గల లింగమ్మ అనే చిన్నదాన్ని తీసుక వచ్చి, సాక్షి తాంబూలం పంచి, యీ శిద్దరామప్పగారి భార్య అని నిష్కర్ష చేసి, కులాచార పద్ధతిగా, తమ సంస్థానం మర్యాద ప్రకా

రం ఆ చిన్నదాన్ని పిలుచుకవచ్చి, నగరిలో వుంచుకొని, సంరక్షణ చేస్తా వున్నారు.

18. శాలీవాహనశకం ౧౭౩౩ అగునేటి ప్రజోత్పత్తి నామ సం॥ వైశాఖ శు ౧౫ల సరికి జీవంతుడై వున్నాడు. యీ హండేవారి మర్యాదలు; వీరు శివభక్తులు. లింగవంతులు. వీరికి కులదైవమున్ను యిష్టదైవమున్ను అయిన విజాపురం శీమలో వున్న సొన్నలాపురం శిద్ధరామేశ్వరుణ్ని గాని, యితర దేవతలను కొలవరు. శివపూజ చేయక గాని, గంగపానం చేయరు. మధురాహారము లే గాని, మధు మాంసభక్షణ చేయరు. యీడేరిన చిన్నదాన్ని వివాహము చేసుకోరు. కాలప్రమాణం తీరి నష్టము అయితే, వీరశైవాచారపద్ధతిగా సమాధి చేస్తున్నారు.

సమాప్తము.

BIBLIOTHECA BODLEIANA

Φιλος

γ